ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY





స రి గ మ లు పలికితే సంతోషం

—ఫోటో: ఏ. వి. రామమూర్తి]


మీకున్నూ- సినీమా తారకున్నట్టే
పట్టువంటి చర్మసౌందర్యము కలుగును
పట్టువంటి చర్మసౌందర్యమును నిలుపుకొనుటకు..."నేను ఎల్లప్పుడూ శుద్ధమైన, తెల్లని లక్స్ టాయిలెట్ సబ్బును వాడుచున్నాను." అని సొగసైన ఇ. వి. సరోజ చెప్పుచున్నది. పరిమళమైన లక్స్ టాయిలెట్ సబ్బు యొక్క మెత్తని నురగ చర్మసౌందర్యమునకు ఎంతో మంచిది, దానిని మీ చర్మసౌందర్యముకోసం మీరు కూడా ఎందుకు వాడగూడదు? జ్ఞాపకముంచుకోండి, లక్స్ టాయిలెట్ సబ్బుతో స్నానము ఆనందదాయకము.
శుద్ధమైన, తెల్లని లక్స్ టాయిలెట్ సబ్బు
LTS. 600-X52 TL
హిందుస్థాన్ లివర్ లిమిటెడ్ వారి ఉత్పత్తి
LUX
TOILET SOAP
సినీమా తారలకు
సౌందర్యమునిచ్చే సబ్బు

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక

సంవత్సర చందా
రు. 13—0—0
విడిప్రతిక 25 న.పై.


Founder: K. NAGESWARA RAO

విలంబి మాఘ శుద్ధ దశమి బుధవారం

సంపుటము 53
సంచిక 21
18-2-59

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
చందమామా వారి "సిపాయికూతురు"లో
జమున



రూర్కెలా, భిలాయ్

ఒక దేశం పారిశ్రామికంగా ఎంత అభివృద్ధి అయిందో లెక్క వేయటానికి మొదటగా చూడవలసింది ఆ దేశం ఎంత ఉక్కు ఉత్పత్తి చేస్తోందీ, ఎంత ఉక్కు ఉపయోగిస్తోందీ అనే రెండు విషయాలు.

పారిశ్రామికంగా గొప్ప అభివృద్ధి సాధించిన అమెరికా 10 కోట్ల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తోంది. రష్యా 5 కోట్ల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తోంది. బ్రిటన్, పశ్చిమ జర్మనీలలో రెండేసి కోట్ల టన్నుల ఉక్కు తయారవుతోంది. ఉక్కు పరిశ్రమ మీద మిగతా పరిశ్రమలు, ఉక్కు ధరల మీద మిగతా వస్తువుల ధరలు, ఉక్కు కార్మికుల జీతాల మీద మిగతా కార్మికుల జీతాలు సాధారణంగా ఆధారపడి ఉంటాయి. ఈనాటి మానవుడి జీవితం ఉక్కు పునాది మీద నిలిచి ఉంది.

భారతదేశపు భారీ పరిశ్రమాభివృద్ధికి ఈ మాసారంభంలో పునాదులు పడ్డాయి. 3 వ తేదీ నుంచీ రూర్కెలా ఉక్కు కర్మాగారమూ, 4 వ తేదీనుంచీ భిలాయ్ ఉక్కు కర్మాగారమూ పని మొదలుపెట్టాయి. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ వీటికి ప్రారంభోత్సవం చేశారు.

అదివరకు భారతదేశంలో ఉక్కు పరిశ్రమ లేదని కాదు. కాని దేశావసరాలకు తగినంతగా ఉక్కు ఉత్పత్తి వృద్ధి కాలేదు. ఏటా కొన్ని కోట్ల ధనం వెచ్చించి ఉక్కు దిగుమతి చేసుకోవలసి వస్తోంది. రెండవ ప్రణాళిక ముగిసేనాటికి ఉక్కు ఉత్పత్తి 60 లక్షల టన్నులకు పెరుగుతుందంటే మనం ఎంత వెనకబడి ఉన్నామో ఊహించుకోవచ్చును. అప్పటికీ ఈ అభివృద్ధి సామాన్యమైందికాదు; తేలిగ్గా సాధించింది కాదు. ఎన్నో కష్టనష్టాలకు లోనై సాధించుకున్న మహత్తరవిజయమిది; కొన్ని వందలమంది ఇంజనీర్లు, కొన్ని వేలమంది కార్మికులు రాత్రింబగళ్ళు కష్టపడి నెరవేర్చిన మహాకార్యమిది.

రూర్కెలా కర్మాగారానికి ప్రారంభోత్సవం చేస్తూ రాష్ట్రపతి పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ పారిశ్రామిక ప్రాంతం "భారత కెశిపురూర్" గా పరిణమించగలదని ఆశాభావం వెలిబుచ్చారు.

రూర్కెలా కర్మాగారం కలకత్తా — బొంబాయి రైలుమార్గంలో కలకత్తాకు 257 మైళ్ళదూరాన ఉన్నది. ఇక్కడ 10 లక్షల టన్నుల ముడి ఉక్కు తయారవుతుంది. ఇది 7 20,000 టన్నుల ప్లేట్లుగా, షీట్లుగా, ముక్కలుగా రూపొంది అమ్మకానికి సిద్ధమవుతుంది. ముందు ముందు ఈ కర్మాగారంలో 20 లక్షల టన్నుల ఉక్కు తయారుచేయటానికి వీలైన పథకాలున్నాయి.

ఈ కర్మాగారం నిర్మించటానికి పశ్చిమ జర్మనీ ఆర్థిక సహాయమూ, సాంకేతిక సహకారమూ అందజేసింది. దీనికి రూ. 128



రూర్కెలా, భిలాయ్

...లు కావల్సివస్తుందని ప్రణాళికలో అంచనా వేశారు. కాని ధరలు పెరగటం, కర్మాగారంలో కొన్ని మార్పులు చేయటం మొదలైన అనేక కారణాలవల్ల ఈ అంచనా రూ. 170 కోట్ల దాకా పెరిగింది.

రూర్కెలాకు బొగ్గు బీహార్‌లోని బొకారో, కర్గాలీ, ఝూరియా గనులనుంచి వస్తుంది. సున్నపురాయి 15 మైళ్ల దూరంలో ఉన్న హాతిబారి, బీర్‌మిత్రపూర్‌లనుంచి వస్తుంది. ముడి ఇనుము 50 మైళ్ల దూరంలో ఉన్న బర్సువా గనులనుంచి వస్తుంది.

భిలాయ్

భిలాయ్‌కూడా కలకత్తా-బొంబాయి రైలు మార్గంలో నాగపూర్‌కు 166 మైళ్ల దూరాన ఉంది. ఈ కర్మాగారంకూడా 10 లక్షలటన్నుల ముడి ఉక్కు ఉత్పత్తిచేస్తుంది. ఈ ఉక్కు 7,70,000 టన్నుల బిలెట్లు, రెయిల్సు మొదలైనవిగా రూపొంది అమ్మకానికి వీలుగా సిద్ధమవుతుంది. ముందు ముందు ఇక్కడ 25 లక్షల టన్నుల ఉక్కు తయారు చేయటానికి వీలుగా పథకాలు వేశారు.

దీనికి ముడి ఇనుము 60 మైళ్ళదూరంలో ఉన్న రాజహారా గనుల నుంచీ, బొగ్గు బొకారో, కర్గాలీ, ఝూరియా, మధ్యప్రదేశ్‌లోని కోర్బా గనులనుంచీ, సున్నపురాయి 12 మైళ్ళదూరంలోని నందిని గని నుంచి వస్తాయి.

భిలాయ్ కర్మాగారానికి సోవియట్ రష్యా ఆర్థిక, సాంకేతిక సహాయం చేసింది. దీనికి రూ. 110 కోట్లు ఖర్చవుతుందని ప్రణాళికలో అంచనా వేశారు. కాని పథకంలో చేసిన మార్పులవల్ల ఈ అంచనా రూ. 131 కోట్ల వరకూ పెరిగింది.

మొన్న మొన్నటి దాకా రూర్కెలా, భిలాయ్ కర్మాగారాల పరిసరాలు నిర్జనారణ్యాలుగా ఉండేవి. ఈనాడక్కడ జనాకీర్ణమైన నగరాలు లేచాయి. సమస్తమైన ఆధునిక సౌకర్యాలూ యిక్కడ ఏర్పాటు చేశారు. రూర్కెలాలో ఇంజనీర్లూ, కార్మికులూ కలిసి 55,000 మంది ఉన్నారు. భిలాయ్‌లో 65.000 మంది ఉన్నారు. భిలాయ్‌లో 842 మంది రష్యన్ ఇంజనీర్లు పనిచేస్తున్నారు.

ఇప్పుడు రూర్కెలా, భిలాయ్ కర్మాగారాలో పని మొదలుపెట్టింది ఒక్క మరకొలిమి మాత్రమే. ఇంకా అక్కడొక రెండు మరకొలుములు, ఇక్కడొక రెండు మరకొలుములు తయారు కావలసి ఉంది. ఆ తరవాత ఉక్కు కరిగింపు మిల్లులు, రోలింగ్ మిల్లులు తయారు కావలసి ఉంది. ఇవన్నీ రెండవ ప్రణాళిక ముగిసేలోగా పూర్తి అయి అనుకున్న అంచనా మేరకు ఉక్కు ఉత్పత్తిచేస్తాయి. దుర్గాపూర్‌లో బ్రిటిష్ సహాయంతో నిర్మితమవుతున్న ఉక్కు కర్మాగారంకూడా ప్రణాళిక ముగిసేనాటికి తయారవుతుంది. ఈ మూడు కర్మాగారాలవలన భారతదేశపు ఇంజనీరింగ్, నిర్మాణ పరిశ్రమలకు సరిపడినంత ఉక్కు లభిస్తుంది. ఆవిధంగా ఎంతో విదేశీ ద్రవ్యం ఆదా అవుతుంది. భారతదేశపు భారీపరిశ్రమలకుసుస్థిరమైన ఆధార పరిశ్రమ ఏర్పడుతుంది. ★

ఉక్కు ఎలా తయారవుతుంది?

ఉక్కు కర్మాగారం అనేక శాఖోపశాఖలతో కూడిన సంక్లిష్ట పరిశ్రమ. ప్రధానంగా ప్రతికర్మాగారంలోనూ నాలుగు శాఖలుంటాయి. నాలుగవశాఖలోగాని ఉక్కు తయారై బయటపడదు.

మొదటిశాఖ: గనుల్లోంచి ముడి ఇనుము తీసినప్పుడు అందులో మట్టి వగైరా అనేక మకిలి పదార్థాలు మిళితమై ఉంటాయి. వీటిలోంచి ఇనుము విడదీయటానికి కోక్ నిప్పు ఉపయోగిస్తారు. రాతిబొగ్గులోంచి కోక్ తయారు చేయటానికి బట్టీలుండటం అవసరం. కనుక ఈ కోక్ బట్టీలు కర్మాగారంలో మొదటిశాఖ.

రెండవశాఖలో ముడిఇనుమునుంచి మంచి ఇనుము విడదీస్తారు. ఈ పని మరకొలుముల్లో జరుగుతుంది.

మూడవశాఖలో ఇనుమును కార్బన్ మొదలైన ఖనిజాలతో మిళితంచేసి కరిగించి ఉక్కు తయారు చేస్తారు. దీన్ని ఉక్కు కరిగింపుశాఖ అంటారు

ఈ ఉక్కును అసలంగా ఉపయోగించటానికి వీలుండదు. అందుచేత విక్రయానికి వీలైన ఆకారాలలోకి ఆ ఉక్కును మారుస్తారు. దీనికి రోలింగ్ మిల్లులవసరం. షీట్లు, ప్లేట్లు, రెయిల్సు స్లీపర్లు మొదలైన అనేకరకాలుగా ఉక్కు రూపాంతరం చెందుతుంది. ఇది నాలవశాఖ.


రాజధాని కబుర్లు

డాక్టర్ ఎస్. వి. సుబ్బారావు

స్తోహతీపరులు పలువురు రాజకీయవేత్త లౌతున్నారు. ఇది దేశానికి మంచిదని మనం గట్టిగా చెప్పలేం. అధికారంలో ఉన్న వ్యక్తులు తమకు సాహిత్యంతో పరిచయం కలదని భ్రమపడి కవిత్వం పలకడం ప్రారంభిస్తున్నారు. ఇది దేశానికి మంచిదని అసలే చెప్పలేం.

మనిషెప్పటిస ప్రతీవాడికి 'కవిత్వం' పలకడానికి హక్కుంది. దీనివల్ల ఎన్ని ప్రమాదాలున్నా, కాలం ఆ ప్రమాదాలను తొలగిస్తుంది. కాని రాజకీయ వేత్తలు తాము విద్యావేత్తలమని భ్రమించి విద్యావిధానాలను సవరించడానికి చేసే యత్నాలవల్ల కలిగే ప్రమాదాల పరిణామాలు ఊహించడానికికూడా కష్టమైనవి.

ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షునిగా డా॥ డి. సదాశివరెడ్డి నియామకం విషయంలో జరిగిన గందరగోళం పాఠకులు మరిచిపోయుండరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించబడిన నాటినుంచి రాష్ట్రప్రభుత్వంలో అధికారంలో ఉన్న వ్యక్తుల దురభిప్రాయాలు, దురభిమానాలు ఈ విశ్వవిద్యాలయంపై ప్రయోగించబడుతూ వచ్చాయి. అధికారుల ప్రభావం కొన్ని కొన్ని సమయాల్లో మంచికి ఉపయోగపడింది. కాని సాధారణంగా చెడు పరిణామాలకే దారి తీసింది.



డాక్టర్ ఎస్. వి. సుబ్బారావు

చారిత్రకుడుగా యావద్భారతదేశంలో ప్రసిద్ధికెక్కిన ఆంధ్రుడొకడు ఉస్మానియా భవనం కొత్తగా నిర్మించబడిన రోజులో హైదరాబాదు వచ్చాడు. అప్పట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయపు ఉపాధ్యక్షుడు గర్వంగా ఆయన్ని భవనంచుట్టూ తిప్పి చూపించాడు. చూపించి అన్నాడు: 'మాశారా? మాయూనివర్శిటీభవనం ఎంత సుందరంగాఉందో!' అని.

"ఔనండీ! రాష్ట్రంలో విద్యపై తాజ్ మహాల్ నిర్మించారు" అని సమాధానం చెప్పాడా చారిత్రకుడు.

అసమంజసంగా అభిప్రాయాలు వెలిబుచ్చడం ఆ చారిత్రకునికి అలవాటు. ఈ అభిప్రాయప్రకటన ఆ విశ్వవిద్యాలయాధికారి మనస్సుకి చాలాకష్టం కలిగించుండాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఒక విశిష్టమైన రూపకల్పన చేయాలని ఆనాటి హైదరాబాదు ప్రభుత్వం ఎంతో ప్రయత్నించింది. సాంకేతిక పదాలను దేశిభాషలోకి అనువదించడం అసాధ్యమైనపని అని. అంగుళల మరికొన్ని సంవత్సరాలు కళాశాలల్లో విద్యాబోధన ఆంగ్లభాషలోనే జరగాలని వాదించడం మన ప్రభుత్వాలకు పరిపాటి అయిపోయింది. ఉర్దూ బోధనాభాషగా ఉస్మానియాలో విద్యాబోధన నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభం ఐందని మన ప్రభుత్వాలు గమనించవు.

ఉర్దూలో బోధన సాగించి భవిష్యత్తులోకి సాగిపోయింది ఉస్మానియా. ఆంగ్ల భాషను పట్టుకు వేలాడి భూతకాలంలోనే మిగిలిపోయాయి మిగిలిన విశ్వవిద్యాలయాలు. ఈ కారణంవల్ల ఉస్మానియా విద్యార్థులకీ మిగిలిన విశ్వవిద్యాలయాలకీ మధ్య ఒక పూడ్చరాని అగడ్త పెరిగిపోయింది.

ఒక భారతీయ భాషను బోధనాభాషగా నిర్ణయించడం ప్రశంసార్హమైన విషయమైనా, రాష్ట్రప్రజల భాషలతో నిమిత్తం లేని భాషను బోధనాభాషగా నిర్ణయించడం అవాంఛనీయమైన పరిణామాలకు దారితీసింది. ఆంగ్లభాషా విద్యాధికులకు ప్రజలకు ఎంత దూరమో దాదాపు అంత దూరం ఉర్దూ భాషాకోవిదులకు ప్రజలకు మధ్య ఏర్పడింది.

ఒక మతానికి, లేక ఒకవర్గానికి చెందిన వ్యక్తులే ఉస్మానియాలో ఉన్నత పదవులకు ఎన్నుకోబడ్డం మరో అవాంఛనీయమైన పరిణామం.

* * *

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రసాయనిక శాస్త్రశాఖకి ప్రధానాచార్యులు శ్రీ వందూరి వెంకటసుబ్బారావు. సౌమ్యతకీ, సహృదయతకీ అధ్యాపకవర్గంలోను విద్యార్థివర్గంలోను వీరు మంచి పేరు తెచ్చుకొన్నారు. డాక్టరు ఎస్. వి. గా విద్యార్థుల హృదయాలలో స్థానం కల్పించుకున్నారు.

డాక్టరు ఎస్. వి. ఉస్మానియా రిజిస్ట్రారు పదవికి తాత్కాలికంగా నియమింపబడ్డారన్న వార్త విద్యార్థులు, అధ్యాపకులు సంతోషంతో స్వీకరించారు. ఈ నియామకంపట్ల సంతోషం ప్రకటించనిది డాకరు ఎస్. వి. మాత్రమే.

ఉస్మానియా ఉపాధ్యక్షులుగా నియమించబడ్డ డా॥ డి. సదాశివరెడ్డి సమర్థులు, విద్యావిషయిక రంగంలో ఎనలేని కృషి చేసినవారు. వారి నియామకానికి ప్రతికూలంగా ఆందోళనజరిపిన విద్యార్థులకుకూడా, వారిపట వ్యక్తిగతంగా ఎట్టి వ్యతిరేక భావం లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పాతుకుపోయిన అసమరతనీ అవినీతిని పారద్రోలడానికి డా॥ డి. ఎస్. రెడ్డివంటి సమరులు అవసరం.

★ రాజధాని కబుర్లు ★

కాని డా॥ రెడ్డి పదవి విషయంలో నిశ్చిత పరిస్థితి జయిన సమర్థవంతంగా పనిచేయడానికి అవకాశం లేకుండా చేసింది.

అయినా ఇటువంటి అయోమయపరిస్థితిలో పెట్టడంవల్ల మనం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని విమర్శించకుండా ఉండలేం.

ఉస్మానియాలో ఎన్నడూ లేనిరీతిగా రిజిస్ట్రార్ పదవికి ప్రాముఖ్యత ఉంది. ఉపాధ్యక్షుల పదవీ నిర్వహణ విషయంలోని అనిశ్చిత పరిస్థితి రిజిస్ట్రార్ పదవి ప్రాముఖ్యమును పెంచింది. ఇంతవరకు తెలుగువారెవ్వరూ రిజిస్ట్రారు పదవికి నియమించబడలేదు. డా॥ ఎస్. వి. ఆ పదవిని అలంకరిస్తున్న తెలుగువారిలో ప్రథముడు.

డా॥ సుబ్బారావుకి పరిశోధనా కార్యనిర్వహణలో అభినివేశం ఎక్కువ. కాని కోటి ముప్ఫైలక్షల రూపాయల ఖర్చు చేసే ఉస్మానియా అభివృద్ధి పథకం విషయంలో నేమి, మూడేళ్ల డిగ్రీ తరగతులు ప్రవేశపెట్టడం విషయంలో నేమి, ఆయన చేసిన కృషి అధికారులమెప్పు వారికి తెచ్చింది.

సుమారు 45 సంవత్సరాల వయస్సుగల ఎస్. వి. రిజిస్ట్రారు పదవి తమకు వలదన్నారట. వారు పదవీభారం వహించక తప్పదన్నారట అధికారులు. ఎస్. వి. ను దృష్టిలో పెట్టుకొని ఈ పదవి తాత్కాలికమైనందుకు సంతోషిస్తున్నాం. కాని ప్రజాశ్రేయస్సు దృష్ట్యా వారికి పదవి శాశ్వతమౌతుందని ఆశిస్తున్నాం.

బ్రహ్మానందం : ఆహ్లాదం

ఆంధ్రప్రదేశ ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారిని గురించి వ్రాస్తూ, ఇంద్రజాలికునిగా వర్ణించాను ఆయన్ని. వారు సార్థకనాములు. 'కాసు' వారు ఆర్థికమంత్రి కావడం సమంజసం. అంతేకాదు—ఎప్పుడూ నవ్వుతూ కులాసాగా మాట్లాడుతూ ఉండే ఆయన పేరు 'బ్రహ్మానంద'రెడ్డి కావడం సమంజసం.

జాతీయ విద్యార్థి సమాఖ్య ప్రతినిధులను, హైదరాబాదు క్రికెట్ దళ సభ్యులను కలుసుకునే నిమిత్తం బ్రహ్మానందరెడ్డి ఈ వారంలో చిన్న అల్పాహారవిందు ఏర్పాటుచేశారు. ఖైరతాబాదులోని వారి స్వగృహావరణలో జరిగింది ఈ విందు. 'చిన్న అల్పాహార విందేమిటి?' అంటారు మీరు. 'హాట్ అండ్ స్వీట్' అన్నమాట. కాలం దృష్ట్యా హాట్; చుట్టూ వాతావరణం దృష్ట్యా స్వీట్.

పవిత్రమైన తెలుగువారి ఆచారాన్ని అనుసరించి శ్రీ బ్రహ్మానందరెడ్డి బయట నిలబడి అతిథులను ఆహ్వానించారు. విజయవాడ నుంచి మధ్యాహ్నం వచ్చి రాత్రి శ్రీశైలం వెళ్ళిపోతూన్న ముఖ్యమంత్రి, నాలుగు గంటలే రాజధాని నగరంలో ఉన్నా, ఒక గంట అతిథులమధ్య గడిపారు. విద్యార్థులు, ఆటగాళ్ళు, పత్రికా ప్రతినిధులు కూచున్న బల్లలదగ్గరకు పోయి కూచుంటూ, ఒక బల్ల దగ్గర బిస్కట్టు తిని, ఇంకో బల్ల దగ్గర టీ తాగి, మరో బల్ల దగ్గర పాన్ వేసుకున్నారు.

మంత్రులందరూ వచ్చారు దాదాపు. ఒకింతసేపు మంత్రాంగం మరచిపోయి విద్యార్థుల మనసులు ఆకట్టుకున్నారు.

విద్యార్థి ప్రతినిధులను ముఖ్యమంత్రికి పరిచయం చేశాడు ఒక విద్యార్థి నాయకుడు. విద్యార్థి ప్రతినిధులను ఆర్థిక మంత్రికి పరిచయం చేశాడు మరొక విద్యార్థి నాయకుడు. ఈ 'ముఖ్యమంత్రి' ఆ 'ముఖ్య' మంత్రి విద్యార్థుల మధ్య తిరుగుతూ, ఒక బల్ల దగ్గర కలుసుకున్నారు. నిలబడ్డ విద్యార్థుల మధ్యనుంచి దృశ్యం సరిగా కనుపించలేదు కాని, ఒకరికొకరు పరిచయం చేయబడి ఉంటారని, మధురమందహాసాలతో పరస్పర వందన స్వీకారం చేసుకొని ఉంటారని నా ఊహ.

ఈ కార్యక్రమంలో ఆహ్లాదకరమైన మరో అంశం శ్రీమతి [illegible]ంక సరళ ('కాదు సుమా కల కాదు సుమా' ఫేమ్), శ్రీ యం. చిత్తరంజన్ కలిసి, విడివిడిగా పాడిన పాటలు. శ్రీమతి సరళ కంఠం శ్రోతలకు సినీ ప్రేక్షకులకు పరిచయమే; శ్రీ చిత్తరంజన్ కంఠం ఆకాశవాణి శ్రోతలకు క్రొత్తకాదు. మనోహరమైన రెండు కంఠాలు కలిసి తన్మయత కలిగించాయి ప్రేక్షకులకు. శ్రీమతి సరళ పాడిన గజల్ ఉచ్చారణ దృష్ట్యా ఉరూభాషా కోవిదులకు కూడా ఆనందం కలిగించింది. 'వన్స్‌మోర్' అన్నారు ప్రేక్షకులు.

మంత్రులు కూడా పాటలు పాడాలన్న కోరిక వెలువడింది గాని కార్మికమంత్రి శ్రీ సంజీవయ్య అతిథుల కోరికలను మన్నించక పోవడంవల్ల మంత్రులెవ్వరూ ముందుకు రాలేదు.

సారథీ కార్యక్రమం:

గతవారంలో మరో ఆహ్లాదకరమైన కార్యక్రమం సారథీ స్టూడియోస్‌లో జరిగింది. ఆంధ్రాభ్యుదయోత్సవాలలో బహుమతులు పొందిన కొందరికి బహుమతులిచ్చి, బహుమతి ప్రదానోత్సవం చేశారు సారథీస్టూడియో వారు.

ఉత్సవాలకు అలంకరణచేయడం సినీమా ప్రముఖులకు ఒకరు నేర్పవలసింది ఏముంటుంది? సారథీ ఆవరణ అందంగా అలంకరించబడింది. సినీ నటుడు జగ్గయ్య, నటి రాజసులోచన అతిథులలో ఉండడం ఒక ఉత్సాహ కారణం.

సారథీ సంస హైదరాబాదులో నెలకొల్పిన నాటినుంచి, రాజధానినగరంలోని సాంస్కృతిక కార్యక్రమాలలో భాగం పంచుకోవడానికి సంస్థ ప్రతినిధులు యత్నిస్తున్నారు. ఇదొక సంతోషింపతగిన విషయం. ముఖ్యంగా శ్రీయుతులు త పి నర్మారావు, త పి చాణక్య నగరంలో ప్రతిప్రముఖ సాంస్కృతిక కార్యక్రమంలోను వక్తలుగనో, ప్రేక్షకులుగనో పాల్గొంటున్నారు. సినీమా నాటకాలను పాడుచేసిందా, లేదా అన్నది చర్చనీయాంశమైనా, ఈ రెండు 'వ్యవస్థలు దగ్గరకురావడం ముదావహమైన విషయం.

'స్టేజి విలన్లు': (6) టేప్ రికార్డర్

గద్యనాటకాలతో తృప్తిపడని రచయితలు, గేయనాటికలు రచనకు పూనుకుంటున్నారు. నాటకసంస్థలు ప్రదర్శనలకు పూనుకొంటున్నాయి. గేయనాటికల ప్రదర్శనలో రసస్పృష్టికి అత్యంతరంగా విలుస్తూన్న సాధనం టేప్ రికార్డర్.

రంగస్థల ప్రదర్శనలోని అసౌకర్యాలను తొలగించడం నిమిత్తం ముందే పాటలు రికార్డుచేసి వెనకనుంచి ప్రసారం చేయాలని యత్నించడం సహజమే. కాని సమన్వయం కుదరనప్పుడు టేప్ రికార్డర్ చేసే ఘోరకృత్యాలకు మరే స్టేజివిలన్ ఒడిగట్టలేదు.

గత వారంలో ఒక గేయనాటిక ప్రదర్శించబడింది రాజధాని నగరంలో. రంగస్థలంపై నిలబడ్డ నటి 'స్వామీ, స్వామీ' అంటూ టేప్ రికార్డర్ పై రావలసిన పాటకై వేచి ఉండడం, ఆమె 'స్వామీ' అనడం ఎప్పుడు పూర్తిచేస్తుందా, ఎప్పుడు రికార్డరు మరలిప్పుదామా అని తెరవెనుక వేచి ఉండడం జరిగి, నాటిక రసాభాసలో పూర్తయింది.

పాటలు పాడిన నటి రంగస్థలంపై ఉన్నప్పుడు, పాటలామె చేతనే పాడించండి. పాటలు ప్లేబాక్ ద్వారా వినిపిస్తే, గాయక గాయనీమణులను తెరవెనుక కూచోమనండి. ఎంత చక్కని కంఠమైనా, రికార్డర్‌లో మనోహరంగా ఉండదు. మనోహరంగా ఉన్నా, రసాభాసతో కార్యక్రమం సమాప్తం కాకుండా ఉండాలంటే రికార్డర్ ఉపయోగించకపోడం మంచిది. ★



ఆజాద్ ఆత్మకథలో నెహ్రూపై ఆరోపణలు

మౌలానా ఆజాద్ ఆత్మకథ ఈమధ్య ప్రచురించబడింది. దీని ప్రచురణ కొన్ని వాదోపవాదాలు రగిలించింది. వీటితోబాటు విప్పరవ్వలు ఇప్పుడప్పుడే ఆరేటట్లు లేవు. కాంగ్రెసును పట్టుకుని ఉతికటానికి ఈ పుస్తకం కమ్యూనిస్టులకు మహా చక్కగా ఉపయోగపడుతుంది. పైగా ఈ పుస్తకం భారతీయ ముస్లిములను ఇరుకున పెట్టింది. మృతవీరుల స్మారకదినంనాడు జాన ప్రధాన మంత్రి ఒక ముఖ్య ప్రసంగం చేశారు. ముంచుకుపోయినట్టు సరిగ్గా ఈ సమయంలోనే ఈ పుస్తకం బయటికిరావటం చాలా శోచనీయంగా ఉంది.

ప్రధానమంత్రి తమ ఉపన్యాసంలో నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాల్ని, వ్యతిరేకించే వారిని, మూడవ ప్రణాళికను తిట్టిపోసే వారిని విమర్శించారు. సహకార వ్యవసాయాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవారు ఇద్దరూ కాంగ్రెసువాదులు. ఒకాయన శ్రీ సి. రాజగోపాలాచారి, ఇంకోయన శ్రీ కె. యం. మున్షి. భూమికిగరిష్ఠ పరిమితి నిర్ణయించటాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తి శ్రీ ఎన్.జి. రంగా. మౌలానాఆజాద్ ఏంరాశారో చూద్దాం:

"పండిట్ నెహ్రూ అప్పుడప్పుడు తను పటివరుండలికి మూడే కొట్టుకున్న ధోరణిలో ప్రవర్తిస్తారు. అంతేకాదు. సిద్ధాంతం మీద తనకున్న మోజు కొద్దీ, యథార్థ పరిస్థితిలోని సాధకబాధకాలను అట్టే పట్టించుకోరు. శ్రీ నెహ్రూ సాధారణంగా తనకు ఆ క్షణంలో ఏదితోస్తే అది చేస్తారు. ఒక నిర్ణయానికి వచ్చినతరువాత, ఆ నిర్ణయం ఫలితాలు ఎలా ఉంటాయీ అనే ఆలోచనే లేకుండా ముందుకు వెళ్లిపోవటమే తప్ప వెనక్కి చూడరు."

ఈ విమర్శ దృష్ట్యా ప్రధానమంత్రి ఇటీవల చేస్తున్న ప్రకటనలు చూస్తే, ఆహార ధాన్యాల విక్రయవ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం, భూవసతికి గరిష్ఠ పరిమితి నిర్ణయించటం, సహకార వ్యవసాయం మొదలైన విషయాలలో ఆయన వాటి ఫలితాల్ని గూర్చి ఆలోచించకుండా దూకుడుగా ముందుకు పోతున్నట్లు చెప్పక తప్పదు.

మౌలానా సాహెబ్ భారతదేశం రెండు ముక్కలు కావటం గూర్చి తన పుస్తకంలో ప్రస్తావించారు. ప్రధానమంత్రే ఈ విభజనకు చాలావరకూ బాధ్యులని మౌలానా ఖచ్చితంగా రాశారు. కాని నిజానికి ఇప్పటి చరిత్రను నిష్పాక్షికంగా రాయవలసివస్తే, భారత విభజనకు ప్రధాన బాధ్యత ప్రధాన మంత్రిది కాదనీ, మౌలానా నాయకత్వాన ఉండిన జాతీయ ముసల్మానులదే ననీ వెల్లడవుతుంది. కొందరు మూర్ఖులు. మౌలానాలు నాయకులైకూర్చున్నారు. నాయకులయ్యారే కాని వారికి అనుచరులులేరు. భారతదేశాన్ని విభజించటం ఇస్లాముకు వ్యతిరేకమనీ, ముసల్మానులకే అది నష్టమనీ ఈ నాయకులం తమకు బోలెడు అవకాశమున్నా ముస్లిములకు నచ్చచెప్పటానికి ప్రయత్నించలేదు. పెద్దపెట్టున ముస్లిములలో వీరు బాహాటమైన ఉద్యమం లేవదీయలేదు. తీర్మానాలు మటుకు చేస్తూ ఉండేవారు. వాటిని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నించలేదు. ఇంతెందుకూ_మౌలానా ఆజాద్‌కు కలకత్తా ముస్లిములతో మొదటినుంచీ సన్నిహిత అనుబంధం ఉండేది. ఈద్ ప్రార్థనలలో ఆయన పాలొనేవారు. అయినా ఆ కలకత్తా ముస్లిములే ఆయన నాయకత్వాన్ని తిరస్కరించారు. తమ మత నాయకత్వాన్ని తిరిగి సంపాదించుకునేందుకు ఆయన నేమీ ప్రయత్నం చెయ్యలేదు. జాతీయ ముస్లిమ్ నాయకులు ముస్లిములమీద కాకుండా ఎంతసేపూ హిందువులమీదే ఆధారపడి ఉండేవారు.

పాకిస్థాన్ ఏర్పడటానికి రెండు సంఘటనలు ముఖ్య కారణాలని మౌలానా రాశారు. 1937 లో యు. పి. లో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసే టప్పుడు, ముస్లిమ్‌లీగ్‌కు రెండుసీట్లూ ఇవ్వటానికి పండిట్ నెహ్రూ నిరాకరించారు. ఇది ఒకటి, తరవాత శ్రీ నెహ్రూ 1946 లో బొంబాయిలో పత్రికా విలేఖరుల గోష్ఠిలో మాట్లాడుతూ, కాబినెట్ మిషన్ పథకాన్ని మార్పుమని అడగటానికి కాంగ్రెసుకు ఎటువంటి అడ్డంకీ లేదని చేసిన ప్రకటన ఇంకోటి.

1936 లో కాంగ్రెసు అధ్యక్షపదవిమీద ఒక తగాదా వచ్చింది. ఆ సమయంలో సర్దార్ పటేల్ ఒక ప్రకటన చేశారు: "కాంగ్రెసు అధ్యక్షుడికి నియంతృ అధికారాలేం లవు. కట్టుదిట్టంగా, పకడ్‌బందిగా కట్టుకువచ్చిన కాంగ్రెసు సంస్థకు అతగాడు చైర్మన్ మాత్రమే. కార్యక్రమం సజావుగా జరిగిపోయేట్లు చూస్తూ ఉంటాడు. కాంగ్రెసు ఎప్పటికప్పుడు చేసే నిర్ణయాలను అమలుచేస్తూ ఉంటాడు. అంతే. ఒక వ్యక్తిని అధ్యక్షుడుగా ఎన్నుకున్నంత మాత్రాన అతడెంత పెద్దవాడైనా సరే-తన అధికారాలన్నిటినీ కాంగ్రెసు అతడికి ధారాదత్తం చెయ్యదు," అని.

ఈ ప్రకటనకు సమాధానమిస్తూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఇలా చెప్పారు:

★ స్వాధీన రేఖ ★

"సోషలిజం గురించి నా అభిప్రాయాలు నేను వెల్లడించాను. సోషలిజం సిద్ధాంతానికి నా వ్యక్తిత్వంమీద, నా ప్రవర్తనమీద ఎటువంటి ప్రభావం ఉందో స్పష్టంచేశాను. కాంగ్రెసులో నా అభిప్రాయాలను ఖచ్చితంగా చెప్పి అంగీకరించండని అడుగుతాను. కాని నా అభిప్రాయాల్ని చర్చించి, చచ్చులేకుండా తన నిర్ణయాన్ని తెలియజేయవలసిన బాధ్యత కాంగ్రెసుదే. ఊరికే వోటు చేసినంత మాత్రాన కాదు—సూటిగా తన నిర్ణయం తాను కాంగ్రెసు వెల్లడించాల్సిందే."

ఎప్పుడో మరిచిపోయిన ఈ ప్రకటనలను ఎందుకు ఉదహరిస్తున్నానంటే పండిట్ నెహ్రూ 1937 లోనూ కాంగ్రెసుకు ఏకచ్ఛత్రాధిపతి కాదు, 1946 లోనూ కాదు అని సూచించటానికి. సర్దార్ పటేల్ అన్నట్లు, కాంగ్రెసు కార్యవర్గానికి ఆయన చైర్మన్ మాత్రమే. అయితే బొంబాయి పత్రికా గోష్ఠిలో పండిట్ నెహ్రూ చేసిన ప్రకటనలోని నిజానిజాలను కాంగ్రెసు కార్యవర్గం ఎన్నడైనా సవాల్ చేసిందా? చేసి ఏమని చేసింది? పండిట్ నెహ్రూ చేసిన బొంబాయి ప్రకటన తప్పని మౌలానా సాహెబ్ రాశారు. మరయితే మౌలానా సభ్యుడుగా ఉన్న కార్యవర్గం సవరణ ప్రకటించిందా? ప్రకటించకపోతే ఎందుకు ప్రకటించలేదూ? అంటే, పండిట్ నెహ్రూ కాంగ్రెసు కంటే, దేశంకంటే గొప్పవాడనా అర్థం?

భారత విభజనకు కారణాలు ఫలానా అని మౌలానా ఆజాద్ తమకు తోచిన చరిత్ర తాము రాశారు. అది అవునో కాదో ఇంకొకళ్లు రాయకపోరు.

అసలు ఇందాక చెప్పినట్లు ఈ పుస్తకం ఈ సమయంలో వెలువడవలసింది కాదు. పశ్చిమదేశాల్లో అయితే, ఇలాంటి పుస్తకాలు ఆయా వ్యక్తులంతా జీవితరంగంనుంచి నిష్క్రమించాకగాని ప్రకటించరు. వేవెల్ పుస్తకాన్నీ, ఎమెరీస్వీయ కథలో ఇండియాకు సంబంధించిన నాల్గో భాగాన్నీ బ్రిటిష్‌వాళ్ళు ఇంకా ప్రచురించలేదు. ఇలాగే సర్దార్ పటేల్ ఉత్తరాలు కూడా ఇంకా ప్రచురించకుండా అట్టే పెట్టి ఉంచారు.

గడచిన పదేళ్ల చరిత్రనూ ఒకసారి సింహావలోకనం చేస్తే, దేశవిభజనవల్ల హిందూ ముస్లిములకు మేలే జరిగిందని జనసంఘం కూడా ఒప్పుకోవలసిందే. కాబినెట్ మిషన్ పథకం ప్రకారం దేశంమీద హిందీరుద్దటం, గోవధ నిషేధించటం అసాధ్యమై ఉండేది. పంచవర్ష ప్రణాళికలు రెండూ ధ్వంసమై ఉండేవి.

* * *

మూడో పంచవర్ష ప్రణాళికమీద దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ ప్రణాళిక నిజంగా బ్రహ్మాండమైన, సమగ్రమైన ప్రణాళికగా తయారుకావాలని ప్రధానమంత్రి సంకల్పం. జనాభా పెరుగుదలను అనుసరించి ప్రణాళిక లక్ష్యాలను నిర్ణయించాలని మాజీ ఆర్థికమంత్రి శ్రీ చింతామణ్ దేశ్‌ముఖ్ అభిప్రాయం. పదివేల కోట రూ.ల పెట్టుబడితో ప్రణాళిక తయారుకావాలని ప్రొఫెసర్ మహలానోబిస్ సూచన. ముఖ్య ఆర్థిక సలహాదారు శ్రీ జె. జె. అంజారియా రూ. 9 900 కోట్లు చాలని అంటున్నారు. మొత్తంమీద ప్రణాళిక భారం ప్రజలు భరించగలరా లేరా అనే దానికి పట్టినట్లు లేదు గాని, పదివేల కోట పెట్టుబడి తప్పనిసరి అనే భావం ప్రజలకు కలిగించాలని ప్రయత్నిస్తున్నారు. గాంధీజీ ఉప్పుమీద పన్నును కూడా ప్రతిఘటించారు; దరిమిలా దాన్ని రద్దుచేశారు. ఇప్పుడు మన ప్రణాళిక నిర్మాతలు మాత్రం ఆహారధాన్యాల వ్యాపారంనుంచి రూ. 850 కోట్ల లాభం తీయాలని ఆలోచిస్తున్నారు. ఇలా చేస్తే ప్రజలనెత్తిన ఎంత బరువు పడుతుందో, ఇటీవల జీవనవ్యయం పెరుగుదలను గమనిస్తే తెలుస్తుంది. అధికారులిచ్చిన అంకెల్నిబట్టి చూసినా, ఆహారపదార్థాల ధరలు ఒక ఏడాదిలో నూటికి 8.9 దాకా పెరిగాయి. ఇందులో పప్పులు నూటికి 38, పళ్ళు, కాయగూరలు నూటికి 14.1, పాలు నెయ్యి నూటికి 4 5, చేపలు, గుడ్లు, మాంసము నూటికి 9.8, పంచదార నూటికి 10 5, ఇతర పదార్థాలు నూటికి 14.8 పెరిగాయి. ఈమధ్య కొద్ది నెలలుగా ఢిల్లీలో ఆహారపరిస్థితి విషమంగా ఉంది. గోధుమ మణుగు రూ. 24 దాకా పోయింది. బొగునర మణుగు రూ. 12 దాకా పెరిగింది.

స్థితిగతులిలా ఉండగా భారతదేశం అమోఘంగా పురోగమించేస్తోందనీ, జాతీయాదాయం అపూర్వంగా పెరిగిందనీ చాటుతున్నారు. ధరల మురల్లోపడి నలిగి కలిగిపోతున్న సామాన్య మానవుడికి జాతీయాదాయం సంఖ్యలు చూస్తే కడుపునిండుతుందా? వస్తువులమీద పన్నులు విపరీతంగా పెరిగిపోతుంటే ఆ భారమంతా భరించే మామూలు మనిషికి జాతీయాదాయం ఎంత పెరిగితే ఏం ఒరిగింది? ఏ దేశంలోనయినా మధ్య తరగతి ప్రజలే ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులు రాకుండా ఆదుకునేవారు. మన

(51-వ పేజీ చూడండి)

వీరెవరో గుర్తుపట్టగలరా?




1



2

ముప్ఫయి అయిదేళ్ల క్రితం ఇద్దరు ఆంధ్రప్రముఖులు ఈవిధంగా వుండేవారు. వీరెవరో గుర్తుపట్టగలరేమో ప్రయత్నించి చూడండి! సమాధానాలు 52 వ పేజీలో.

* వచ్చేవారం మరిద్దరి చిత్రాలు.



అంతర్యుద్ధకాలంలో అమెరికాకు 16 వ ప్రెసిడెంట్‌గా ఉన్న అబ్రహాం లింకన్ స్మృత్యర్థం ఫిబ్రవరి 6వ తేదీనుంచి 12 వ తేదీవరకు. ప్రత్యేక ఉత్సవాలు జరుపవలసిందిగా ప్రెసిడెంట్ ఐసెన్ హోవర్ ప్రకటనచేశారు. ఫిబ్రవరి 12 వ తేదీన ఆయన 150 వ జన్మదినోత్సవం కూడా.

ఆనాటి భీకరపోరాటంలో జాతీయతను రక్షించటానికీ దేశసంపదలను ప్రతి పౌరుడూ అనుభవించే హక్కులను నెలకొల్పటానికీ లింకన్ మహాశయుడు తన మహత్తర శక్తియుక్తులను, రాజకీయదక్షతను ఉపయోగించి దేశాన్ని కష్టాలనుంచి గట్టెక్కించాడు.

న్యాయవాదిగా అబ్రహాం లింకన్

[ఈ రచయిత కెంటకీ రాష్ట్రం లెక్సింగ్‌టన్‌లో న్యాయవాది. అబ్రహాం లింకన్ న్యాయవాదిగా గడిపిన జీవితంగురించి ఈయన "అబ్రహాం లింకన్, డిఫెండెంట్", "లింకన్ ది లిటిగెంట్" మొదలైన అనేకగ్రంథాలు లిఖించారు]

[విలియం హెచ్. టౌన్‌సెండ్]

కెంటకీ రాష్ట్రపు అరణ్య ప్రాంతాలలో ఒక పూరిగుడిసెలో జన్మించి, ఇండియానా అరణ్యప్రాంతాలలో పెరిగి పెద్దవాడైన అబ్రహాం లింకన్ విద్యాభ్యాసం చేసిన కాలమంతా ఒక్క సంవత్సరం మాత్రమే. అయినప్పటికీ తనకు చేతికందిన పుస్తకాన్నల్లా ఆయన శ్రద్ధగా ఆమూలాగ్రం గాపఠించాడు. వాటిలో కొన్ని ఇవి: వామ్స్ రచించిన వాషింగటన్ జీవితం, రాబిన్సన్ క్రూసో, పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్, ఈసప్స్ ఫేబుల్స్, గ్రిమ్‌షా రచించిన అమెరికా చరిత్ర, ది కెంటకీ ప్రిసెప్టర్, హోలీ బైబిల్.

లింకన్ కుటుంబం ఇల్లినాయ్ రాష్ట్రానికి తరలివచ్చిన రోజులనాటికి ఆయన మొదటిసారి వోటు వేయడానికి తగిన వయస్సుకలవాడు. ఇల్లినాయ్‌లో ఒక షాపు గుమాస్తాగా పనిచేశాడు; బ్లాక్ హాక్ యుద్ధంలో పాల్గొన్నాడు; వ్యవసాయ కూలీగా, సర్వేయరుగా పనిచేసి, దరిమిలా ఒక చిన్న షాపు పెట్టాడు. అది కాస్తా కొద్ది రోజులలో దివాళా తీసింది, దానితో తన భవిష్యతు గురించి ప్రశాంతంగా ఆలోచించుకొన్నాడు. కమ్మరి పని నేర్చుకొంటే మంచిదేమోనని భావించి, అభివృద్ధిలోకి తెచ్చేది కాదని మానివేశాడు. ప్లీడరీ చదువుదామని యోచించాడు; కాని, తనకు విద్యాభ్యాసం లేదు గనుక అది సాధ్యపడదేమో అనుకొన్నాడు.

అయినప్పటికీ, ప్లీడరీ చదవాలనే అభిప్రాయంమాత్రం ఆయన మనస్సులో గట్టిగా పడిపోయింది. ఒకరోజున ఆయనకు పాతచెత్త నిక్కిన ఒక డబ్బాలో చివికి చిరిగిపోయిన "కామెంటరీస్" అనే పేరుతో బ్లాక్‌స్టోన్ రచించిన పెద్దగ్రంథం కాపీఒకటి దొరికిందని కొందరంటారు. ఆ తరువాత ఆయన ఎక్కడికి వెడితే అక్కడకు దానిని పట్టుకువెళ్ళేవాడు.

ఇటువంటి రోజులలో ఆయనకు, స్ప్రింగ్‌ఫీల్‌లో సమర్థుడైన లాయరు జాన్ టి. స్టూవర్ట్‌తో పరిచయమైంది. ప్లీడరీ

★ అబ్రహాం లింకన్ ★

చదవడానికి లింకన్‌కు కావలసిన పుస్తకాలను ఆయన ఎరువు ఇస్తానని చెప్పాడు. దానితో లింకన్ సమస్తశక్తీ ధారపోసి, ఏకదీక్షతో ప్లీడరీ చదవనారంభించాడు. స్ప్రింగ్‌ఫీల్డ్‌కు ఎవరైనా బండిలో వెళుతూంటే వారు లింకన్‌నుకూడా ఎక్కించుకు వెళ్ళేవారు. అటువంటివారెవరూ లేకపోతే లింకన్ ఈ 20 మైళ్ళదూరం నడిచివెళ్ళి వస్తూ, దారిపొడుగునా పుస్తకాలు చదువుతూండేవాడు.

1837 వసంతకాలంలో లింకన్ ప్లీడరీ వృత్తి చేసుకోడానికి లైసెన్సు లభించింది. అప్పటికి ఆయనకు 28 సంవత్సరాలు. తన కున్న కొలది సామానులను రెండు సంచులలో కుక్కుకొని, ఒకరి దగ్గరనుంచి ఒక గుర్రాన్ని ఎరువు పుచ్చుకొని, ఆయనవల్ల చరిత్ర ప్రసిద్ధి పొందిన స్ప్రింగ్‌ఫీల్డ్ పట్టణానికి బయలుదేరాడు. ఆ పట్టణంలో లింకన్ ఒక షాపులోకి వెళ్ళి, ఒక పరుపు, దుప్పట్లు, ఒక తలగడా కావాలని వాటి ఖరీదు అడిగాడు. 17 డాలర్లని షాపు యజమాని జోషువా ఎఫ్. స్పీడ్ అన్నాడు.

“అలాగా! చవగ్గా చేస్తున్నారే!” అంటూ ఈ పొడుగాటి కొత్తమనిషి (లింకన్) ముఖం కొంచెం విచారంగా పెట్టి “చవగ్గా ఉన్నప్పటికీ, ఇంత డబ్బు నాదగ్గర లేదు. క్రిస్మస్ వచ్చేవరకు నాకు అప్పు పెట్టండి. ఈలోగా నేను ప్లీడరీలో సంపాదించి తీర్చలేకపోతే, మీకు అసలు తీర్చలేననుకోండి” అన్నాడు.

ఇంత స్వల్పధనానికి అప్పుకోసం బాధపడుతున్న లింకన్‌ను ఆ షాపుయజమాని చూచి జాలిపడి, “మేడమీద నాతోపాటు నా గదిలో ఉండండి. మీ రేమీ డబ్బు యివ్వనక్కరలేదు” అని ఆదరించాడు. అప్పటి నుంచి వారిద్దరూ ప్రాణస్నేహితు లయారు.

జాన్ టి. స్టూవర్ట్‌తో నాలుగు సంవత్సరాలు స్టీఫెన్ టి. లోగన్‌తో మూడున్నర సంవత్సరాలు జూనియర్ పార్ట్‌నర్ గా లింకన్ పనిచేసినతరువాత విలియం హెచ్. హెర్న్‌డన్ అనే మరొక యువకునితో కలిసి సొంతంగా ఆఫీసు పెట్టాడు. లింకన్ హత్యాకాలంవరకు వారి పార్ట్‌నర్‌షిప్ సాగింది.

లింకన్ ప్లీడరీవృత్తిలో సగకాలం ఇతర వూళ్ళలోని కోర్టులకు వెళ్ళిరావడానికి సరిపోయింది. హెర్న్‌డన్‌మాత్రం స్ప్రింగ్‌ఫీల్డ్‌లో వుండి అక్కడి కేసులు చూస్తుండేవాడు. ఇల్లినాయ్ జుడీషియల్ సర్క్యూట్‌లో 14 కోర్టులుండేవి. రోడ్లు రొచ్చుగా ఉండడం, ప్రమాదకరమైన రోడ్లు, కొండవాగులు దాటవలసి ఉండడం—ఇటువంటి బాధలవల్ల అందరు ప్లీడరు ఈ కోర్టులకు వెళ్ళేవారుకారు. కొద్దిమందిమాత్రమే ఈ కోర్టులు తిరిగేవారు. వారిలో లింకన్ ఒకడు.


లింకన్ ఎప్పుడు శుభ్రంగా గడ్డం గీసుకొని నీటుగా ఉండేవాడు. కాని, ఆయన చేసే తవాసిలలో తయారుచేసిన నూలు

లింకన్ లాయరుగా ఉండేరోజుల్లో ఒకనాడు రోడ్డువెంట నడిచిపోతూ ఒక బండిరావడం చూచాడు.

లింకన్ : ఇదిగో అబ్బాయ్, కొంచెం ఈ ఓవర్‌కోటు ఊళ్ళోకి చేరవేస్తావా?

బండివాడు: దానికేంభాగ్యం అట్లాగే. కాని, మళ్ళీ మీ కోటు మీ కెట్లా చేరుతుంది?

లింకన్ : నేను కోటులోనే ఉంటాగా, చేరకేం చేస్తుందిలే.



వర్ణజాతుల మోక్షప్రదానపత్రం మంత్రివర్గసమావేశంలో 1862, జులై 22 న లింకన్ ప్రకటిస్తున్నప్పటి దృశ్యం. ఎడంనుంచి కుడికి యుద్ధమంత్రి ఎడ్విన్‌స్టాంటన్, కోశాంగశాఖ మంత్రి సాల్మన్ చేస్. నౌకాశాఖమంత్రి గిడియన్‌వెల్స్, విదేశ వ్యవహారాలమంత్రి విలియం సీవార్డ్ ప్రభృతులు ఆసీనులైవున్నారు.

తొడుక్కుంటూ ఉండడంచేత, అవి ముడతలుపడి ఉండేవి. ఆయన ధరించిన టోపీ ఒకొక్కప్పుడు నొక్కుకుపోయి వికృతంగా ఉండేది. పుస్తకాలు, కాగితాలు అవీ కుక్కిన ఒక సంచి, అనుపచ్చని గొడుగు పట్టుకొని వెళ్లేవాడు. అందుచేత, అందరికీ విచిత్రంగా కనిపించేవాడు. ఆ ప్రాంతాలన్నింటిలో అందరి అభిమానాన్ని సంపాదించాడు.

కోర్టులో లింకన్ మామూలుగా కూర్చొని ఉన్నప్పుడు ఆయనలో విశేషమేమీ కనిపించేది కాదు. పొడుగాటి కాళ్లను టేబిలు క్రిందకు తన్ని, ఒకొక్కొక్కప్పుడు చేతుల్ని పంట్లాంజేబులో పెట్టుకొని కూర్చుంటే, అందరిలాగే ఉండేవాడుగాని, పొడగరిగా కనిపించేవాడు కాదు. సంస్కారంలేని జుట్టు ముడతలుపడ్డ నుదుటిమీద పడుతూ ఉండేది. పొడుచుకొచ్చిన దవడలు, లోతుకుపోయిన కండ్లతో ఆయన ముఖం మోటుదేరి ఉండేది.

అయితే, ఆయన కుర్చీలోనుంచి లేచి, కోర్టు విప్పేసరికి జడ్జీలు, ప్లీడరు, కోర్టులోని తదితరులు ఆయన రూపంలో వచ్చిన మార్పు చూచి ఆశ్చర్యచకితులయేవారు. ఆరడుగుల నాలుగంగుళాల పొడగరి కనుక, ఠీవిగా కనిపించేవాడు; కంఠధ్వని కోర్టులో ప్రతిధ్వనించేది; లోతైన కళ్ళు ప్రకాశవంతమయేవి; చక్కని పలువరుసలు జిగేలుమనేవి.

లింకన్ నిటారుగా నిలబడి వాదిస్తున్న

లింకన్ చెప్పిన కథ

లింకన్ కాలంలో విదేశాంగ మంత్రిగా ఉన్న సెవార్డు ఈ విషయం చెప్పాడు:

లింకన్ ప్రెసిడెంట్ అయినరోజుల్లో ఉద్యోగాలు కావాలంటూ ఎవరెవరో అదేపనిగా వస్తుండేవారు. పెగా మెళ్ళ పొడుగు సిఫార్సులు, సర్టిఫికెట్లు కూడా తెచ్చేవారు. ఒకనాడు దాదాపు 20 మంది ఇట్లా వచ్చిన అభ్యర్థులతో తన గది నిండిపోయింది. బాగా విసుగెత్తింది. ఇటూ అన్నాడు:

"మీకొక కథ చెప్పాలి. ఎప్పుడో చదివానులే. ఒక రాజుగారికి ఒక మంత్రి ఉండేవాడు. ఆయనమాటంటే రాజుకు నమ్మకం. ఒకనాడు వేటకు పోదామనుకొని మంత్రిని పిలిచి 'వర్షం వస్తుందంటారా?' అని అడిగాడు. మంత్రి రాదని చెప్పగా వేటకు బయలుదేరాడు. దారిలో ఒక రైతు తన గాడిద మీద ఎక్కి పోతూ తటస్థపడాడు. "తప్పకుండా వాన వస్తుంది అనీ, కనుక తిరిగివెళ్లటం మంచి"దనీ ఆ రైతు సలహా చెప్పాడు. ఆమాటవినకుండా ముందుకు పోయారు. వానవచ్చింది. ముద్దముద్దగా తడిశారు.

ఇంటికి తిరిగివచ్చిన తరువాత మంత్రిని చీవాట్లు పెట్టడు. తరువాత రైతును పిలిచి వర్షంవచ్చేసంగతి అతనికి ఎటూ తెలిసిందని అడిగాడు

"నాకు తెలియదండీ. నా గాడిద చెప్పింది."

"దానికెల్లా తెలుసు?"


"చెవులు పైకి నిక్కిస్తే దానికి తెలిసిపోతుంది ప్రభూ."

అంతట రాజు రైతును పంపివేసి, ఆ గాడిదను పిలిపించి మంత్రి స్థానంలో దానిని పెట్టాడు"

ఇంతవరకు చెప్పి "మా చారూ రాజు చేసిన పెద్దతప్పు ఇదే" అన్నాడు లింకన్.

ఆ అభ్యర్థులంతా ఒక్కసారి "ఎందుచేత నంటారు" అని అడిగారు ఆతురతతో.

లింకన్ "ఎందుకేమంది. అప్పటి నుంచి ప్రతి గాడిద ఉద్యోగం కావాలంటున్నది." ★



అబ్రహాం లింకన్

ప్పుడు చేతులు ఆడ్డే త్రిప్పేవాడు కాదు; వాటిని వెనక్కి పెట్టుకొనడమో, లేదా ఒక చేతితో కోటు పట్టుకొని, రెండవదానిని క్రిందకు వ్రేళ్ళాడేసి ఉండడమో చేసేవాడు.


బహుళా సాక్షులను క్రాస్ పరీక్ష చెయ్యడంలో లింకన్ ఘటికుడు. కేసు వివరాలు ఆయనకు క్షుణ్ణంగా తెలిసిఉండేవి. అనవసరమైన ప్రశ్నలు ఎన్నడూ అడిగేవాడు కాదు. సాక్షికి నొప్పి కలిగించకుండా, మర్యాదగా ప్రశ్నలడుగుతూ, చివరికి అతడికి మిత్రుడుగా కూడా ప్రవర్తిస్తూ, అతడితో సన్నిహితుడయ్యేవాడు. ఇంచుమించు అన్ని సందర్భాలలోను సాక్షికి తెలియకుండగానే అతడి నోటినుంచి తనకు కావలసిన సమాధానాన్ని చెప్పించేసేవాడు. ఆయన బహిరంగ విరోధులు సయితం క్రమంగా ఆయనకు వశులైపోవడం అందరికీ ఆశ్చర్యంగా ఉండేది. లింకన్‌కు వ్యతిరేకంగా అనేక కేసులలో పని చేసిన ఒక ప్లీడరు ఇలా అన్నాడు: "ప్రతి కేసులోను అసలు కీలకమేమిటో లింకన్ మొదటనే చటున గ్రహించి, దానిని చివరివరకు జ్ఞాపకం పెట్టుకొని, జూరీలు ఆ విషయాన్ని మరచిపోకుండా చేసేవాడు."

లాయరుగా ఆయన ప్రతిభ ఎటువంటిదో ఇల్లినాయ్ సుప్రీం కోర్టులోను, అమెరికా సుప్రీం కోర్టులోను ఆయన గెలిచిన కేసులను బట్టి గ్రహించవచ్చు. ఇల్లినాయ్ సుప్రీం కోర్టులో ఆయన అనేక కేసులలో విజయం పొందాడు. ఆయన అమెరికా సుప్రీం కోర్టులో కేసులలో వాదించి, రెండింటిలో విజయం పొందాడు.

పెద్దవారనీ, చిన్నవారనీగాని, ధనికులనీ, పేదలనీగాని తారతమ్యం లేకుండా ఆయన అందరికీ అభిమానపాత్రుడు. పెద్ద పెద్ద కంపెనీలకు ఆయన లాయరుగా పని చేసినంత మాత్రాన ప్రజానీకంలో ఆయన పలుకుబడి ఏ మాత్రం తగ్గలేదు.

లా విద్యార్థులకు లింకన్ ఇచ్చిన సలహా ఇది: "ఎటువంటి పరిస్థితులలో అయినా సరే నిజాయితీగా ఉండాలని నిశ్చయించుకోండి. ప్లీడరీ వృత్తిలో నిజాయితీగా ఉండలేమని మీకు తోచినట్లయితే ఆ వృత్తి మానివేసి నిజాయితీగా ఉండండి. పేచీలు ప్రోత్సహించకండి. వీలైన అన్ని సందర్భాలలో పరిష్కార సమాధానం కుదర్చండి. కేసుల్లో నామకః నెగ్గినవాడు నిజంగా నష్టపోయినవాడే—ఫీజులు, ఖర్చులు, కాలనష్టం—అవుతాడని చెప్పండి. శాంతిదూతగా సమ్మానితుడు కాగల అవకాశం ఉన్నది లాయరుకి."

లింకన్ ఎప్పుడూ చక్కని ఛలోక్తు



తండ్రికి తగిన కొడుకు. అబ్రహాం లింకన్ నలుగురు కుమారులలో పెద్దవాడు రాబర్ట్ టాడ్ లింకన్. 1843 లో జన్మించిన ఇతడు 1926 లో మరణించాడు. రాష్ట్రాల అంతర్యుద్ధంలో కెప్టెన్‌గా పనిచేశాడు. 1867 లో షికాగోలో న్యాయవాదవృత్తి అవలంబించాడు. 1881 మొదలు 1885 వరకూ అమెరికా యుద్ధశాఖమంత్రిగా పనిచేశాడు. 1884 లో అధ్యక్ష పదవికి పోటీ చేయవచ్చునని అనుకున్నారు గాని, అలా జరగలేదు. అప్పుడు ఆర్థర్ ఎన్నికయినాడు. 1889 మొదలు 1893 వరకూ బ్రిటన్‌లో రాయబారిగా పనిచేశాడు.

లాడుతుండేవాడు. వ్యక్తిగత దూషణ ఆరోపణలలో కోర్టు విచారణలలో సర్వ సామాన్యంగా ఉండేది. లింకన్ తనను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు తప్ప అటువంటి పనికి పూనుకొని ఎరుగడు. అయితే, లింకన్ అవ్యాపదేశ విమర్శలు బల్లెపు పోటులాగ గుచ్చుకొనేవని ప్రతీతి కాని, అంతఘాటుగా ఆయన ఇతరులను విమర్శించడం చాలా అరుదుగా జరిగేది. ఒకసారి ఒకానొక జూరీని ఎన్నుకొనే సందర్భం వచ్చింది. ఆ జూరీకి లింకన్‌తో పరిచయమున్నదట. అందుచేత, ఎదుటి లాయరు ఆ జూరీని ఎన్నుకోడానికి అభ్యంతరం తెల్పాడు. ఇలాగ అభ్యంతరం తెల్పడం ఒక వ్యక్తిని అమర్యాద చెయ్యడమనీ, అందుచేత ఈ అభ్యంతరం చెల్లనేరదనీ జడ్జి త్రోసివేశాడు. జూరీని గురించి తన అభిప్రాయాన్ని చెప్పడానికి లింకన్‌వంతు వచ్చినప్పుడు ఆయన చెప్పినదిది: "జూరీలలో ఎవరైనా ఆ లాయరును ఎరుగుదురా?" వెంటనే జడ్జి అన్నదిది: "అటువంటి ప్రశ్నలు అభ్యంతరకరమైనవని చెప్పానుగదా." "యువర్ ఆనర్! నా అభిప్రాయం అదికాదు. ఆ లాయరు సంగతి జూరీలలో కొందరికి తెలియదేమోనని నా భయం. వారికి తెలిపివుంటే బాగు మంచిది" అన్నాడు లింకన్.

ఇల్లినాయ్ రాష్ట్రం లాయర్లందరిలోకి అత్యున్నతిమదశకు వచ్చిన రోజుల్లో ఆయన ఆ వృత్తినుంచి విరమించాడు. అమెరికా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన మహామేధావులలో కల్లా సొంత ప్రయత్నంతో, విచిత్ర ప్రతిభావిశేషాలతో అగ్రగణ్యుడయాడు లింకన్. ఈ ఇలినాయ్ లాయర్లలో అయిదుగురు కాంగ్రెసు సభ్యులయారు; ముగురు గవర్నరు అయారు; నలుగురు సెనేటరయారు; ఇద్దరు మేజర్ జనరల్ లు అయారు; ఒకడు కాబినెట్ మంత్రి అయాడు; ఒకడు సుప్రీం కోర్టు జస్టిస్ అయాడు; ఒకడు (లింకన్) అమెరికా ప్రెసిడెంటు అయాడు.

అబ్రహాంలింకన్, ప్రెసిడెంటుగా ఎన్ను

లింకన్ హాస్యోక్తులు

అబ్రహాం లింకన్ 6 అడుగుల 4 అంగుళాల పొడవు ఉండేవాడు. తన 56 వ జన్మదినం నాడు లింకన్ ఒక న్యూ ఇంగ్లండు వాసిని కలుసుకొన్నాడు. అతను 6 అడుగుల 10 అంగుళాలు పొడుగున్నాడు. లింకన్ అతన్ని చూచి నిశ్చేష్టుడైపోయాడు. పదిసార్లు ఎగాదిగా అతనివైపు తేరిపార చూచి అన్నాడు.

"ఏమండీ ఒక్కమాట అడుగుతాను, ఏమీ అనుకోరుగదూ! మీ కాళ్లు కాలితే ఆసంగతి మీకు తెలుస్తుందీ?

* * *

న్యూయార్కు లాయర్ ఒకరికి జడ్జి కావాలని మహా ఉబలాటంగా ఉంది. "ఇంత పెద్ద రాష్ట్రవ్యవహారాలు చూడటానికి 10 మంది జడ్జీలు ఏం సరిపోతారు?" అన్నాడు ఆలాయరు.

లింకన్-మరొక 'సున్నా'ను చేర్చి 'నూరు' చేయమంటారేమిటి? అన్నాడు సున్నాను నొక్కి పలుకుతూ.

* * *

ఒకనాడు పెట్రోలియం వి. నాస్బీ లింకన్‌తో ఇంటర్వ్యూ జరుపుతుండగా ఒక ఇలినాయ్ రాజకీయవేత్త ప్రసక్తి వచ్చింది. ఆయన మరణించినప్పుడు అంత్యక్రియలకు ఎంతోమంది హాజరైనారట. ఈసంగతి రాగా లింకన్ ఇట్లా అన్నాడు.


"ఇంత గొప్పగా తన అంత్యక్రియలు జరుగుతాయని ఆయనకు తెలిసిఉంటే ఇంకా ఎంతో ముందే మరణించే ఉండేవాడా జనరల్."

కోబడిన తరువాత 1861 ఫిబ్రవరి 10 తేదిన స్ప్రింగ్ ఫీల్ నుంచి వెళిపోయాడు. ఆ వేళ తన ఆఫీసుకు వెళ్లి, జూనియర్ పార్ట్నర్ దగ్గర సెలవు పుచ్చుకొని ఆ నాలుగు గోడల మధ్య తను అనుభవించిన దారిద్ర్యాన్ని, నిరుత్సాహాన్ని, చివరకు తను పొందిన విజయాన్ని ఒక్కక్షణం తలచుకొని, తనకు కావలసిన కాగితాలను కట్టుకొని బయలు దేరాడు. గుమ్మందాటి ఇవతలకు వస్తూ— "లింకన్ అండ్ హెర్నడన్" బోర్డు కేసి ఒక్కసారి చూచి, తన జూనియర్ పార్ట్నర్ తో "ఈ బోర్డును ఇలాగే ఉండనియ్యి. నేను ప్రెసిడెంటు నైనంతమాత్రాన మన కంపెనీలో మార్పేమీ లేదని మన క్లయింట్లకు చెప్పు. నేను మళ్ళీ ప్రాణాలతో తిరిగిరావడమంటూ ఉంటే, తిరిగి ప్రాక్టీసు చేద్దాం."

ఆ ఆఫీసుకేసి చివరిసారి తృప్తి తీరా చూసుకొని, విడువలేక విడువలేక వెళ్లిపోయాడు లింకన్. ★

టిక్కెట్టు లేకుండా చేసే ప్రయాణాన్ని అరికట్టాలి...

టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేయడం గౌరవకరమైన విషయం కాదు.



ప్రయాణికులకు సుఖప్రయాణం చేకూర్చడం కోసం టిక్కెట్లు లేకుండా చేస్తున్న ప్రయాణాలను పూర్తిగా అరికట్టాలి.

అట్లా చేయడానికి, దయచేసి మాకు తోడ్పడండి! టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్న వ్యక్తి మీ కంటబడిన ప్రతిసారీ టిక్కెట్లను పరీక్షచేసే ఉద్యోగికి అతనిని చూపించండి! ఈ అసౌకర్య కారణాన్ని, దేశానికి వాటిల్లుతున్న నష్టాన్ని నివారించడం నిమిత్తం అందరి హృదయపూర్వక సహకారం అవసరం.

దక్షిణ రైల్వేచే ప్రకటించబడినది



మనిషి వంటి మనిషి

జీతం తీసుకొని ఇంకా ఒక రోజన్నా పూర్తికాలేదు. హేండ్సప్! జేబులో కానీలేదు! నూరు కాగితాలు... అలా చెల్లిపోయాయి ఏమైపోయాయి? తను ఖర్చు పెట్టేశాడా? ఎలా ఖర్చు పెట్టేశాడు? ఆడపిల్లలకు ఇచ్చేశాడా? అంగడిలో అప్పు తీర్చేశాడా? చక్కని ఖరీదైన బట్టలు కుట్టించి తొడిగేసి సరదా తీర్చుకున్నాడా? హోటల్లో మంచి టిఫిన్లుతిని, డ్రింకులు త్రాగి, సిగరెట్లు కాల్చి జల్సా చేసేశాడా? స్నేహితులతో సినిమాలకువెళ్లి "ఖుషీ" చేసేశాడా?

లేదు! తనేమీ చేయలేదు. ఒక్క పైసా కూడా తనకోసం ఉపయోగించుకోలేదు. ఒక్క పైసా తన అర్ధాంగికి ఇవ్వలేదు. ఒక్క పైసాతో తాను ఏ సుఖాన్నీ, ఆనందాన్నీ కొనుక్కోలేదు. ఏ ఒక్క పైసాతోటి తాను సంతోషం పొందలేదు. మరేమయింది? కుటుంబమనే రాక్షసి ప్రతి కానీ మింగేసింది! మింగిన క్షణంలో వారించుకొని మళ్ళీ ఆకలితో, నోరు తెరుచుకుంది! ఆ ఆకలి తీర్చమని వేధించడంకూడా ఆ క్షణాన్నే ప్రారంభించింది. ఆ ఘోరమైన ఆకల్ని తీర్చడం తనలాంటి 'ఒక్కడికి', బలహీనుడికి సాధ్యమయ్యే పని కాదు. కానీ...ఆ పిశాచి ఆ విషయం బోధపరచుకోదు. తనని పీక్కు తింటూనే వుంది. క్షణక్షణం ఊపిరి సలుపనీకుండా, మనశ్శాంతి నివ్వకుండా గోల పెడుతూనే వుంటుంది. 'నీకు...ఈ దరిద్రుడవు... ఇంకా బ్రతికే వున్నావే?' అని హింసిస్తూనే వుంటుంది.

తను కూడా చీమూ రక్తమూ వున్నటువంటి ఒక మనిషే! తనకూ కోరికలూ, ఆశలూ వున్నాయి. తనకూ సుఖించాలనీ, ప్రశాంతంగా వుండాలనీ వుంటుంది. కుటుంబంలో అందరూకూడా సుఖంగా, హాయిగా వుండాలనీ వుంటుంది. ఆ విషయాన్ని ఈ కుటుంబమనే పిశాచి, రాక్షసి, క్రూరజంతువు ఎందుకు గుర్తించదు?

ఇదివరలో, ఇంతమంది తనలాంటి మనుష్యులతో, ప్రాణమూ, మనసూ వున్నటువంటి తోటి ప్రాణులలో ఒక్కరైనా ఎందుకు గుర్తించరు? తనను ఎందుకిలా పిండిప్రాణంకొట్టి ఉప్పూ కారం వేసుకొని నంజుకొని తింటారు?

ఇది యిలా జరుగుతుందని తను ముందుగా కనీసం చూచాయగానైనా తెలుసుకో గలిగి వుంటే యెంత బావుండేది! ఈ ఉద్యోగంలో ప్రవేశించకుండావుండి, మరో మంచి ఉద్యోగం చూసుకోవడమో, ఏదైనా 'కోర్సు' చదవడమో చేసి వుంటే ఎంత బాగా వుండేది! ఈ దారుణమైన పని, హింస...ఎలా భరించడం? ఇదంతా ఎవరికి బోధపడుతుంది? ఇంట్లో ప్రతీవాళ్ళూ తను వీలయినంత 'అర్జంటు'గా డబ్బు సంపాయించే ఒక చిన్న యంత్రమైపోవాలని తహతహ లాడిపోయారు. విద్యా పరీక్షలురాసి ఇంటి కొచ్చిన తక్షణం ఆ యంత్రాన్ని 'స్టార్ట్' చేసి రూపాయలు కక్కించాలని ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో వాళ్ళు విజయాన్ని సాధించారు.

ఐదేళ్ళు ఈ ఉద్యోగమనే గయ్యాళి భార్యను అంటిపెట్టుకొనివుంటానని ఎగ్రి-

రాజేంద్ర

మెంటు రాయించి, అందులో తన సంతకం తీసుకొని, తనని ఈ ఉద్యోగంలో ప్రవేశపెట్టారు. ఈ ఉద్యోగంలో ఇక ఎదుగు బొదుగు లుండవు. గొర్రెతోక! కుక్క తోక!-దీన్ని వదలి మరో ఉద్యోగంలో చేరడానికి వీల్లేదు. వెయ్యి రూపాయలు చెల్లిస్తే, తమ ఇష్టం వచ్చినప్పుడు రిలీవ్ చేస్తారు! ఆ వెయ్యి రూపాయలు ఎవరిస్తారు? ఎందుకిస్తారు? తను దమ్మిడీ కూడ కొట్టలేదు. తనింకెందుకూ పనికిరాడు. తనని నిర్జీవ పదార్థంచేసి పారేశారు. ఇక యిలా మృత్పిండంలా పడివుండక తప్పదు. బంతిలా ఎగరాలని వుంటుంది తనకు. కానీ ఆ బంతిలో గాలి తీసేశారు! చిల్లులు పెట్టేశారు!

ప్రతినెలా జీతం అందేముందు తను ఎన్నిటికో తనకు అత్యవసరమైనవాటికి ఖర్చు పెట్టాలనుకొంటాడు. ఎన్నో కోరికలు కోరుకొంటాడు. తీరా జీతం వచ్చాక ఒక్కటీ చేయలేడు. అమ్మ, నాన్న, తమ్ముళ్ళు ఆదిగాగలవారు ఆ జీతానికి పదిరెట్లు ఖర్చుచేయడానికి పథకాలు వేసుకొని రెడీగా వుంటారు. రేపు జీతం వస్తుందనగా ఈ రోజే పిలుచుకొని ఎవరికివారు విడివిడిగా తమ బడ్జెట్ అంచనాలను అందజేస్తారు. వాటి నన్నింటినీ కూడుకొని ఏ పద్నెండుచేతనో భాగిస్తే తన జీతమంత అవుతుంది! అంటే ఏమన్న మాటా...తను జీతమందిన రోజు ఏ ఒక్కరి కోరికలూ తీర్చలేకపోతున్నాడన్నమాట! అందుచేత తనను అందరూ విసుక్కుంటున్నారు. ఏ ఒక్కర్నీ తృప్తిపరచడం లేదుగనక, ఏ ఒక్కరూ తనను ఇష్టంతో చూసుకోవడం లేదు.

అందరి కోరికలూ తీర్చడానికి జీతం చాలదంటే, ఆఫీసులో లంచం తీసుకోమని సలహాయిచ్చే తండ్రి...ఆయన తండ్రేనా? మనిషేనా! కొడుకును దుర్మార్గావలంబనకు ప్రోత్సహించే తండ్రి తండ్రేనా...అని!

తనభార్య! తన అర్ధాంగి! ఎటువంటి అద్భుతమైన మనిషి! కాపురానికి వచ్చిన రెణ్ణెల్లకే అన్నీ బోధపరచుకొంది. ఆవిడకూ ఎన్నో కోరికలున్నాయి. కానీ...అవి నెరవేరే అవకాశంలేదని తెలుసుకొంది. తన భర్త... మొగుడనేవాడు. మొగవాడనుకొనేవాడు...దద్దమ్మ...అని తెలుసుకొంది!! తెలుసుకొని తన ప్రాణం తీయక వూరుకుంది. తనను అన్నివిధాలా సంతోష పెట్టడానికి ప్రయత్నం చేస్తుంది. పూర్ ... డియర్! అమాయక పిల్ల!...తను... రామ్మూర్తి నామధేయుడు, పెళ్లయినపిల్ల కోతి...తను నిజంగా ఎంత చవటవెధవ!! ఆ పని చేయవలసింది తనా! భార్యను సుఖపెటవలసిన బాధ్యత...మగవాడై నటువంటి మగవాడు, మొగుడు అనుకొనే టటువంటి.. పెళ్లివాడు మహావీరుడైన, యుద్ధంచేసి రాజకుమారుని వశపరచుకొన్న పెళ్లికొడుకు పోజుపెటిన తనది! కానీ...తను తన విధ్యుక్తధర్మాన్ని క్రమంగా నిర్వర్తిస్తున్నాడా? లేదు! నిర్వర్తించడంలేదు. లేనే లేదు. తను తన భార్యను అన్నివిధాలా సుఖపెడుతున్నాడా...అంటే లేదు:...సరే మరి ఏమని పెళ్లి చేసుకొన్నావు? ఏ ఉద్దేశంతో ఆమెను పెళ్లి చేసుకొన్నావు? ఆవిడను సుఖపెట్టాలనుకొన్నావా... అవును అనుకొన్నాను. మొదటిరాత్రి ఏం చెప్పావు. "నీ జీవితం స్వర్గతుల్యంచేసి, ఏమేమో చేసేస్తానని కోశావా? కోశావ్! మరి అలా దాన్ని కావ్యరూపంలో

★ మనిషివంటి మనిషి ★

పెట్టావా...? లేదు! లేదూ...మరి నువ్వు మగవాడివేనా...కాదు...మనిషివేనా....కాదు. మరి నువ్వేమిటి...అవి? ఏమీ కాదు?

ఒక...ఏమీ కాదు.

'మరి ఎందుకు రా నువ్వు...వోరే గాడిదా...ఏమీ కానివాడా...చచ్చిపోరా! వోరేయ్ చవటపీనుగా...చచ్చిపోతావూ...అసమర్థుడు, పిరికివెధవా...చస్తారు. నువ్వెందుకు చావాలి? నువ్వు చచ్చి నీ భార్యను మరింత హింసించాలంటే, యమలోకమన్నదే వుంటే, నువ్వక్కడికి వెళ్లాలంటే, ఈ ఘోరమైన తప్పిదానికి, నిన్నక్కడ మళ్లీ బాధించి, చంపేస్తారు! చస్తావు. చచ్చి మళ్లీ కుక్కగానో, గాడిదగానో, కోడిగుడ్డుగానో పుడావు. పుట్టి మళ్లీ తిక్కచావు చస్తావు!"............

కొండక్రింద ఎత్తైన గుండుమీద కూర్చున్న రామ్మూర్తి జుట్టు పీక్కున్నాడు. తలబండకేసి బాదుకొన్నారు. మనశ్శాంతి కోసం ఊరవతల కొండ దరికి వచ్చిన రామ్మూర్తి మనసు మరీపాడు చేసుకొన్నాడు.

కొండమీద సూర్యుడస్తమిస్తున్నాడు. సాయం సంధ్యాకాంతి వింతగా ప్రకాశిస్తూ పరిసరాలకు మెరుగులు పెడ్తోంది. ఆ ఎఱ్ఱటి కాంతిలో అతని చేతులు ఎంతో అందంగా అగుపిస్తున్నాయి. వేరుసెనగ చేలు కళకళలాడుతున్నాయి. అతని మనసు ఆందోళనతో ఆక్రోశిస్తోంది

"తన దుస్థితికి ఎవళ్ళు...ఏది...ఎందుకు కారణం? బియ్యే చదువుకొని, చక్కని భార్యను చేసుకొని, ఉద్యోగం చేస్తూ...తను సుఖమనేదాన్ని ఎరక్కపోవటానికి ఎవరు కారకులు?

తన ఆర్థిక దుస్థితిమూలకంగా తను ఎన్ని కోరికలను చంపుకోవలసి వస్తోంది? జీవితం ఎంత దుర్భరంగా పరిణమిస్తోంది?

తను భార్యకు మంచి చీరకొనాలను కొన్నాడు. ఇంకా ఎన్నో బట్టలు టాయ్‌లెట్ వస్తువులు కొనాలను కొన్నాడు.

ఆవిడ మంచి నెక్లెస్ ధరిస్తే ఎంతో బావుంటుంది. అలాంటి దొకటి కొనిచ్చి...ఆవిడ మెడలో వేసుకొని నవ్వితే, వెన్నెలలాంటి చిరునవ్వు నవ్వితే...చూసి...ఆనందభరితుడై కరిగిపోవాలని తను రహస్యంగా ఎన్నాళ్ళనుంచో అనుకొంటున్నాడు. ఇటీవలె వెళ్ళిన ఆమె పుట్టినరోజుకు మంచి బహుమతి ఇవ్వాలను కొన్నాడు. ఏమీ ఇవ్వలేకపోయాడు. తనకో జత బట్టలు మంచివి...మన్నిక కలిగినవి కుట్టించుకోవాలను కొన్నాడు "ఎంకిపాటలు" పుస్తకం కొనుక్కోవాలను కొన్నాడు. మంచికలం, మంచి జోళ్ళు, మంచి సైంటిన్ మంచి చేతిసంచి...మంచి గొడుగూ ఎన్ని మంచివి అనుకొన్నాడు ఎన్నిసార్లు అనుకొన్నాడు? ఎందుకు కొనలేకపోయాడు.

వీటికోసం ఇంట్లో ఎవరూ ఏ ఖర్చు తగ్గించుకోలేరు. తను ఉద్యోగంలో చేరిన తక్షణం కొనుక్కోదలచినవి. ఎన్నో ఏళ్ళ నుంచి కోరుకొంటున్నవి...ఎంతగానో వాంఛించినవి...ఒక్కటి సంపాయించుకోలేకపోయాడు. అప్పటికి ఇప్పటికి...కోరికలు...కోరికలుగానే వుండిపోయాయి.

నాన్న నెలకు ఐదు రూపాయలు న్యూస్ పేపరుకు తనచేత చెల్లింపజేస్తాడు. లైబ్రరీకి వెళ్ళి చదుకోరాదూ? లైబ్రరీకి వెళ్లి చదువుకొంటే, గౌరవానికి భంగం కలుగుతుందా!...ఆ వ్యసనం మానేస్తే ఏం? తను సిగరెట్లు కాల్చడం ఎప్పుడో మానేయలేదూ! ఇంకా పటులాల్చీలెందుకూ? ఇంకా మంచి సెంటెడ్ హెయిరాయిల్ వాడితేగానీ ఈయన ముఖం ఎవరూ చూడరూ! ఆ పేకాట ఆడి కొంప తగలేయక పోతే, నెమ్మదిగా ఇంటి పనులేవో చూసుకోరాదు. మార్కెట్‌కు వెళ్లడం కూడా తనే చేయాలి. ఆయన ఇంటి పనులు జీవితంలో చేసి యెరగడట! అలాంటి వాటికోసం...ఇంకా నూకలు మనుష్యుల మధ్య మన వలసిన తను ప్రాకులాడవలసింది! అన్నీ అయిపోయిన ఆయన కెందుకు? ఇప్పుడైనా రోజుకు అన్ని డజనుసార్లు కాఫీలు త్రాగడం మానేయరాదూ? చుట్టలు కాల్చడం తగ్గించేస్తే ఏం? మానరయ్యా...బాబూ మానరు. తను చచ్చేవరకు మానరు. తను చావడు!...పైగా—

"వాకొడుకు సంపాదిస్తున్నాడు. నాకేం తక్కువయ్యా! నేనెందుకు మానేయాలీ?" అంటూ వుంటారు ఆయన స్నేహితులతో.

అమ్మ ఇంకైనా ఆ దానధర్మాలు చేయడం మానేయరాదూ. కనీసం తగ్గించేయరాదూ! తమ్ముళ్ళు సినిమాలు, నాటకాలు, జల్సాలు తగ్గించేసే ఏం? పోనీ వాళ్లకైతే సరదా అనుకోవచ్చు. ముసలివాళ్లకూ సరదాలే! తనకూ అలాంటి సరదాలు లేవూ" ఎప్పుడైనా ఎవరైనా "సినిమాలకు వెళ్లవేం??" అని అడిగారూ! లేదు. ఎవరూ ఏది అడగరు పైగా "మావాడు బహుయోగ్యుడు! సినిమాలకూ వాటికీ వెళ్లడు. సిగరెట్లు కాల్చడు" అని చెప్పుకొంటూ వుంటారు.

తనకు ఇలాంటి భార్యగాని లేకపోయి వుంటే తను బ్రతుకున్నాడో లేదోనయినా గమనించే వాళ్ళెవరు వుండి వుంటారు? తన భార్య కూడా చెడ్డదయివుంటే, తన బ్రతుకెలా వుండేది? మంచి మంచి బట్టలు కొనాలని, నగలు కావాలని, సినిమాలు తగ్గరాలు చూడాలని, ఆ త్తమామల్ని భరించలేనని, ఈ చాకిరి చేయలేనని ... ఈ రాక్షస గోల భరించలేనని...అనివుంటే...హిరణ్యాక్షువరాలు కోరివుంటే...తన గతేమయ్యేది? తను పిశాచయి పోయేవాడు! తలచుకొంటే నే శరీరం గగుర్పొడుస్తుంది.

ఇలాంటి ఉత్తమురాలు తనకు భార్యగా లభించినందుకు, తనను సాహసించి పెళ్లి చేసుకొన్నందుకు, ఆమెకు లభించిన బహుమతి ఏమిటి? తన బహూకృతి ఏమిటి? ఏమీ లేదు. ఆక్షణం నుంచీ హింసిస్తూనే వున్నాడు. ఇంట్లో ఆమెకు స్వేచ్ఛ లేదు. సంతోషం లేదు. ఆమె సహజమైన కోరికలను ఎవరూ గురించలేదు. తనూ ఖాతరు చేయలేదు. తను అంధుడు...మూర్ఖుడు...

ఎన్నాళ్ళిట్లా...?

అప్పుచేసి ఆమెకూ....తనకూ....కావలసినవన్నీ కొనేసి, ఇంట్లో ఎవరూ ఆమె జోలికి పోరాదనిచాసినే ఇంట్లో వాళ్ళు చేసే అప్పులు తనుతీర్చడం లేదూ! తండ్రి ఎప్పుడో బ్యాంకులో చేసిన అప్పుకు తను ప్రతినెలా చెల్లు పెటడం (జమ కటడం) లేదూ! ఆయన మాత్రం తన పెనన్ డబ్బును. ధర్జాగా తనకే, తన అవసరాలు, కోరికలు కోసమే వాడుకోవడం లేదూ? ఇక మీదట తను అంతే!

తన, తనభార్య అవసరాలకే మిగిలిన డబ్బునే ఇంట్లో ఇవ్వాలి! అంతే! ఎప్పుడో కాదు...ఇప్పుడే—తమకు కావలసినవన్నీ కొనేయాలి. అప్పుచేసేయాలి. తరవాత ఎంతకాలానికి తీరుతుందో...తీరనీ గాక!

రామూర్తి అనే అవ్యక్తి ఆ ఎత్తయిన గుండుమీది నుంచి క్రిందికి, మెత్తటి ఇసకలోకి ఒక్క ఉదుటున ఉరికాడు. దుమ్ము దులుపుకొని పైకి లేచాడు. చుటూ చూసి ఒక్కక్షణం ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాడు. సంధ్యాకాంతిని కొంత తనలోనికి పీల్చుకొన్నాడు! ముందుకు... టౌన్ కేసి...నడిచాడు.

బజారులో మంచి పెద్దషాపులో ప్రవేశించాడు. షాపు యజమాని చిరపరిచితుడు! కూడా చదువుకొన్నవాడు.

"కూర్చోవోయ్ రామ్మూర్తీ! ఏమిటిలా దయచేశావు? సంపాయించే డబ్బంతా ఏంజేస్తున్నావోగానీ...ఇటు ప్రక్క రావటం లేదే! బ్యాంకులోగాని వేస్తున్నావేమిటి...ఊహుం..." అన్నాడు

"బ్యాంకూ లేదు....నా తలకాయా లేదు. జీతం పుచ్చుకొన్నరోజే అప్పిచ్చేవారి లెవరైనా వున్నారా అని బయలుదేరివచ్చాను" అన్నాడు రామమూర్తి.

"అప్పు...నీకు యివ్వలేనివాళ్ళెవరోయ్! ఏంకావాలి చెప్పు వేనిస్తాను" అన్నాడతను:

(55-వ పేజీ చూడండి)



మూలం
మానిక్ బంద్యోపాధ్యాయ
అనువాదం
మద్దిపట్ల సూరి

(గతసంచిక తరువాయి)

రోజులు గడిచిపోతున్నాయి. శశి లోపలలోపల మండిపోతున్నాడు. పరాన్ గొంతులో పుట్రకణం (కేన్సర్) ఏర్పడిందేమో అని తోచింది శశికి. అది నిర్ధారణగా తెలుసుకునేంతవరకు నిద్ర పట్టదతనికి. ఒకవేళ కాదేమో! ఒకవేళ నిర్లక్ష్యంచేసే పరాన్ చిన్న పుండును అంత పెద్దదయేట్లు చేసుకున్నాడేమో! పరాన్ రాడిక్కడికి. తానే పరాన్ యింటికి వెళ్ళి 'వాజిత్‌పూర్ డాక్టరేం చెప్పాడు?' అని అడగటానికి అభిమానం వేసింది శశికి. కుసుమ అయినా ఏదో మిషతో ఎప్పుడైనా హఠాత్తుగావచ్చి కన్పడితే బావుండును. కాని ఆమెరాదెందుచేత? తాను రానటం లేదనా? నెలలో ఇలా ఎన్నోరోజులు వెళ్ళటం చూసున్నాడిదివరకూనూ. అయినా కుసుమ హఠాత్తుగా కన్పించటానికి అవాంతరం ఎప్పుడూ ఏర్పడలేదు. ఒకరోజున శశి చాలా చీకటితోనే ఇంట్లోంచి వీధిలో అడుగుపెట్టేసరికి, కుసుమకూడా యింట్లోంచి వీధిలోకి రావటం కన్పించింది. కుసుమ శశిని చూసింది అన్న సంగతి స్పష్టమయింది. అయినా ఏదీ, కుసుమ చేతో సైగఅయినా చెయ్యలేదు. తనను చూసింది పోనీ, గబగబా ముందుకైనా రాలేదు. శశి కొంచెం సేపు అక్కడే ఆగినుంచున్నాడు. మైదానంవరకు వెళ్ళే నిరసంగా ఉండే కాయకష్టులవీధి శశి జీవితంలో ఇప్పటికీ రాచబాటే అయి ఉంది. అతడిలో కదలిక తెచ్చినవారి అందరి పదచిహ్నాలూ ఉన్నాయి ఆ బాటలో. వారిలో ఇప్పుడు మిగిలివున్నది కుసుమ ఒక్కతే. ఈ బాటను నడిచేటప్పుడు కుసుమ ఒక్కతే...

శశి మెల్లిగా కుసుమ దగ్గరకు వచ్చాడు.

"నిన్ను చూసి ఆగాను కుసుమా! దగ్గరకి వస్తావనుకున్నాను."

"మీరు ఆగితే మీ దగ్గిరకి వచ్చేదా నేను?"

"అందులో తప్పేమయినా ఉందా యేం?" శశి అన్నాడు.

"ఏది కబుర్లు చెప్పటానికిప్పుడు తోటలో పొలదగ్గరకి నన్ను పిలవటం లేదేం కుసుమా?"

"ఏమున్నాయి చెప్పటానికి—అడగటానికి? ఊళ్ళో కొత్త సంగతు లేమున్నాయి?"

"లేకేం? ఊళ్ళో ఇంత పెద్ద ఆస్పత్రి లేచిందిగదా, ఆస్పత్రి ఎలా నడుస్తోంది? అక్కడ రోగు లెలా ఉన్నారు? ఇలాంటివన్నీ అడిగి తెలుసుకోవచ్చుగా! నా విషయంలో నీ కుతూహలం యిప్పుడు తగిందనుకుంటా కుసుమా!"

ఈసారి కుసుమ మధురంగా నవ్వింది. "ఓ! అదా! ఓ వేళ అలా అయివుండొచ్చు. ఒకటి తగ్గితే, ఒకటి హెచ్చటం—ఇది ప్రాపంచిక ధర్మం. ఆకాశంలో మేఘాలు తగ్గితే నదుల్లో నీరు హెచ్చుతూంటుంది. లేకపోతే ఈ ప్రపంచం నిలుస్తుందా చినబాబూ!"

అదేమీ వివాదం కాదు. అసలు వివాదం అనేది రానే రాదు వారికి. అయినా కుసుమ విషయమై శశి లోపల భయం పట్టుకుంది. ఆమె ఇలా వ్యవహరించటం అతడికి కటువుగా కన్పించింది. అందులో భయపడాల్సిందేముందో తెలియదతడికి. కష్టంమాత్రం వేసింది. ఇప్పుడు కొంచెం సాహసంగా "కుతూహలం తగ్గిందా, హెచ్చిందా?" అని అడిగాడు.

"ఏమో ఏం చెప్పగలను! ఒకటిమాత్రం కొంచెం హెచ్చిన మాట నిజం."

పరాన్ సంగతి అడుగుదామని వచ్చి శశి ఇవన్నీ మాట్లాడుతూ కూర్చున్నాడు కుసుమతో. ఇవే అతడికేదో చాలా ముఖ్యమైనవిలా తోచాయి. తర్వాత ఇక వచ్చేసే ముందు పరాన్ సంగతి అడిగి తెలుసుకున్నాడు. పరాన్ గొంతుపుండు కొంచెం తగింది.

తగిందా? మంచిదే! అయితే వాజిత్పూర్ డాక్టరు మందుతో పరాన్‌కి తగ్గిందన్నమాట. శశి మందుతో ఎక్కువయింది. పరాన్ ఇంత అన్యాయంగా వ్యవహరిస్తాడన్న విషయం శశి కన్నడూ ఊహకి కూడా అందలేదు. ఎక్కువయే అవకాశాన్ని కల్పించి, తగే ఉపాయాన్ని చూపలేదు. శశి మందుతో పరాన్ గొంతు పుండు పెద్దదయిందన్నమాట. అక్షరాలా నిజమన్నమాట!

పరాన్‌కి గొంతుపుండు తగింది. కాని ఒంటికి బలం రాలేదు. అంత దుమ్మటంలా ఉండేవాడు చిక్కిపోయినట్లు కన్పిస్తున్నాడు. టానిక్కు ఏదైనా తీసుకోవాలి. నెల్లాళ్ళలో మామూలు మనిషిగా తయారయే టానిక్కు ఏదైనా యివ్వగలడు శశి. కాని ఆమాట చెప్పటానికి సంకోచం పట్టుకుంది శశికి. తాను యిచ్చిన టానిక్ ఒక మోతాదు పుచ్చుకుని, తన ఆరోగ్యం పాడైందని అతను మళ్ళీ వాజిత్పూర్ డాక్టరు దగ్గరకి పరుగెత్తుతాడేమో ఏం చెప్పగలం?

"నీ శరీరం సంగతి చూసుకో పరాన్!" అన్నాడు శశి.

"వ్యవసాయం చేయటం లేదు చినబాబూ! చెయ్యాలని కూడా లేదు" అని పరాన్ కొంచెం నవ్వి, "అది చాలావరకు మామగారికి తాకట్టులో ఉంది" అన్నాడు.

"మామగారికి మగపిల్లలు లేరుగా, ముగ్గురూ ఆడపిల్లలే నాయె. చివరికి అంతా అల్లుళ్ళకే ఇస్తాడు. ఏదో నామకః తాకట్టేగా!" పరాన్ ఆవులిస్తూ "ఇక్కడిదంతా అమ్మేసుకుని మేము అక్కడికి వచ్చి ఉండాలని మామగారి ఉద్దేశ్యం" అన్నాడు.

"ఎందుకు వెళ్ళకపోయారు?"

"అదెలా చినబాబూ? ఈ ఊరూ, ఇక్కడి ఇల్లు వాకిలి

★ జీవనలీల ★

అమ్మకుని మామగారి పంచకిపోయి ఉంటావా?"

ప్రతిధ్వనిలాగా వినిపించిం దామాట—ఒకరిమాట మరొకరు అప్ప గిస్తున్నట్లు...! ఏవిషయంలోనూ పరాన్ కలాంటి స్థిరనిర్ణయ మనేది ఉండదు. కుసుమతండ్రి ఆనంద్ వచ్చి "రండమ్మా కుసుమా! ఇక్కడున్నదంతా అమ్మకునివచ్చి మా దగ్గిర ఉందురుగాని రండి' అని అంటున్నట్లు 'అదెలా వీలవుతుందినాన్నా! ఈఊరు ఇక్కడ ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి మీ పంచకివచ్చిపడి ఉంటామా?' అని కుసుమ అంటున్నటు వినిపించసాగింది శశికి.

శీతకాలం ముదిరేముందు ఈసారి యామిని దగు శాశ్వతంగా ఆగిపోయింది. రెండునెలలు జ్వరం తగిలిపోయా డతడు పాపం! లేహ్యాలు వండే గంగాళాలు అలాగే ఉండిపోయాయి. అల్మరాలో సీసాలనిండా, డబ్బీలనిండా ఉన్న రకరకాల మందులూ అలాగే ఉండిపోయాయి. వసారాలో గోడని తగిలించిఉంది హుక్కా గొట్టం; ముసలియామిని హృదయస్పందన నిలిచిపోయింది, అనూందష్టాలచప్పళ్ళూ ఆగిపోయాయి. ఈవార్త తెలిసి సేన్‌దీదీ అన్న కృపానాథ్ వచ్చాడు. అతడూ ఆయుర్వేద వైద్యుడే. ఇతడు సకుటుంబంగా వచ్చాడు. వచ్చి యామినిహుక్కా తీసి కాల్చటం మొదలెట్టాడు. అతడు ఆల్మారాలో సేకరించిపెట్టిన మందులూ అవీ చూశాడు: వంటఔషధాలు తయారుచేసే ఆ గంగాళాలు మళ్ళీ పొయ్యిలమీద ఎక్కుతాయని యామిని అనూందష్టాలు మళ్ళీ చప్పుడౌతాయని అనిపించింది. ఎటొచ్చీ సేన్‌దీదీ ఒక్కతేమాత్రం ఇహ ఈ జీవితంలో మళ్ళీ 'సధవ' కాలేదు.

అయితే సేన్‌దీదీ ప్రసవించబోయేస్థితిలో ఉన్నట్లు తెలిసింది.

వింటే నమ్మబుద్ధి పుట్టకుండా ఉంది. కాని నమ్మకుండా ఉండటానికి వీలులేకుండా ఉంది. ఇది ఒట్టి గాలికబురు కాదు! కళ్ళతో చూసిన సంఘటన! సేన్‌దీదీ అందాన్నంతా హరించి, ఆమెకొక కన్నుపోయేట్లు చేసి,—భగవంతుడి కామెమీద అదేం మమకారమో మరి బిడ్డను కలిగించబోతున్నాడు. ఆహా! ఏమి కాలమహిమ! మానవ జీవితంలో నష్టాన్ని భర్తీ చేసుకునే అవకాశం లేకపోతే బండి నడుస్తుందా మరి! సంజెవేళ శ్రీనాథ్ కూతురు పొగడచెట్టుక్రింద బొమ్మ పారేసిపోతే, తెల్లవారకట్ల ఆ బొమ్మని ఎత్తుకునివస్తూ ఎన్నాళ్ళని గడపగలదు సేన్‌దీదీమాత్రం?...

శశిముఖం చిన్నబోయింది. విషణ్ణమైపోయింది. తలవంచుకుని మౌనవాడిలా ఏం మాట్లాడకుండా అలా కూచునిపోయాడు గాఁవాఁదియాలో పేరుగల డాక్టరు, తెలివున్న నాయకుడు అయిన శశికి ఏం జరిగింది? సేన్‌దీదీ తనన్ని కొడుకులా చూసుకునేది! ఇహముందు అలా చూసుకోదు అనటానికి బలమైన ఆధారాలేమీ లేవు. ఇప్పుడామెకి అలా చూసుకోవటానికి ఓ బిడ్డ పుట్టబో తున్నందుకు శశి విచలితుడవటం దేనికి?

గోపాల్ భయపడుతూ—"అవును శశీ, నీకు ఇంట్లో ఏం సుస్తీగా లేదుకదా!" అని ప్రశ్నించాడు.

"ఉహూఁ." అన్నాడు శశి.

"లేకపోతే సరే, కొత్త జాగ్రత్తగా మాత్రం ఉంటూఉండు" డాక్టరైన శశిని జాగ్రత్తగా ఉంటూఉండమని గోపాల్ హెచ్చరించటం: అదీ ఎంతో మెత్తగా, దయాదాక్షిణ్యాలను అర్థించేవాడిలా మాటాడటం: బహుశా గోపాల్ చెప్పలేకున్నదది అయిఉండదేమో: చిన్నబోయి ఉన్న శశిముఖం చూసే సరికి గోపాల్ గుండె దడదడ కొట్టుకుని ఉంటుంది. ఆ ధ్వనిని శశి చెవిని పడవేయాలని అనుకుని ఉంటాడు. ఇహ వతడు గోపాల్ కొడుకు కాదు. ఒట్టి శశిమాత్రమే. వాజిద్‌పూర్‌లో శశికి ఏం పని ఉందో ఏమో! ఊళ్లో లక్షపనులుంటే అన్నిటినీ వదిలి హఠాత్తుగా వాజిద్‌పూర్ వెళ్లాడు. సీనియర్ వకీలు రామతారక్ గారింటో ఒకరోజు గడిపి, తర్వాత గవర్నమెంట్ డాక్టరింటికి వెళ్లాడు. అతడితో శశి కిటీవల బాగా స్నేహమయింది. వారింట అతిథిగా ఉండటంతో ఈ సారి ఇద్దరుపిల్లలు, భర్తతో సరసత నవ్వుతూంటే ఆయన భార్యతో కూడా పరిచయం ఏర్పడింది. మానసిక విపర్యయం ఏర్పడినప్పుడు ప్రపంచంలో ఒక్కొక్కప్పుడు అల్పులవలకూడా పెద్ద సాంత్వన లభిస్తూంటుంది. మాటకారి కాదు, వ్యవహారజ్ఞానమున్నదికాదు, ఒట్టి పిరికిమనిషి. అమాయకురాలూ అయిన డాక్టరుగారి భార్య కావేపట్లే శశిని విధేయుణ్ణి చేసుకుంది. టీ తీసుకొస్తూంటే అది తొణికిపోయింది. పిల్లవాణ్ణి ఎత్తుకుంటూంటే పమిట జారిపోయింది. ముసుగు సవరించుకోబోతే జుట్టుముడిజారిపోయింది. గబగబా గదిలోంచి వెళ్ళిపోబోతే గుమ్మంకూడా కొట్టుకుంది.

అబ్బ వాళ్ల కొదుబాబూ! అనుకుంది.

అది నిజమే. అయినా ఎలాగో అలా అన్నిపనులుచేస్తూనే ఉంది. దానికి దాటు—మాటుకూడా ఏం చూడదు. ఆమె పొరపాట్లు ఎదుటి వారికి తెలుస్తూనే ఉంటాయి. ఆమె స్వభావం ఎలాంటిదయింది అరగంటలో పసికట్టవచ్చు ఎవరైనా. అందుకనే భర్తకివచ్చిందామె, శ్రీకి నచ్చింది.

ఆమె పేరు సుశీల. తన ఊరూ-పేరూ అన్నీ చెప్పి, "మా పేరయ్యగారి ఊరు మా ఊరికి మూడుకోసులు. అయన్ని ఎరుగుదురా? హరిశ్చంద్రదనియోగి. నేను వాళ్ల ఊరు చిన్నప్పుడెప్పుడో వెళ్ళాను ఒకసారి. మా నాన్న మున్సఫ్‌గా. అయనతో అక్కడికీ ఇక్కడికీ తిరిగేదాన్ని" అన్నది.

"ఇప్పుడు భర్తతో తిరుగుతున్నారు"

"ఏది? అర్నెల్లయిం దిక్కడికివచ్చి, అప్పుడే బదిలీ అవుతుందా?"

"మర్నాడు ప్రొద్దున్న ఇంటికి తిరిగి వద్దామని శ్రీ రేవులోకి వచ్చినుంచున్నాడు. ఓ పడవ మాట్లాడుకోవాలి. రేవులో కుసుమ తండ్రి అనంత్ కన్పించాడు.

"డాక్టరుగా రిక్కడున్నారేం?" అని అడిగాడు అనంత్.

"ఓ పనిమీద వచ్చాను. పడవ ఏదయినా మాట్లాడుకుని ఇంటికి వెళ్ళాలి."

"మా పడవ తెచ్చుకోలేదూ! నేనూ గాంధాదియాకే వస్తున్నాను. డాక్టరుగారూ! మా పడవలోనే రారాదూ? అయితే ఉండండి ఒక్క క్షణం. పడవలోనే ఎక్కి కూర్చోండి. చప్పున బజారుకివెళ్ళి మా కుసుమకి రెండుచీరలు కొనుక్కుని వస్తాను. అరేయ్ హనీఫ్: ఇలా తీసుకురా, పడవని ఈ ప్రక్కకి తీసుకురారా డాక్టరుగారు ఎక్కుతారు" అన్నాడు అనంత్.

కాసేపట్లోనే కుసుమకి రెండుచీరెలు కొనుక్కుని వచ్చేశాడు. అనంత్ పడవలోకెక్కి, కొంచెం ఎడంగా కూర్చున్నాడు శ్రీ.

"అమ్మాయి వస్తానని రాసింది డాక్టరుగారూ: ఏకంగా పెద్ద పడవ ఒకటి మాట్లాడుకుని ఇక్కడికిరా. రెండు రోజులుండి అందర్నీ తీసుకువెళ్లొచ్చు అని రాసింది. మీరు మాకు చాలా ఉపకారం చేశారు డాక్టరుగారూ" అన్నాడు.

శ్రీ తెల్లబోతూ—"నేనేం చేశానుమీకు ఉపకారం?" అన్నాడు. "మీ సలహామీదనే అమ్మాయివాళ్ళు మా దగ్గరికివచ్చి ఉండటానికి నిర్ణయించుకున్నారని అమ్మాయి రాయలేదనుకున్నారా? మా అమ్మాయి కాస్త వెర్రిబాగులది అసలు...మీసలహా ఎలా విన్నదో అదే ఆశ్చర్యం. వాళ్లకిప్పుడు చెప్పానా? మా వియ్యంకుడు పోయినప్పట్నుంచీ మా అమ్మాయినీ అల్లుడినీకూడా—'ఇంత అవస్థలుపడుతూ ఇక్కడ ఉండవలసిన ఖర్మం ఏం వచ్చింది? మాదగ్గరకివచ్చి ఉండండి!' అని పోరుతూ నేఉన్నా. అల్లుడి ఇష్టాయిష్టాన్ని నేనంత పాటించనేలేదు డాక్టరుగారూ! అతడుకల్ల—కపటం తెలియనివాడు. మరి అమ్మాయి ఒప్పుకుంటే అతను ఒప్పుకున్నట్టే కాని అదేఅడ్డు చెపుతూవచ్చింది 'అత్తగారున్నారు, ఆడబిడ్డఉన్నది. వాళ్ళు నా పుట్టింటికివచ్చి ఉండటాని కిష్టపడతారా?' అంటూ వచ్చింది. అమాటానిజమే. ఆడబిడ్డపెళ్ళి అయేంతవరకు కదలకుండా ఊరుకున్నాను. ఇప్పుడిహ ఉన్నది ఒక్క అత్తగారు. ఆమెకి అయిష్టంలేదు. అలాంటప్పుడిహ రావచ్చునుగా! అప్పుడూ రాలేదు. లక్ష అభ్యంతరాలుచెపుతూ మా అమ్మాయి అక్కడే నానాగడ్డీ కరుస్తోంది. నిత్యదరిద్రమూరా! అక్కడ ఏం సుఖం ఉందని..."

అవును. ఇక్కడ తనకేం సుఖమని కుసుమ ఇన్నాళ్లనుంచి ఉంటోంది? అనంత్ సంపన్నగృహస్థు. ఆసంగతి అతను వేసుకున్న కాటన్‌కోటూ, ఉత్తరీయాలే చెపుతున్నాయి. పుట్టింటిదగ్గర కుసుమ ఎంతో సుఖంగా ఉండొచ్చు. కుసుమ కిన్నాళ్ళకి వచ్చిం దన్నమాట మంచిబుద్ధి! ఆమెకిబుద్ధి కుదిరిందని శ్రీకి చెపితే వచ్చిన నష్టమేమీ లేదు, తన సలహావల్ల బుద్ధికుదిరిందని తండ్రికి రాయటంలో కుసుమ ఉద్దేశం ఏమిటి?

పై ఉత్తరీయం, కోటూ తీసేసి, అనంత్ విశ్రాంతిగా కూర్చుని:

"మొదట శ్రావణమాసంలో తీసుకు వెడతానని వచ్చినప్పుడు నాజీమ్పూర్ దాకా మీతో కలిసి వచ్చామునుగా; అప్పుడు ఒప్పుకుంది. కాని మళ్ళీ దారిలోనే మనసు మార్చుకుంది" అన్నాడు.

"చాలా పసితనం ఆమెకింకా" అన్నాడు శ్రీ.

"అందరిలోనూ చిన్నది. పెదపిల్లలిద్దరూ పెళ్ళయి అత్తవారిళ్లకి వెళ్లాక అదిగా మాదగ్గరున్నది! చాలా గారాబంగా పెరిగింది. అంచేత అదోకరకంగా తయారైంది. అందరికంటె మంచి సంబంధమే చూసిచేశాను. అయినా కష్టాలు రాసిపెట్టిఉన్నాయి దాని మొహాన. ప్రపంచంలో మనం అనుకునేది ఒకటిఅయితే జరిగేది మరొకటి అవుతూ ఉంటుంది డాక్టరుగారూ, బొమ్మలపుత్తళ్లం కాదూ మనం— పైన ఒకరు చాటునఉండి ఆడిస్తున్నారు మనల్ని."

శ్రీ కొంచెంనవ్వి, "అత డెవరో ఒకసారి కన్పిస్తే కాపుండును చూస్తాను" అన్నాడు.

"మీరు చూడాలనుకుంటే ఎందుకు చూడలేదు. డాక్టర్లకి దాసోహమే ఎవరైనా!" అన్నాడు అనంత్.

పడవ నదిదాటి, కాలవలో ప్రవేశించింది. అనంత్‌తో మాట్లాడుతూ మాట్లాడుతూ యాధాలాపంగా "పరాన్ అన్నీ అమ్మేస్తాడా? ఇల్లూ-వాకిలీ, భూమీ-పుట్రా అన్నీ?" అని అడిగాడు.

"మా దగ్గరవచ్చి ఉండేటప్పు డిక్కడ ఇల్లూ వాకిలీ అటేపెట్టుకుని ఏంలాభం? హడావిడి ఏంలేదు. ఒక్కొక్కటే అన్నీ అమ్మేసాం. మీకు తెలిసినవారెవరైనా కావాలంటే—"

"చెపుతాను. ఎవరైనాఉంటే చెపుతాను మీకు"

అయితే కుసుమ గాంధాదియా శాశ్వతంగా వదిలి వెళ్ళిపోతుందా? ఇంత తొందరపడాల్సిన అవసరం ఏంవచ్చింది? శ్రీ వెళ్ళిపోతాడు. కుసుమకంటె దూరందేశం— ఆత్మీయు లెవరూ లేని చోటుకి...

శ్రీ ఊరువదిలి వెళ్ళిపోయేంతవరకైనా, కుసుమ ఊళ్ళో ఉండలేదా? బహుశా పరాన్ ఆరోగ్యం దెబ్బతిన్నదని కుసుమ త్వరగా వెళ్ళిపోవాలనుకుంటోందేమో ఇక్కడినుంచి. అక్కడ పరాన్‌కి విశ్రాంతి లభిస్తుంది. రోజూ గడవటమెలాగా అని వెంగపడనక్కర్లేదతడు. అస్వస్థశరీరంతో తెల్లవారగట్ల అయిదింటికే లేచి పొలం పనుగ తనక్కర్లేదు అక్కడ. కుసుమ తెలివయిన పనే చేస్తోంది. కాని శ్రీతో ఒక్కసారి మాట మాత్రంగానైనా ఎందుకు చెప్పలేదు? మతి—కుముదుల వ్యవహారం తెలుసుకోటానికి ఓనాడు ఎంత తెల్లవారగట్ల తనని తాటితోపుకి పిలుచుకుని వెళ్ళింది! ఇంతపెద్ద కారణం ఉండికూడా కుసుమ మెదలకుండా ఎందుకు ఊరుకుంది? ఈ సంగతి చెపుదామనే సాకుతో ఏవేళ కాని వేళో ఓసారి శ్రీగదిలోకి రాలేకపోయిందా?—గోపాల్ లేచి వసారాలో కూర్చుని ఉంటాడు. కనుక తలుపు గడియవేసి ఆమె ఎంతసేపైనా శ్రీదగ్గర కూర్చోవచ్చు కదా అనే ఆశతో నయినా రాకూడదూ? కుసుమకి కోపం వచ్చిందా!

ఇంట్లో అడుగుపెట్టగానే గోపాల్—"ఎక్కడికి వెళ్లావ్ శ్రీ? మేజిస్ట్రేట్ గారు ఊళ్ళోకివచ్చి, డేరావేసుకుని మకాం పెట్టారు మొన్ననుంచి. వాళ్ల బంట్రోతు నిన్ను పిలవటానికని పదిసార్లు వచ్చాడు. శీతలబాబు రెండుపూటలా మనిషిని పంపుతున్నారు. ఎక్కడికి వెడుతున్నదీ, మళ్ళీ ఎప్పుడు వచ్చేది అయినా

(39-వ పేజీ చూడండి)

నీతిమంతుడు

నీతిమంతుడు కావడం ఎంత కష్టమో, నీతిని నిలబెట్టుకోవడము కూడా అంత కష్టము. అయితే, నీతిని ఏ పరిస్థితిలోనూ వదలలేని అంతే పట్టుదల పొందదగ్గదే అయినా, ఒక్కొక్కమాటు నీతిని తప్పి అవినీతిపాలు కావడం హర్షించబడుతుంది, నీతిమంతుల చేతే! అసలు. అవినీతిని ఎక్కువగా ఆదరించే జనం హెచ్చుగా ఉన్నప్పుడు, నీతిపరుల సంఖ్య కనపడనంత స్వల్పంగానూ, నీతిపరులకు ఆదరం మాట అటుంచి, అవహేళనపాల అయ్యేటట్లుగానూ, ఉండడం తరచు సంభవమే!

అమాయకులలోను, అక్షరజ్ఞానం లేనివారిలోను, స్త్రీలలోనూ, హెచ్చుగా నీతినియమాలు కనపడతాయని వాదించేవారు కామాక్షమ్మగార్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈమూడు లక్షణాలు ఆమెకు ఉన్నాయి. ఆమె అమాయకురాలు. చదువు లేదు. ఆమె వితంతువు కూడా! ఆమెను ఏ తాపత్రయమూ లేదు. స్కూలు ఫయినల్ కు పరీక్షకు వెళ్ళిన కొడుకు కామేశం తాపత్రయం తప్పితే!

కామేశాన్ని, ఎలాగయినా పైకి తీసుకురావాలనే పట్టుదల ఆమెలో ఉన్నది. అందుకే ఆమె బ్రతుకుతుంట, అని అక్కడక్కడ, అప్పుడప్పుడు అంటుంది. కామేశం తెలివిలోను, బుద్ధిమంతతనంలోనూ ఆమెకు నమ్మకమున్నది. అయితే, మగవాని లోటు అయిన కాపరంలా ఉండదు కామాక్షమ్మ ఇంటితీరు. ఆమె ఇంటిని చక్కగా నిర్వహిస్తుంది. కామేశం కూడా అల్లరిచిల్లరివాడు కాదు, తల్లిమాట మీరడు, పెద్దలఎడ భక్తి పిన్నలఎడ అభిమానం చూపే ఆదర్శబాలుడు. అందుకే కామాక్షమ్మ నిక్షేపంగా నిశ్చింతగా ఉండగలుగుతోంది.

“పరీక్షలు బాగా వ్రాశావా నాన్నా!” అన్న తల్లి ప్రశ్నకు కామేశం సమాధానం ఇవ్వకపోతే ఆమె బాధపడది. బెంగపెట్టుకొంది. మరునిముషంలో ఆమె బాధను పోగొట్టుకొంది. కర్మసూత్రాన్ని పాటించాలనుకొంది. కావలసింది అవుతుందనుకొంది. “పోనీ మరొక ఏడు” అంది.

ఈమాట కామేశానికి కొరడా దెబ్బలా తగిలింది. అలా వీల్లేదు అనుకొన్నాడు. తను పరీక్ష ప్యాసుకావాలె! అయితే...తను ఇంగ్లీషుపరీక్ష తగలబెట్టాడు. రావలసిన మార్కులు రావు. కామేశానికి ప్యాసుఅంటే మహాపట్టుదల. పరీక్షపోవడం హీనంగా భావిస్తాడు. పరీక్ష తప్పిన కుర్రాడు జులాయి కుర్రాడు, అవకతవకవాడు అనుకుంటాడు. కామాక్షమ్మకు కూడా ఇదే భావన ఉంది.

కామేశం రెండురోజులు జ్వరంతో లంఘణాలు చేశాడు. మామూలు జ్వరం లక్షణం లేదు. రాత్రింబగళ్లు అసమానమూ పరీక్ష సంగతే...పరీక్షపోయినట్లు బాధపడతాడు.

“అదికాదు నాన్నా! నువ్వు అలా బాధపడకూడదు. పరీక్షపోవడం తప్పేం కాదు అందరూ ప్యాసవుతే పరీక్ష లెందుకురా అబ్బాయి! నువ్వు ఈవిషయం మనసులో పెట్టుకోకు” అని హితవుగరిపింది.

“సీతాదేవి”

కామేశానికి తల్లిమాటలు రుచించలేదు. పైగా బాధకలిగింది. “పరీక్ష ప్యాసవుతే అమలాపురం కాలేజీలో చేరదామనుకున్నానే అమ్మా!” అని బావురుమన్నాడు. ఆమెకు కూడా దుఃఖం పొంగుకొచ్చింది. నిజంగా, కామేశం బాధపడుతున్నాడంటే తప్పేమీ లేదనుకుంది. కామేశం ఎలా చదివింది తనకు తెలుసు. తనధర్మాన్ని తను నిర్వహించినపుడు తనకెందుకు ఈశిక్ష!

“అవునులే నాన్నా! అన్నీ మనం అనుకున్నట్లు జరుగుతాయా! భగవంతుని నిర్ణయం జరిగి తీరుతుంది తండ్రీ!” అంది తల్లి. తల్లి ఎన్ని చెప్పినా కామేశం బాధపడ్డం మానలేదు.

“రాము నాన్న ఫిరంగిపురం వెడతాట్ట!” అన్నాడు ఉన్నట్లుండి కామేశం. ఆమెకు అర్థం కాలేదు ఎందుకంటున్నాడో...

“ఎందుకు...?”

“వాడికీ ఇంగ్లీషు అనుమానంగా ఉందిట. వాళ్ళనాన్నని ఫిరంగిపురంపంపిస్తున్నాట్ట!”

“ఫిరంగిపురం ఎందుకు?”

“నీకేమీ అర్థంకాదు. మార్కులకి. మా ఇంగ్లీషు పేపరు అక్కడకు వెళ్లింది.” కామాక్షమ్మ అర్థం చేసుకోగలిగింది కామేశం ఎందుకు కుమిలిపోతున్నాడో! కామేశానికి కూడా తండ్రి ఉంటే! అని అనుకోసాగింది. మార్కులు వేయించుకొని ప్యాసుకావడం తప్పుదారి అయినా, ఆ తప్పును మాతృభావం పూర్తిగా కప్పి పుచ్చింది! తండ్రి లేడనే లోటు ఇంతవరకూ కామేశం ఎరగడు. అందుకు కొంత కారణం కామేశం బుద్ధిమంతతనం కూడా! కామేశం బుద్ధిమంతుడైనా అభిమానవంతుడు. తను ఎంత చెప్పినా, కొడుకు బెంగపెట్టుకోవడం మానడు. పిల్లవాడికోసం తను ఏపనైనా చేసి తీరాలి. నిశ్చయం చేసుకొంది నిబ్బరంగా అంది...

“నేనూ వెడతాను ఫిరంగిపురం. ఆపంతులు పేరు చెప్పు.”

“నువ్వా?” ఎప్పుడూ అంత ఆశ్చర్యపోలేదు కామేశం. ఈమాట తల్లేనా అంట అన్న అనుమానం అతనికి కలగకపోలేదు. తల్లికి ఇంత ధైర్యం ఉందా? అనుకోసాగాడు. “నువ్వా” అన్నమాటను తిరిగి తిరిగి రెట్టించాడు.

“అవును నాన్నా! నేనే వెడతాను. పంతులు పేరు చెప్పు. ఒక్కగాని ఒక్క కొడుకువి నువ్వే నాకు అన్నీ! నువ్వు ఇలా బాధపడి బెంగపెట్టుకుంటూంటే నేను చూడలేను. ఆ పంతుల్ని ప్రాధేయపడతాను. కోరతాను. కాళ్ళు పట్టుకుంటాను. ఏమైనా చేస్తాను. నీకోసం, నీబాగుకోసం, అభిమానం, ఆత్మ, అన్నీ అమ్ముకుంటాను.”

కామేశం తల్లిని ఇంత దూరానికి తీసుకురావడం నిజంగా ఇష్టం లేకపోయినా, తను ప్యాసు కావాలనే కాంక్ష ఆబాధను పైకి రానివ్వలేదు. పంతులు పేరు చెప్పి పంపించాడు.

ఫిరంగిపురం చేరుకొంది కామాక్షమ్మ. పేరి శాస్త్రిగారి ఇల్లు వాకబు చేసి కనుక్కొంది. వీధి అరుగు మెట్ల మీద పడక కుర్చీలో కూర్చున్నారు ఆయన. బండి దిగిన కామాక్షమ్మను చూసి ఆయన ఒక్కమాటు విభ్రాంతిపోయారు. ఆయన్ని ఎగా దిగా చూసింది. ఆయన సౌమ్యంగా కనపడ్డాడు కామాక్షమ్మకు. తను వచ్చిన పని అవుతుందనుకొంది. ఆయనే లోపలకు పంపించారు. “రండమ్మా!” అంటూ! పేరిశాస్త్రి భార్య ఆమెను లోపలికి తీసుకువెళ్ళి కాళ్లు కడుక్కోడానికి నీళ్ళూ అవీ ఇచ్చింది. ఆయన సంసారం కొద్దిగా పెద్దదే! చుట్టంలా చూ

నుంటే, కామాక్షమ్మ కొద్దిగా అనుమానించింది... పీట మీద కూర్చుంటూ, "అమ్మా, మీవారిపేరు పెరిశాస్త్రికదూ!" అంది. ఏకవచనంతో, తన పెద్దరికాన్ని చూపించుకోవడమే కాక, ఆప్యాయత కనబరుస్తూ, వారిని కూడా తన ఎడ ఆప్యాయత చూపించమన్నట్లుంది.

పెరిశాస్త్రిభార్య ఒక్కక్షణం అదోలా చూసింది. ఆ చూపులు కోమలిని చూచి నవ్వుకున్నాయి. ఆవిడ అంది. 'అవును పిన్నిగారూ...'

"అవును అమ్మాయీ! ఊరికే నే అడిగాను. స్కూలుకు దగ్గిరేలా వుంది ఇల్లు" అంది. పెరిశాస్త్రి పంతులయిందీ కానిదీ, తను కావలసిన చోటుకు వచ్చానా, లేదా, అని తెలుసుకోవడానికి.

'ఆ...ఎంతదూరంగాని...దగ్గరే..." అని నవ్వింది. ఆవిడ అనుమానాలు ఆవిడలోనే వున్నాయి. కామాక్షమ్మ అనుమానాలు తెలివిగా తీర్చుకుంటోంది. ఆవిడ ఇచ్చిన కాఫీగ్లాసు అందుకుంటూ.

"ఈపిల్ల ఇలా వుందేమిటి?"

"ఏమోనండి...ఏం చిక్కిపోతోంది..."

"తల్లిపాలు వున్నాయా?"

"ఆ" అని సిగ్గుపడింది. కామాక్షమ్మ ఆమెకు చాలాదగ్గరగా వస్తోందిమాటల్లో. ప్రక్కనే నుంచున్న పద్నాలుగేళ్ళ కుర్రాణ్ణి చూస్తూ "వీడే పెద్దాడనుకుంటాను" అంది.

"ఆ వీడే పెద్దకుర్రాడు. మొన్న స్కూలుఫయినల్ పరీక్షవ్రాసవచ్చాడు" అంది ఆమె.

"అదృష్టవంతురాలవమ్మా! తగిన భర్త, బుద్ధిమంతులయిన పిల్లలు. ఇంక కావలసిందేమిటి" అంది నిజంగా మురిసిపోతూ.

ఆమెకూడా కామాక్షమ్మ మాటలకు సంబరపడింది. భర్తకు కాఫీ గ్లాసు తీసికెళ్ళింది ఆమె. ఆయనకూ తెలియదు, ఆమెకూ తెలియదు ఆవిడెవరో!

"ఎవరట?" అన్నాడు ఆయన.

"మరిచిపోయింది...మీకూ తెలుసుదూ!" అని నిర్ఘాంతపోయింది ఆమె.

"సరే...పొరపాటున...ఒక ఇంటికి రాలేయి..."

"మనింటికే... పొరపాటు కాదు. శుద్ధంగా మీ పేరు చెపితే."

"చిత్రంగా ఉందే. నేను చూడని చుట్టమా!"

ఆయన కాఫీతాగి వంటింటిలోకి వచ్చారు. కామాక్షమ్మగారు అరటికాయ చెక్కు తీస్తున్నది. ఆయన మరొక్కమాటు నిర్ఘాంతపోయాడు!

"అదేమిటే...ఆవిడకు పని అప్పచెప్పావా!" అని భార్యను మందలించబోయాడు.

"నేనేం చేయను?" అంది భార్య.

"తప్పేముంది నాయనా! నీవు తప్ప నాకు కావలసిన ముఖ్యులు ఆప్తులు ఎవ్వరూ లేరు" అని కళ్ళనీళ్ళు పెట్టుకోబోయింది.

పెరిశాస్త్రి మాట్లాడలేదు. ఆమె తప్పక దగర చుట్టమే అనుకున్నాడు. ఆయన వీధి మెట్లాకు వెళ్ళిపోయారు.

"ఎసరు మరిగింది... బియ్యం కడిగి పట్రా అమ్మాయీ." అంది కామాక్షమ్మగారు. ఆమె గిన్నె పుచ్చుకొని బియ్యం కొలిచి పట్టడానికి వెళ్ళింది.

"నాకుకూడా బియ్యం పోసేవు గదూ. నేను పదకొండు గంటల బండికి వెళ్ళిపోతున్నానమ్మా! కాఫీ ఇచ్చావుగా చాలు. ఈ మాయదారి కాఫీ నాకు అలవాటయ్యింది."

ఆమె మరి నిర్ఘాంతపోయింది. "అదేమిటి పిన్నిగారూ. నాలుగురోజులుండి వెళ్ళండి," అంది.

"వెర్రితల్లి! చుట్టమనుకుంటున్నావా అమ్మా! రైల్లోనూ ఇలానే చెప్పారు. చుట్టంకంటే ఎక్కువే మీరు."

"ఎవరయినా అయివుండొచ్చు. నాకేముంది భాగ్యం. ఏమోయ్ పిన్నిగారూ!"

"అన్నీ చెపుతానమ్మా నీకు. నీకుకాక ఎవరికి చెప్పను? నా అదృష్టంకొద్దీ, నిన్ను చూసేగానే మంచిదానివి అనుకున్నాను. ఆడది, ఆడదాని బాధను అర్థం చేసుకోగలదు. నాకూ పిల్లవాడు ఒకడున్నాడమ్మా! మీ గోపాలంలాగే స్కూలుఫయినల్ పరీక్షకు వెళ్ళాడు. ఒక్కగానొక్క కొడుకు. వాడిమీద ఆశపెట్టుకు బ్రతుకుతున్నాను. రెండురోజుల్నించి లంఘనాలు.


కనులకింపగు సొగసు
మీరు చల్లని, హాయి గలిగించే, "'హేజ్‌లైన్' స్నో,"
అత్యున్నత ప్రాంతములందు చర్మ సౌందర్యమును
గలిగించుటకు దివ్యమైనట్టిది, వాడుచున్నప్పుడు, అది
అతిసున్నితమైన చర్మమును శమనపర్చుచూ, మృదువుగాను,
తెల్లగాను వుంచును. చోరవిరోధక ప్యాకింగ్
అసలైన సరుకును గ్యారంటీ చేయుచున్నది.
For the Skin
'HAZELINE' SNOW
"'HAZELINE' SNOW"
"'హేజ్‌లైన్' స్నో"
ట్రేడ్ మార్కు
బర్రోస్ వెల్కమ్ ఉత్పత్తి

★ నీతిమంతుడు ★

ఇంగ్లీషు పేపరు తగలపెట్టాడు. తగలబెట్టినా నాకు బెంగలేదు. ఈ పేపరు కాకపోతే మరో పేపరు. ఈ బెంగతో వాడేమయిపోతాడోనని బెంగ. వాడికోసం, ఆడదాన్ని ఆడదానిలా ఉండక తెగించివచ్చాను. నన్ను అసహ్యించుకుంటావుకదూ!" కామాక్షమ్మగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

"అహా! అలా అనకండీ!" అంది ఆమె బాధగా.

"నాకు తెలుసమ్మా. నే చెప్పితే కాదనరు. ఆ మొండి ఆశతో నే ఇంత దూరం పరిగెత్తుకు వచ్చాను. ఇవి చేతులు కావు... చిన్నదానివయినా!"

"తప్పు పిన్నిగారూ! తప్పు. నేను ఆయనతో చెప్తాను ముందు భోజనం చేసి..."

"కాదు అబ్బాయీ! మళ్ళీమాటు తప్పక ఉంటాను. మరోమాటు తప్పక వస్తాను. అప్పుడు ఉంటాను. నేను వెళ్ళాలి. వాడిని ఒక్కడినే వదలివచ్చాను. జ్వరంతో ఉన్నాడు."

ఆమె భర్తతో మాట్లాడానికి వెళ్ళింది. ఆమె భర్తతో చెప్పింది. భర్త విన్నాడు. కామాక్షమ్మను పిలవమన్నాడు. కామాక్షమ్మ వచ్చింది.

"చూడండమ్మా! మిమ్మల్ని చూస్తే నేను నిజంగా బాధపడుతున్నాను. కాని నా చేతిలో ఏం లేదు." అన్నాడు పేరిశాస్త్రి.

"కాదు నాయనా! నువ్వు నా కొడుకు వంటివాడివి. నిన్ను ప్రార్థిస్తున్నాను. నువ్వు నమ్మవేమో... నేను ఎవరిని కోరలేదు. కొడుకుకోసం. కొడుకుమీద మమకారం ఆడవారికి తెలుసుంది."

"అలా అంటే ఎలా?"

"వాడు జ్వరంలో, బెంగతో, మంచం మీద వెక్కి వెక్కి ఏడుస్తుంటే, బాధతో కుమిలిపోతుంటే ఏ కన్నతల్లి చూడగలదు నాయనా? అందుకే పరిగెత్తుకొచ్చాను. మీ గోపాలుడనుకో నాయనా! ఇతరులను అవినీతి పాలుచేయడం అంత మరో పాపం ఉండదు నాయనా! ఆ పాపం అంతా నాదే..."

పేరిశాస్త్రి నీతి తప్పనివాడు. ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తాడు. అతనిలో సంఘర్షణ బయలుదేరింది. ధర్మ నిర్వహణ, మానవత్వం రెండూ పోరాడుతున్నాయి. అతడు కూడా మానవుడు. ఎదుటివాడు గిలగిల లాడుతోంటే, తనుకూడా, అతను గిలగిల లాడుతున్నాడని బాధపడడం మానవుని లక్షణం. ధర్మనిర్వహణ మానవత్వాన్ని కర్కశంగా నెట్టుకుంది. ధర్మనిర్వహణకు భారీ ఎత్తున ఆత్మస్థైర్యం కావాలి. ధర్మాన్ని ఏమైనా నిర్వహించదలస్తే, ఆమె చెప్పిందే కనక నిజమే అయితే, ఆ కుర్రాడే కనక నిజంగా బాధపడి బెంగతో ఉంటే, దురదృష్టం అతన్ని వెన్నంటి కబళిస్తే, అతడు, చేసినది ఘోరమైన తప్పిదం కాదు. కాకపోయినా, అతనిలోని మానవ సహజమైన కారుణ్యం, జాలి, ఉవ్వెత్తుగా లేచి, అతనిలో తుఫాను లేవదీయదా? అతనిలో మానవత్వానిదే జయం!

"అమ్మా! మీ వాడికి సహాయం చేస్తాను. ఈ వేళ భోజనం మీరు ఇక్కడే చేయాలి. మరొకటి, మీ వాడిని ఇక్కడకు ఒకసారి పంపించాలి."

ఆమె కళ్ళు మిలమిల మెరిశాయి. అతని చేతులు రెండూ పుచ్చుకొంది. "నువ్వెంత మంచివాడివి బాబూ! భోజనం మరోకమాటు చేస్తాను. అక్కడవాడు జ్వరంతో ఉంటే అన్నం ఎలా తినగలను చెప్పు? వాడిని తప్పక తీసుకువస్తాను. నా కోరిక నెరవేర్చావు. నే నెలా ఋణం తీర్చుకోనేది? మళ్ళీ కలుసుకుంటాను. అమ్మాయి వెళ్ళివస్తాను."

గోపాలుడు ఆమెను రైలు ఎక్కించి తిరిగి వచ్చాడు.

ఆమె సంతోషంగా, వేగంగా యింటికి చేరుకొంది. కామేశం ఆత్రుతగా వీధివంకే చూస్తూ పడుకొన్నాడు. ఆమె వెళ్ళి, అతని తల నిముర్తూ, "వెళ్ళి వచ్చాను నాన్నా! పని అయింది. నువ్వు ప్యాసవుతావు." అతనికి అక్కడే రోగం తీసిపారేసినట్టయింది!

రెండురోజులకు. ఉదయమే కామేశం, కామాక్షమ్మ ఫిరంగిపురంలో పేరిశాస్త్రి ఇంటికి వచ్చారు. కామేశం భయంగా ఇంటిలోకి వచ్చాడు. కామాక్షమ్మ వస్తూ రావడంతోటే, "నాయనా! నీ చలువవల్ల కుర్రాడు కులాసాగావున్నాడు. అమ్మాయి ఒకపూటకాదు, రెండుపూటల ఉంటాను." ఆమె నవ్వింది, పేరిశాస్త్రి నవ్వాడు. కామేశంకూడా పిరికిగా నవ్వాడు.

ఒంటరిగా పిలిచాడు పేరిశాస్త్రి కామేశాన్ని. భయంగా వచ్చాడు. "చూడు అబ్బాయి! అమ్మను ఇలా కష్టపెటవచ్చా? తప్పుకదూ! తప్పుపనులు పెద్దవారిని చేయమనవచ్చా? ఇలాంటి నీతిమాలినపనులు ఎప్పుడూ చేయనంటే, నిన్ను ప్యాసు చేస్తాను."

కామేశం కళ్ళనీళ్ళతో మాటఇచ్చాడు. "ఇంకెప్పుడూ చేయను మాస్టారూ!" కామేశం నమస్కరించాడు. పేరిశాస్త్రి కరిగిపోయాడు!

"ఫరవాలేదు నాయనా! నువ్వు మంచివాడివైతే, నేను కాస్త నీతిని తప్పినా ఫరవాలేదు. తల్లిని దైవంలా చూస్తూ బాగుపడతావు వెళ్ళు గోపాలంతో ఆడుకో!"

పేరిశాస్త్రికి ఒక్కటే సంతృప్తి: తను నీతిని, ధర్మాన్ని తప్పినా, కామేశాన్ని మంచివాడిగా, నీతిమంతుడుగా చేయగలిగాడు. కామేశంమీద ఆ నమ్మకం ఆయనకు ఉంది. కారణం... కామేశం కళ్ళనుండి రాలిన స్వచ్ఛమైన మంచు బిందువుల్లాంటి కన్నీరు! అదే తార్కాణం! ఇప్పుడు కామేశం బుద్ధిమంతుడే గాక... నీతిమంతుడు కూడా!

పేరిశాస్త్రిని ఇంకొక విషయంలో బాధపెట్టింది కామాక్షమ్మ. వెళుతూ వెళుతూ వెండిగ్లాసు చంటిపిల్లకు ఇచ్చింది. పేరిశాస్త్రి సహించలేదు. కోపం చేసుకున్నాడు.

"నీకు తెలియదు నాయనా! చంటిపిల్లల దగ్గరకు, దేవునిదగ్గరకూ ఊరికే పోరాదు. భోజనం ఎందుకు చెయ్యమన్నావు నన్ను? ఆదరణ. అంతే. ఆ చంటిపిల... నా చంటిపిల ఎందుకు కాదూ! కామేశానికి నేను పెట్టలేనా? మీకంటె ఆప్తులెవ్వరు! మా ఊరిద్వారా వెళితే మీరు దిగకపోతే నేను సహించను. ఒప్పను!"

పేరిశాస్త్రి నవ్వుకున్నాడు. అతనిలో పూర్తిగా మార్పు కనబడింది భార్యకు. కామాక్షమ్మ ముందు, పేరిశాస్త్రి, కామేశంలా వున్నాడు మారు మాటాడలేకుండా! ఆమెకూడా అంతే. కామాక్షమ్మకు పేరిశాస్త్రికి, కామేశానికి భేదం కనబడలేదు. ఈ సంఘటన కేవలం దైవికమే అయినా కలసివచ్చిందే అనుకొంది! ★



వైకుంఠపాళి

ఆ వేళ ఆదివారం. నిద్రమంచంమీదనుంచి లేచీలేవగానే కృష్ణకి ఆ వేళ ఆదివారమని జ్ఞాపకంవచ్చి, వెయ్యిరూపాయలు లాటరీలో గెలిచినంత సంతోషపడ్డాడు. వారమంతా ఉద్యోగబాధ్యతలతో, తక్షకుడిలాటి మేనేజరుతో దినదినగండంగా ఉన్న తనకు ఆదివారం పండగరోజుకంటే విలువైనదిగా అనిపిస్తుంది. గోడమీద ప్రాభాత మందపవనాలకు టపటపలాడే కాలెండరు కాగితాలమీద అతనిదృష్టి నిలిచింది. ఆ వేళ వైకుంఠ ఏకాదశి అనే మరొక విస్మృత విశేషం జ్ఞాపకం రావడంతో కృష్ణ ఎగిరి గంతేశాడు. అతని గంతుతో ప్రక్కనే ఉన్న టేబిల్ మీదనుంచి బెడ్ రూంలాంప్ క్రిందపడింది. ఆ చప్పుడు విని లోపల శారద ఈ విప్లవానికి నాయకుడు కృష్ణ అనీ, అతను నిద్రనుంచి లేచాడనీ తెలుసుకోడానికి అట్టేసేపు పట్టలేదు. ఇలాటి చిన్న చిన్న సంఘటనలు ఆమెకు అతనితో పెళ్ళి అయిన యీ యేడాదిలోగా చాలానే జరిగాయి.

లోపలికి వచ్చేసరికి కృష్ణ ధ్యానముద్రలో ఉన్నాడు. శారద అధరంమీద చిరునవ్వు లాస్యంచేసింది. ప్రతి ఆదివారం నిద్రనుంచి కృష్ణ లేవగానే, ఆరోజంతా ఎలా గడపాలి? అనే తీవ్ర సమస్యతో ధ్యానసమాధిలో ఉండడం శారద అనుభవంలోకి రాని క్రొత్తసంఘటన కాదు.

గోడమీద కొట్టుకుంటున్న కాలెండర్ చూస్తూ, శారద మెల్లగా అంది: "ఇవాళ వైకుంఠ ఏకాదశి."

స్వర్గంలో దూరంనుంచి మధురంగా వినవచ్చే అప్సరస సంగీతస్వరంవంటి ఆమె కంఠస్వరంతో ఒక ఋషి తపస్సుకు విఘ్నం కలిగినట్టయింది.

ఈ గొంతునీ, ఈ రూపాన్నీ ఇంతకాలంనుంచి వింటున్నా, చూస్తున్నా అతనికి ఆమెలో ఏదో నూత్న సౌందర్యం, క్రొత్త ఆకర్షణ కనిపిస్తూనే ఉంటాయి. ఆమె కదలుతున్నప్పుడూ, ఎర్రని పెదవులు విప్పి, అందమైన పలువరుస కనిపించేటట్టు సన్నని సంగీత స్వరంతో మాట్లాడుతున్నప్పుడూ అతను ఆమెను నిశ్చలంగా ఒక మూగప్రతిమలాగ చూస్తూ కూర్చోవడం ఒక మధురమైన అనుభూతి. చిత్రకారుడి కళాజగతులోని ముగ్ధ స్వరూపానికి హఠాత్తుగా ప్రాణంవచ్చి అతనితో మాట్లాడుతున్నట్టు, సంచరిస్తున్నట్టు అనిపిస్తుంటుంది.

"ఇవాళ రాత్రంతా జాగరం చెయ్యాలి. మరి నాకు రాత్రి పొద్దుపోయాక నిద్ర ఆగదు" అంది శారద చిరునవ్వుతో; అతను మత్తుగా చూస్తున్న నిమీలిత నయనాలలోకి చూస్తూ.

ఆ ప్రశ్నతో కృష్ణకు అసలు కర్తవ్యం జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ ఆలోచించ సాగాడు. ఆలోచన తెగక, పరాజయాన్ని అంగీకరిస్తున్నట్టు:

"అదే నాకూ తోచడంలేదు శారూ. నీకేమైనా మంచి ఆలోచన తడితే చెబుదూ" అన్నాడు బతిమాలుతూ.

శారద విజయసూచకంగా అగ్రాసనాన్ని స్వీకరించింది.

పి. గోపీచంద్

"వినోదానికి వినోదం, పుణ్యానికి పుణ్యం రెండూ ఒక్కదెబ్బతో రావాలి" అంది షరతు పెడుతున్నట్టు.

కృష్ణ అసంతృప్తిగా మొహం పెట్టాడు.

"ఉపవాసాలూ, జాగరాలూ చేసినంత మాత్రాన్ని పుణ్యం ఆకాశమంత ఎత్తున పెరిగిపోతుందని నాకు నమ్మకంలేదు శారూ. నాకు కావలసింది వినోదమే. మరి నీకు పుణ్యం కావాలంటే నీ యిష్టం" అన్నాడు.

"చదువుకున్న వాళ్ళంతా నాస్తికులు బాబూ. వాళ్ళతో ఏమీ మాట్లాడలేం" అని మూడో వ్యక్తికి ఫిర్యాదు చేసినట్టు స్వగతం చెప్పుకుని లేచిపోబోయింది. ఈ మాట ఆమె అంటుందని కృష్ణకు తెలుసు. అందుకే తీరా అనేదాక నాలిక కరుచుకున్నాడు. ఆమె వెళ్ళిపోతే తన మధురానుభూతికి విఘ్నం కలుగుతుందని ఊహించి ఆమె జడపట్టుకొని లాగి, లొంగిపోయిన స్వరంతో అన్నాడు:

"సరే నీ యిష్టంలే శారూ" అని.

విజయగర్వంగా శారద భర్తవైపు చూసి నవ్వింది.

"అలాగైతే చీటీలు లాటరీ వేద్దాం" అంది.

కృష్ణకి ఇంతటి అయఃపిండం లాటి సమస్య శారదచేతిలో మైనం ముద్దలాగ కరిగిపోయేసరికి తన తెలివి తేటలమీద నమ్మకం పోయింది. శారదపెట్టిన షరతులకు బుద్ధిగా ఒప్పుకుని, కాగితం ముక్కలమీద తనకు స్ఫురించినవి వ్రాసి సిద్ధంగా కూర్చున్నాడు. శారద వ్రాస్తూంది. ఆమె వ్రాస్తున్న వేవో చూడాలని ప్రయత్నించాడు. ఆమె జాగ్రత్త పడింది. మధ్యమధ్య నవ్వుకుంటూ ఒక్కొక్క చీటీమీదా ఆమె వ్రాస్తున్న దేదో తెలుసుకోవాలని కృష్ణకి చాలా కుతూహలంగా ఉంది. ఆమె చేతికదలికలను పసిగట్టాలని చేసిన ప్రయత్నంకూడా వృథా అయింది

లాటరీ వేశారు. కృష్ణకి మూడుసార్లూ ఒక్కలాగే వచ్చింది. శారదకి మొదటిసారి సినిమా, రెండోసారి భోజనాలు కాగానే హాయిగా నిద్రపోవాలని, మూడోసారి తెల్లవారు ఝామువరకూ రాత్రి ఉపవాసంచేసి భజనచేస్తూ కూర్చోవాలనీ వచ్చాయి. కృష్ణకి చివరిదానితో చికాకం రావడంచూసి, శారద కొంటెగా నవ్వుకుంది. కృష్ణ భజనలూ, పూజలూ అంటే 'వీర' ద్వేషి అని ఆమెకు తెలుసు.

"నాకు మూడుసారూ ఒక్కలాగే వచ్చింది కనక నేనే గెలిచాను" అన్నాడు అతను. మొదట శారద ఒప్పుకోలేదు. కాని చీటీ విప్పిచూశాక ఒప్పుకుంది. ఈ ఆటలో జయం తనదే అని ఏదో ఒక శాశ్వత అధికారం తనకు ఉన్నట్టు ఆమె ఎప్పుడో నిశ్చయం చేసుకుంది.

చీటీవిప్పి శారద చూసింది: "వైకుంఠపాళి."

* * *

సాయంత్రం తిరిగి తిరిగి విసుగ్గా ఇంటికి వచ్చేసరికి శారద మంచి హుషారుగా ఉంది. రాత్రి రాబోయే పందెంలో ముందే విజయాన్ని ఆమె నిర్ధారించేసుకున్నట్టు అతను అనుకున్నాడు. తెల్లని చీర ఆమె పచ్చని శరీరకాంతిలో కలిసి పోయినందున అలంకారాలను అన్వేషిస్తూ, కవిత్వాన్ని చెప్పలేక ఉక్కిరిబిక్కిరయే అసమర్థ కవిపడే అవస్థలో ఉన్నాడు. ఆమె వినీల వేణిలోని మల్లె పువ్వులు యౌవనాగమనంతో రేకులన్నీ విరుచుకొని


యౌవనోన్మత్త మత్తకాశినిలాగ అకారణ దరహాసాన్ని వలకబోస్తున్నాయి. ఆమె కావ్యాలలోని జ్యోత్స్నాభిసారిక అనుకున్నాడు అతను. అతని నిశిత పరిశీలనా దృక్కులకు ఆమె అధరంమీద మధురహాసం వెలసింది.

అప్రయత్నంగా, కృష్ణ "శారద! నీరదేందు ఘనసార తుషార మరాళ మల్లికాహార" అనే పద్యాన్ని రాగంతో చదివాడు.

ఆమె అందంగా, ఒయ్యారంగా రాజహంసగమనంతో లోపలికి వెళ్ళిపోయింది.

కాఫీ త్రాగి కార్యక్రమాన్ని నెమరు వేసుకుంటున్నాడు కృష్ణ. శారద రేడియో రికార్డులతో శ్రుతి కలిపి పాడుతోంది. దూరంగా సాయంత్రం గాలికెరటాలతో కరిగి మెల్లమెల్లగా వినిపించే గుడిగంట నాదం, వేసవికాలపు సాయంత్రం ప్రియురాలి కబరీభరంలోని మల్లికాసుమాల పరిమళ లహరితో బరువుగా మత్తెక్కించే మందమారుతం, శారద శరీరంనుంచి అప్పుడప్పుడు ప్రవాహ తరంగాలుగా గాలిలో కలిగే పచ్చకర్పూరం, కస్తూరి సువాసనలు అతనిలోని కళాపిపాసను ఎక్కువచేశాయి. దాంపత్యంలోని అనురాగం వెల్లివిరిసే గొంతుతో ఆమెను పిలిచాడు పనిలేకపోయినా, అనుకోకుండా. నిజానికి అతని మనస్సు చాలా అశాంతిగా ఉంది. కాని ఆమెసన్నిధిలో తన అశాంతిని మరచిపోగలడు. తిరక్కానికి లొంగని కారణం; ఆమె శక్తిమూర్తి. ఆవేళ మూర్తి ఒకదుర్వార్త చేరేశాడు తనకి. తన ఉద్యోగానికి తక్షక రామారావుగారు తెచ్చిపెట్టబోయే ప్రమాదాన్ని గురించి మూర్తి తనకు చెబుతున్నప్పుడు మొదట భయంగాని ఆశ్చర్యంగాని కలగలేదు. కాని పాముబిషం అతన్ని క్రమంగా బాధపెట్టినట్లు ఈ తక్షకుడు తనమీద వెళ్ళగక్కిన విషం అతన్ని క్రమంగా బాధించింది.

'తక్షక' రామారావుగారు కృష్ణ పని చేస్తున్న కంపెనీ మేనేజరు. కృష్ణ పనిలో చేరడానికి మునుపు; ఆయన తన బావమరిదికి (రాజస్యాలకుడు) ఆ ఉద్యోగాన్ని ఇప్పించాలని చాలా ప్రయత్నించేశాడు. కాని కృష్ణ తనకు న్యాయంగా రావలసిన హక్కులకోసం కోర్టుదాకా వెళ్ళి ఈ ఉద్యోగాన్ని నిలబెట్టుకున్నాడు. సమయంచూసి కృష్ణ ఉద్యోగం ఊడగొట్టాలని మేనేజరు కాచుకు కూర్చున్నట్టు కృష్ణకి తెలుసు. అందుకే 'తక్షకు'డంటూంటాడు ఆయన్ని. మొన్న తమకంపెనీ స్టాటిస్టిక్స్ పరిచూస్తూండడంలో నిష్కారణంగా తనమీద తప్పు ఆరోపించి మేనేజరు గట్టిగా చీవాట్లు పెట్టి ఆఖరిసారి వార్నింగ్ యిచ్చాడు. ఇవాళ మూర్తి మేనేజరు చేసే ప్రయత్నాలను తనకు చెప్పినప్పుడు మొదట లెక్కచెయ్యలేదు.



బాతుల జంట

బాలలసంఘం సభ్యుడు పాటిబండ్ల లక్ష్మీనరసింహమూర్తి వేసిన చిత్రం. వయస్సు 14 ఏళ్లు. వినుకొండ బోర్డు హైస్కూలులో స్కూల్‌ఫైనల్ చదువుతున్నాడు.

కాని నిరుద్యోగిగా తన భవిష్యత్తుమాత్రం ఊహించలేకపోతున్నాడు. ఈ సంఘటన శారదకు చెప్పి ఆమెలో అసంతృప్తినీ, విచారాన్నీ కలిగించ దలుచుకోలేదు.

* * *

శారదతో హోరాహోరీ వాదించి, ఉపవాసం ఉంచకుండా భోజనంచేశాడు కృష్ణ. ఇంటిపనులన్నీ చూసుకుని శారద వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. శారదకు వైకుంఠపాళి అభిమాన పాత్రమైన ఏకైక క్రీడావిశేషం. ఎందుకంటే, ఆమెకు ఆ ఆట తప్ప వేరేఆటరాదు. (మిగతావి ఆడవాళ్లు ఆడుకునే ఆటలే అన్నీ!) భర్తతో ఆడే అవకాశమున్న ఆట ఇదొక్కటే. కృష్ణ ఆమెకు పేకాటలోని రకాలన్నీ ఓపికగా బోధించాడు. చదరంగం నేర్పాడు. అతను నేర్పుతూంటే విన్న పక్కింటి శ్యామలగారు అతి చాకచక్యంతో భర్తతో ఆడుతోంది. కాని శారదకుమాత్రం ఈ విద్యలేమీ అబ్బలేదు. గురుముఖంగా ఈ విద్యలన్నీ అభ్యసించినా శారద ఉత్సాహం చూపకపోడం, ఏకలవ్య శిష్యత్వం చేసి (గోడవతలనుంచి విని) ఈ విద్యలన్నీ కరతలామలకం చేసుకున్న శ్యామలగారి చాకచక్యం పోల్చుకుని 'చాల అన్యాయం' అనుకున్నాడు కృష్ణ.

తప్పనిసరిగా కూర్చున్నా, అతనిలో పట్టుదలా, పౌరుషం అతన్ని ప్రోత్సహించాయి. వైకుంఠపాళి తనకు అచ్చివచ్చిన ఆట కాదని అతను ఓడిపోయినప్పుడల్లా (అసలు గెలిచిన దెప్పుడు?) ఆమెతో వాదిస్తాడు. ఇలాటి సందర్భాలలో, అతనికి మూఢ నమ్మకాలమీద నమ్మకం లేదని తీసిపారేసినవి అన్‌కాంషస్‌గా వ్యక్తమాతూంటాయి. వైకుంఠపాళీ మీద అతనికి ఇంత ద్వేషం (సకారణమే అనుకోండి) ఒకపక్క మనస్సులో ఉవ్వెత్తుగా పొంగుతున్నా, మరోవైపు ఆ ఆటలో అబల చేతిలో తను ఎప్పుడూ ఓడిపోతూండడం అతన్ని క్రుంగదీస్తూంటుంది. ఆ ఆటమీద ఇంతటి ద్వేషం ప్రబలిపోవడానికి కారణమేమిటంటే, అతనెప్పుడు ఆటకు కూర్చున్నా (అదేమి పాపమో!) పెద్దపాము వాతపడడం, మళ్ళీ మొదటికే రావడం విషమచక్ర పరిభ్రమణం లాగ సంభవిస్తూనే ఉంటుంది. నిజ జీవితంలో కూడా ఈ పోలిక కనిపించి, కసికొద్దీ మేనేజరు గారికి 'తక్షక' రామారావుగారని నామకరణం చేశాడు. ఆట మొదటికే చేరుకున్న అతని బిక్కమొహాన్ని, విసుగునీ, కోపాన్నీ సహనాన్నీ చూసి శారద పమిట చెంగు నోటికి అడ్డుపెట్టుకొన్నా నవ్వు ఆగదు. తను నిచ్చెన ఎక్కి, గండాలన్ని గడిచి, 'పరమపద సోపానా'న్ని ఎక్కి, ఎవరెస్ట్ శిఖరాగ్రాన్ని ఎక్కి విజయగర్వంతో ఫొటోకి పోజుపెట్టిన టెన్సింగ్ లాగ—విజయాన్ని సాధించడం కృష్ణచూసి పైకి కాకపోయినా లోలోపల అసూయ పడుతూంటాడు. ఇదీ మరి నవ్వు కలిగిస్తుంది. యుద్ధంలో ఓడిపోయిన నెపోలియన్‌లాగ, షేక్స్‌పియర్ మొహం వేళ్ళాడేసుకుని దారిలో గిరీశానికి తగిలే వెంకటేశంలాగ, అతను పరాజయ

★ వైకుంఠపాళి ★

పరాధీన భావాలతో. ఉక్రోషంతో, ఈర్ష్యతో. పట్టుదలతో—చివరికి సహనంతో బాధ పడుతూండడం చూసి శారద చాలా జాలిపడుతుంది. అతనికి సానుభూతి చూపడం కోసం, కావలసి ఆట పోగొట్టుకోడానికి, గవ్వలు గిలకరించి బోర్లా వేసి అప్పుడప్పుడు నిచ్చెనలు దిగిపోయి ఆటలో కూడా అపజయాన్ని స్వీకరిస్తూంటుంది అతనితో పాటు. ఈ త్యాగానికి అతనిలో కొంత సంతృప్తి కనిపిస్తుంది.

శారద వైకుంఠపాళి తియ్యగానే కృష్ణ ఉలిక్కిపడ్డాడు. ఉన్నట్టుండి, పీడకలతో మెలుకువ వచ్చినవాడిలాగ "తక్షకుడు' అని భయంతో కేక వేశాడు. కృష్ణ కర్తవ్య పరాఙ్ముఖుడు మాత్రం కాడు, ఎలాగయినా, యీసారి అయినా, ఆమెను ఓడించాలనే పట్టుదలతో అతను 'కృతనిశ్చయుడై' కూర్చున్నాడు (బహుశా తక్షక గమారవుగారి మీద కోపం పరోక్షంగా యీ పట్టుదలకి కారణమై వుంటుంది.) కాని—యీ ఉత్సాహం కాస్తా శారద పలికిన నాందీ ప్రవచనంతో చల్లారిపోయింది.

"ఈసారి అయినా మీ మేనేజరుగారి బారిని పడకండి." అంది తల వంచుకుని. ఆమె తలవంచుకుని మాటాడినా, నవ్వుతోందని ఆమె గొంతు సాక్ష్యం ఇస్తోంది.

మేనేజరుని తక్షకుడితో (ఆటలోని పెద్ద పాముతో) అభేదాన్వయం చేసి రూపకాలంకారం మాట్లాడడం కృష్ణకి సుతరామూ నచ్చలేదు. తనకి మేనేజరు మీద ఉన్న కోపం ఆమె రిమార్కుతో జ్ఞాపకము వచ్చింది.

"ఈ దెబ్బతో తక్షకుడి అంతు తేలిపోవాలి" అని మేనేజరును ప్రత్యేకంగా మనస్సులో అనుకుంటూ గవ్వలు విసిరి వేశాడు పౌరుషంతో.

చిన్నపిల్లాడి ప్రతిజ్ఞలాటి ఈ ప్రతిజ్ఞకి శారద నవ్వుకుంది.

శారద గవ్వలు విసిరే నేర్పూ, ఆమె చేతి వేళ్లు ఎలాగ పెట్టి గవ్వల్ని విసురుతోందో ఆ కిటుకూ, ఆమె ఆటలోని కీలకం ఆమె చూడకుండా ఉన్నప్పుడు ఓరగా చూస్తూ అలాగే ఆమె నేర్పుని అనుకరించాలని ప్రయత్నించాడు. కాని ఎంత శ్రమపడ్డా అతనికి తక్షకుడి గండం గడవడం మాత్రం దుర్లభమైంది. అతను మళ్లీ మళ్ళీ ఆట మొదటికి రావడం ఎక్కువయే కొద్దీ శారద నవ్వుకూడా ఎక్కువౌతోంది. ఆమె వైపు కోపంగా చూసే తన ఉడుకుబోతుతనాన్ని ఆమె అవలీలగా పసిగట్టేస్తుందని అతనికి తెలుసు. అందుకే, ఈ ఆట అంటే తనకేమీ లక్ష్యం లేనట్లు ఆడుతున్నాడు. ఆమె ఎప్పుడో 'పరమపద సోపానాన్ని' చేరుకుంది. తన పనేమీ లేనట్టు ఆమె తన చోటులోనే పడుకుని అతని ఆటని చూస్తోంది. 'రన్నింగ్ రేస్'లో తనకింక బహుమతి రాదని స్పష్టంగా తెలిసిపోయినా ఆఖరువరకూ ఓర్పుతో పందెంలో పరుగెత్తే చిట్టచివరి అభాగ్యుడ్ని ప్రేక్షకులు సానుభూతిగా చూసినట్లు చూస్తోందని ఆమె చూపుకి వ్యాఖ్యానం చేసుకున్నాక అతనికి చాలా నిరుత్సాహం కలిగింది. ఇంక తనకీ ఆట ఎలాగూ అబ్బదనీ ఆ ఆటలోని విజయం శాశ్వతంగా శారదదేనని హక్కు పత్రం వ్రాసి ఇచ్చినవాడిలాగ, గవ్వలు విసిరేసి, నిశ్చింతగా గోడకు జార్లబడ్డాడు. ఆట 'కళ'లో తను కృతకృత్యుడు కాలేకపోయినందుకు తన అసమర్థతమీద తనకు అసహ్యం వేసింది. నిజమైన తక్షకుడి (మేనేజరు) దగ్గరకూడా పరాజయమే వ్రాసిపెట్టి ఉందేమోననే విచారం అతన్ని బాధించింది. ఆ బాధతో మనస్సు చికాకై మిగతా రాత్రంతా ఎలాగో వెళ్లబుచ్చాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ కృష్ణకి మేనేజరు మీద అనుమానం, ఈ అనుమానంతో అశాంతీ ఎక్కువౌతున్నాయి. మేనేజరు తక్షకుడు ఇంతవరకూ పైకి ఏమీ తేలక పోవడమే, ఈ అనుమానాన్ని మరీ దృఢపరచింది కృష్ణలో. తను ఇలాగ బాధపడుతున్నట్లు శారదకు తెలియనివ్వకుండా, జాగ్రత్తగా నటించడంలోనే అతనికి కష్టమనిపిస్తోంది.

ఆరోజు సాయంత్రం: ఆఫీసునుంచి సరాసరి ఇంటికి వచ్చిన కృష్ణని చూసి శారద ఆశ్చర్యపడింది. కాళ్లు కడుక్కుని, కాఫీ త్రాగుతున్న ధోరణి చూసి అతనిలో ఏదో ఒక మార్పుని గ్రహించింది. ఆమె 'సస్పెన్స్'తో తికమకపడి ఆఖరికి పరాజయాన్ని అంగీకరించేదాకా తను అసలు సంగతి ఆమెకు తెలియనివ్వకూడదని మరోసారి జ్ఞాపకం తెచ్చుకున్నాడు. కాని ఆమె అతను ఊహించినంత సులభంగా లొంగిపోలేదు. అతని ఘనకార్యం మీద తనకు ఏ మాత్రం శ్రద్ధలేనట్టే ఉండడం చూసి తప్పనిసరిగా రాజీపడ్డాడు తనంతట తను.

"శారూ. ఒక శుభవార్త చెబుతాను. కాని ఒక్క షరతు. మనస్సులోని దాన్ని గ్రహించి నువ్వే చెప్పుకోవాలి" అన్నాడు.

ఇలాటి పరీక్ష అంటే ఆమెకు ఇష్టం ఉండదు. గబగబ జాబితా ఏకరువు పెట్టింది.

"మీ మేనేజరుగారికి సుపుత్రోదయం అయింది" అని నవ్వింది.

అతను కోపంగా "మేనేజరుకి సంతానం కలిగితే మాకేం శుభం?" అన్నాడు.

కొంటెగా చూస్తూ, "ఒక రోజు సెలవు ఇచ్చారు" అంది. చివరికి తప్పని సరిగా తనే చెప్పాలిసి వచ్చింది.


"రోజూ ఆఫీసుకి వెడుతున్నప్పుడూ—ప్రతిసారీ ప్రియురాలి చేతిలో వైకుంఠపాళిలో ఓడిపోయినప్పుడూ—ఒకానొక బొమ్మ తక్షకుణ్ణే గెలవలేని నేను వాస్తవిక జీవితంలోని మేనేజరు 'తక్షకుడి' గండం ఎలా గడవగలననే ఒక దురభిప్రాయం—సహేతుకమైనది కాదనుకో—మనస్సులో నిలిచిపోయింది. కాని ఒక శుభ సమయాన ఒకానొక లంచం కేసులో మా మేనేజరు 'తక్షకుడు' డిస్మిస్ అయి, శ్రీకృష్ణజన్మస్థానం అలంకరించబోతున్నాడనీ, ఇకమీదట 'మేం' ఆ సింహాసనాన్ని అలంకరించబోతున్నామనీ మహారాణీ శారదాదేవిగారు చిత్తగించవలెను" అన్నాడు సాభినయంగా.

అతను ఇచ్చిన చిన్న లెక్చరుకి ఆమె నవ్వకుండా ఉండలేకపోయింది.

"పోనీ లెండి మీ కోసం ఇక మీదట నుంచీ ఈ ఆట మానేస్తాను" అంది. అతను ఇంత కాలం తన బలవంతంవల్ల వైకుంఠపాళిలో పొందిన పరాజయానుభవాన్ని గురించి ఆలోచిస్తూ—పశ్చాత్తాపంగా.

డాబా మీద—పాల సముద్రంలాగా, మల్లెపూవుల పాన్పు పరిచినట్లూ—హిమానీనదం ప్రవహిస్తున్నటూ తళతళ లాడిపోతూన్న వెన్నెలలోకి చూస్తూ అతను ఆమెను చూసి, "శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులన్" అనే పద్యాన్ని మంద్రస్వరంతో రాగయుక్తంగా చదివాడు.

తర్కాలకూ, మీమాంసలకూ, వ్యాఖ్యానాలకు లొంగని లోతులలోనుంచి వెలువడే అనురాగంతో ఆమె అతన్ని చూసి—దరహాసం చేసింది. అతను ఆమెను సంతృప్తిగా దగ్గరకు తీసుకున్నాడు. ★



ఆదిపర్వము షష్ఠాశ్వాసము

చ. కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుఁడు రాజధర్మబం
ధురచరితుండు నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదువంశమును దల్లిని దండ్రిని జెప్పి చెప్పినన్
దొర యగు దేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్.

వ. అనిన విని కర్ణుండు దనకులంబును దల్లిదండ్రులను జెప్ప సిగ్గుపడి తల వాంచియున్నం జూచి దుర్యోధనుండు గృపున కిట్లనియె.

క. కులము గలవాఁడు శౌర్యము, గలవాఁడును నధికసేన గలవాఁడును భూ
తలమున రాజనునామము, వెలసిల్లఁగఁ దాల్చు మూఁడు విధములఁ పేర్మిన్.

తే. రాజవరుఁ డైనపార్థుతో రాజు గాని, యాతఁ డనిసేయఁగాఁ దగఁ డేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ, రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి.

వ. అని యప్పుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి వారియనుమతంబున మహామహీసుర సహస్రంబునకు గోసహస్రాయుతంబు దానంబు సేసి యంగరాజ్యంబున కర్ణుండ యోగ్యుం డని బ్రాహ్మణవచనంబు వడసి కర్ణుం గాంచనపీఠంబున నునిచి యంగరాజ్యమున కభిషిక్తుం జేసినఁ గర్ణుండును మణిమకుటకేయూరాదిభూషణ భూషితుండై సకలరాజచిహ్నంబుల నొప్పి పరమహర్షంబుతోడం గురుపతి కిట్లనియె.

క. బృహదబ్ధిమేఖలాఖిల,మహీతలక్షత్త్రవరసమక్షమున మహా
మహిమాన్వితుఁగా నన్నును, మహీశుఁగాఁ జేసి తతిసమర్థత వెలయన్.

క. దీనికి సదృశముగా మఱి, యే నేమి యొనర్తు నీకు నిష్టం బనినన్
మానుగ నాతోఁ జెలిమి మహీనుతముగఁ జేయు మిదియ యిష్టము నాకున్.

వ. అనిన విని దుర్యోధనునకు సంతోషంబుగాఁ గర్ణుం డతనితోడి యిష్టసఖత్వంబున కొడంబడియె నంతఁ గొడుకు రాజ్యాభిషేకోత్సవంబు సూచి హర్షపరవశుం డయి సూతుండు రథంబు డిగ్గి కర్ణునొద్దకుం జనుదెంచినఁ గర్ణుండును బితృగౌరవంబున సంభ్రమించి వినయవినమితోత్తమాంగుం డయిన.

తే. కడఁగి సూతుండు పుత్త్రుఁ గౌఁగిలించి,కొని తదీయమూర్ధాఘ్రాణ మొనరఁ జేసి
యంగరాజ్యాభిషేకార్ద్రమైన శిరముఁ, దడిపె వెండియు హర్షాశ్రుతతులఁ జేసి.

వ. దానింజూచి భీముండు గర్ణుని సూతకులసంభవుఁగా నెఱింగి నగుచు నిట్లనియె.

క. నీదుకులమునకుఁ దగఁగఁ బ్రతోదము గొని రథము గడపఁ దొడఁగుము నృపధ
ర్మోదయుఁ డగునర్జునుతోఁ, గా దనక రణంబు సేయఁ గా నీ కగునే.

వ. మఱి యదియునుం గాక.

తే. ఉత్తమక్షత్త్రియప్రవరోపభోగ్య, మైన యంగరాజ్యంబు నీ కర్హ మగునె
మంత్రపూతమై గురుయజమానభక్ష్య మగు పురోడాశ మది కుక్క కర్హ మగునె.

వ. అనినం గర్ణుండు వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణనిశ్శ్వాసవ్యాకులితవదనుం డయి యాకాశంబువలన నున్నయాదిత్యుం జూచుచు మిన్నకుండె నంత నంతర్జ్వలితుం డయిన యక్కర్ణుం జూచి భ్రాతృపద్మవనమధ్యంబుననుండి దుర్యోధనమదాంధగంధసింధురంబు వెలువడి వచ్చి కడు నలిగి భీమున కిట్లనియె.

క. అనిలజ నీ కిట్లని పల్కను దలఁపను నగునె లేకి కడుపునఁ బులి పు
ట్టునె యిట్టిదివ్యతేజం,బున వాఁ డధమాన్వయమునఁ బుట్టనె చెపుమా.

సీ. శూరులజన్మంబు సురలజన్మంబును, నేఱులజన్మంబు నెఱుఁగ నగునె
మొగిని దధీచియెమ్మునఁ బుట్ట దయ్యెనే, దానవాయుధ మైన వజ్ర మదియు
గాంగేయుఁ డన మఱి కార్తికేయుం డన, నాగ్నేయుఁ డన రౌద్రుఁ డనఁగ శరవ
ణోద్భవుం డన గుహుం డుద్భవిల్లఁడె శర, స్తంబజన్ముఁడు గాఁడె ధర్మవిదుఁడు
తే. కృపుఁడుఁ గుటసంభవుఁడు గాఁడె కీర్తిపరుఁడు, వరుఁడు ద్రోణుండు విప్రుల వలనఁ బుట్టి
రైరె సత్క్షత్త్రియ ప్రభు లవనిఁ గావ, గడఁగి మీజన్మములు నిట్లు కావె వినఁగ,

వ. వానితోడిదేమి దివ్యలక్షణలక్షితుండును సహజకవచకుండలమండితుండును బ్రకృతిపురుషుండు గాఁడు దనబాహుబలంబున నీయంగరాజ్యంబునకకాదు సకల మహీరాజ్యంబునకు నర్హుండగు ననుచున్న యంత నాదిత్యుం డస్తగతుం డైనఁ బ్రసన్న సందర్శనరంగంబు వెలువడి దుర్యోధనుండు గర్ణుం దోడ్కొని కరదీపికా సహస్రంబుతో నిజమందిరంబున కరిగెఁ బాండవులును భీష్మద్రోణవిదురకృపాచార్యులతో నిజనివాసంబుల కరిగిరి.

ఆ. కుంతి యంత సహజకుండలకవచాభి, రాముఁ గర్ణుఁ జూచి రవిసమానుఁ
బ్రత్యభిజ్ఞ నెఱిఁగి ప్రథమపుత్త్రస్నేహ, మెఱుకపడక యుండ నింతియుండె.

క. వినుతధనుర్విద్యావిదు, ఘనుఁ గర్ణు సహాయుఁ బడసి కౌరవవిభుఁ డ
ర్జునువలనిభయము సెడి త్రొమ్మునఁ జే యిడి నిద్రవోయె ముదితాత్ముం డై,

వ. అంతఁ బ్రభాతసమయంబున నాచార్యుండు శిష్యుల నెల్ల రావించి నాకు గురుదక్షిణ యిండనిన నందఱు మ్రొక్కి యెదుర నిలిచి మీకెద్ది యిష్టంబు సెప్పుఁ డనిన నవి, యవివేకకారణదారుణైశ్వర్యావలిప్తుం డైన ద్రుపదు నోడించి పట్టితెం డిదియ నాకు గురుదక్షిణ యని పంచిన.

కౌరవపాండవులు గురుదక్షిణార్థంబు ద్రుపదుం బట్టఁ జనుట

క. వల్లె యని రాజనందను, లెల్లను సమకట్టి రథము లెక్కి దిశల్ భే
దిల్లఁగ గర్జిల్లి నిశా,తోల్లసితకృపాణకార్ముకోద్యతకరులై.

ఉత్సాహము. ఏల దీని నెసయఁ జేయ నిక్షణంబ యేఁగి పాం
చాలుఁ బట్టి తెత్త మధిక శౌర్యలీల మెఱయఁగా
బోలు ననుచుఁ బెరిఁగి రాజపుత్త్రు లరిగి యార్చి పాం
చాలుపురము ముట్టికొని రసంఖ్యబలసమేతులై.

వ. పాండవులును రథంబు లెక్కి ద్రోణుం బరివేష్టించి పిఱుంద నరిగి రంత నర్జునుం డాచార్యున కిట్లనియె.

క. విడిగొని కౌరవు లొండొరుఁ, గడవఁగ మును చనిరి వారి గర్వము సూడం
గడిమిని ద్రుపదాధిపుతోఁ, బొడువఁగఁ దమ కలవి యగునె భుజవీర్యమునన్.

క. అతగులచే ద్రుపదుఁ డనఘ, హతుఁ డై పట్టువడ నంత హీనుఁడె శౌర్యో
న్నతుఁ డధికధనుర్విద్యా,న్వితుఁడు భవత్సఖుఁ డనంగ వినరొకా కానిన్.

వ. అనుచుఁ బాంచాలపురం బాసన్నంబుగాఁ జనుదెంచునంతకు ముందఱ చని దుర్యోధన యుయుత్సు దుశ్శాసన వికర్ణ జలసంధాదు లైన ధార్తరాష్ట్రు లనేక నృపకుమారసహితులై పాంచాలపురం బవరోధించినఁ బాంచాలపతి యలిగి యపారచతురంగబలసమేతుండై కౌరవులం దాఁకె.

క. శరనికరసహస్రంబులఁ, బఱువడి నందఱను గప్పెఁ బాంచాలుఁ డారా
ధర మురుధారాజలముల, సరసిజములఁ గప్పునట్లు సంరంభమునన్.

క. కలయ నిసుమువల దండం,బులు గొని కాంపిల్యనగరమున జను లెల్లన్
నలిరేఁగి యార్చి కౌరవబలసుభటులఁ బొడిచి రాజ బడలువడంగన్.

క. ధృతరాష్ట్రకుమారులు సవ,హితులై పాంచాలుమీఁద నేసిరి సాంద్రా
తతబాణప్రకరతిరో,హితమై రవికిరణజాల మేర్పడకుండన్.

క. వారలశరములు నడుమన, వారించుచు నధికలాఘవంబున వారిన్
ఘోరశరవిద్ధమర్ములఁ, గారణమున సోమకుండు ఘనుఁ డై యేసెన్.

★

సీతమ్మ సంసారం

(నాటిక)

బి. జి. ప్రసూనాంబ

పాత్రలు:

ప్రకాశరావు :	స్కూలుమాస్టరు (30 ఏండ్లు)
శెట్టి :	గుడ్డలకొట్టువాడు (45 ఏండ్లు)
మురళి :	ప్రకాశరావు కొడుకు (5 ఏండ్లు)
అప్పయ్య :	ప్రకాశరావు మేనమామ (50 ఏండ్లు)
రంగమ్మ :	ప్రకాశరావుగారి తల్లి (55 ఏండ్లు)
సీతమ్మ :	ప్రకాశరావుగారి భార్య
జానకి :	ప్రకాశరావుగారి చెల్లెలు (16 ఏండ్లు)

స్థానం : ప్రకాశరావు ఇల్లు
సమయం : సాయంత్రం 7 గంటలు

[రంగమ్మ నడివయస్సులో నున్న దిట్టమయిన మనిషి. ఆమె ముఖాన్ని చూస్తే మాటకారిగా కన్పిస్తుంది. గదిలో ఓమూల మంచం వేసుకొని రంగమ్మ కూర్చొనుంటుంది. రామాయణం ఆమె చేతుల్లో ఉంటుంది. చత్వారపు జోడు చేతిలో పట్టుకొని అటూ ఇటూ కోపంగా చూస్తుంటుంది. ఇల్లు శుభ్రంగా సర్ది ఉంటుంది. వీధివైపు కిటికీ వాకిలి, వంటింట్లోకి పోవడానికి మరో వాకిలి; ఇల్లు మొత్తానికి రెండే గదులు. కొంత సేపయిన తర్వాత రంగమ్మగారు బొడ్లోనించి మూశేడు కాయ తీసి అంతాటుప్రకారం నస్యం చేతులో వేసుకోబోతుంది. నస్యం అయిపోయి వందున మండిపడుతూ.]

రంగమ్మ: అమ్మాయ్, ఏమేవ్! సీతమ్మా! ఇంకా ప్రకాశం రాలేదులే? ఒక్కరూ పలుకరేమే? పిలిచీ పిలిచీ గొంతెండుతున్నది గదే. చెవుల్లో చెటు మొలిచాయటే? ఈ కొంప పాడుబడ, కానీ నస్యానికి గతిలేకపోయె! నిన్నటినుంచీ ముక్కులు బిగేసి చచ్చిన చావు, బ్రతికిన బ్రతుకూ గాకుండా వుంది మాయదారి కొంపలో దిన గండంనూరేళ్ళాయుస్సై పోతే ఎందాకని నోరు నొక్కుని చచ్చేది? ఎంత పిదపకాలం వచ్చిందే...ఎంతకరువు కాలమే!

పిల్లవాడు మురళినిచంక బెట్టుకొని సీతమ్మ ఎంతో విచారంతో లోపలకొస్తుంది. పిల్లాణ్ణి చాప వేసి పడుకోబెట్టి విచారంతో అక్కడే కూర్చుంటుంది. మురళీ తీవ్రజ్వరంతో రొప్పుతుంటాడు; అప్పుడప్పుడు కలవరిస్తుంటాడు రంగమ్మకోపం మరీ ఎక్కువవుతుంది.)

రంగమ్మ: ఎక్కడికిపోయావే సీతమ్మా? ఈమైన పిల్లాణ్ణి చంకబెట్టుకొని పెత్తివాలు చేస్తావా యేం? ఇల్లువాకిలంటే శ్రద్ధ లేకపోతే ఎట్లానే? తెలివిమాలిన అల్లుడు చెబితే వినడు కొడితే ఏడుస్తాడు! నేనేం చెప్పినా నీకువినపడదాయె! నీకైనా తెలుస్తుందా అంటే అది అసలే లేదు. అయినా నేనెన్ని వాగితేమాత్రమేమిలే! నెమ్మదిగా నోట్లో మాట రెండోవాడికి వినబడకుండా నంగనాచిలాగా చేసేదిచేసి ఊరుకుంటావు! నేను గయ్యాళిగంపలా నా తిన నోరు పెట్టుకొని అరుస్తా! వలగురూ నానోట్లో ఉమ్మేసిపోతారు. లోగుట్టు పరమాత్మరి కెరుకని ఎవరికి తెలుస్తుంది?

సీతమ్మ: ఊర్కే ఎన్నడైన బయటికి అడుగుపెట్టే ఎరుగుదునుటమ్మా? ప్రాణం మీదికొస్తే ఇవ్వాళ ఎలాగో తెముల్చుకొని వెళ్ళి డాక్టరును చూచి వచ్చాను. మురళీ గాడు ప్రొద్దుటి నుంచీ మూసిన కన్ను తెరవలేదు. ఒంటిమీద చెయ్యేస్తే కాలిపోతోంది! మరి ఇదేం జ్వరమో, నాకంతా అయోమయంగా ఉంది.

రంగమ్మ: ఏమి ఇచ్చకాలుపోతావే ఇచ్చకాలైనా!! వలుగురు బిడ్డలతల్లివి. పాలుదాగే పిల్లకి ఏజలుబో, పడిశమో పడితే డాక్టరింటికి పోవాలా? ఇంత వసపాలు, వాంపాలో పోస్తారుగాని చీటికి మాటికి డాక్టరు దగ్గరికి పరుగెత్తుతారా? ఇంట్లో వున్న పెద్ద ఘటాన్ని నా మాటంటే నీ కుణం పసిదాయె! నాకేమైన మాటమాత్రం చెప్పావా, ఇలా ఉన్నదని?

సీతమ్మ: నేను చెప్పాలటమ్మా? వాడా విధంగా ప్రొద్దుటె నుంచీ మూసిన కన్ను తెరవకపోతే...

రంగమ్మ: నాకెందుకు చెప్తావే! నీకంటికి నేను కనబడుతుంటే గదూ! డాకుటర్లు, టానిక్కులు ఇండీవను, అబ్బో నీపని పైలా పచ్చీ సుమీ గుంటే!

సీతమ్మ: నే నేమన్నానమ్మా, అలామండి పడతారు?

రంగమ్మ: ఎంత నాజూకుబోతున్నావే! బాబోరా! నంగనాచిలా మెలగడం మేము నేర్చుకోలేదే. ఏంజేస్తాం, పాతకాలపువాళ్ళం. మామాటలు మీకు కేకల్లా ఉంటాయి.

సీతమ్మ: ఎందుకమ్మా. ఆ సమానం మనకూ! ఇది ఒకరోజుతో తీరేదిగాదు. నా బోటి గయ్యాళిగంప కోడలుగా వచ్చాక ఎంతటి కష్టమైనా పడవలసిందే మరి!

రంగమ్మ: ఓహుబ్బా! ఎన్ని నేర్చావే-ఎప్పటినుంచి ఇది? ఆ వేణూగాడి పెళ్ళాం దగర బాగా తరిఫీదయినట్టున్నావు? ఇదొక టొచ్చింది దీపాలార్పేముండ!

సీతమ్మ: అనవసరంగా దాన్నెందుకండీ ఆడిపోసుకుంటారు? పాపం ఆ అమ్మాయి పల్లెత్తి మాట్లాడినా ఎరుగదే!

రంగమ్మ: నాకూ తెలుసు. నీ ఇద్ద



★ సీతమ్మ సంసారం ★

కాలన్నీ. నా దగ్గిరా నీ దాపరికం! వాణి చవటనుచేసి ఇలా ఆడిస్తున్నావు! మా కాలంలో పేరేమో మొగుడు అంటే వణికి చచ్చేవాళ్ళం! ఈ కాలంలో ఏముంది? పెండ్లిఅయిన మరునాటినుంచే మొగుడిభుజాల మీద స్వారీనాయె!

సీతమ్మ: ఎవరో అలాచేస్తే మనకెందుకమ్మా!

రంగమ్మ: ఎవరి దాకానో పోవాలా? మనింటి సొంపేంది! గురిగింజ తనవలు పెరగదట! తెచ్చింది తెచ్చినట్టు జేబులోంచి తీసుకుంటుంటేవి. జేబులు ఖాళీ నేసిపోరా చవటాలని రాణివై చూస్తుంటివి! లేకపోతే, కాణీ నస్యానికి నిన్నటినుంచి మొత్తుకోవాలా?

సీతమ్మ: నా చేతికి డబ్బివ్వద్దని మొత్తుకుంటాను. వారు వింటేగదూ! ఇద్దరిమధ్యా అస్తమానం నలిగిచస్తున్నా.

రంగమ్మ: కుడిచి కూర్చుని చస్తావనడమేమిటే, నీ కడుపుకాక! పండంటి మొగుడు కడిపెడు బిడ్డలు, కడుపులో పెట్టుకునే అత్తగారూ, చేతికడ్డువచ్చే ఆడబిడ్డా ఇల్లాంటి నిండిన ఇంట్లోకూర్చొని తగుదునమ్మాఅంటూ ఎంత మాటన్నావే.!

[పిల్లవాడు కంతరిసాడు; సీతమ్మ ఓదారుస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటుంది. ఇంతలో జానకి వస్తుంది.]

జానకి: అమ్మా, అమ్మా! వదినెమాడవే! ఇందాక గాజు లేయించమంటే ముఖం మాడ్చుకొని ముసముస లాడుతూ వెళ్ళిపోయింది! దీపావళికి అందరూ చక్కగా కొత్తగుడ్డలు కుట్టించుకుంటుంటే, నాకు గాజులకూడ గతి లేదు! ఏంమ్మా, అడగవే వదినను. ఇందాక గాజు లెందుకు వేయించలేదో?

రంగమ్మ: అయ్యో అమ్మా! మన మెతర్ని అనుభవమే! ఏదో మీవదిన నరమ్మా అని పిడికెడన్నం పెడితే నోరు నొక్కుకొని, ఓ మూల, ఎప్పుడు చచ్చారంటే, బచ్చి ఆరునెల యిందన్నట్టు పడుండాలి గాని; నువ్వు గాజులదాకా పోతున్నావు! రెండు రోజులనుంచీ నస్యంలేక ప్రాణాలు పోతూ ఉంటే, దిక్కూ దివాణంలేదు. నీ బతుక్కి నీవుకూడా నలుగురితో పాటనుకున్నావు గాబోలు, పిచ్చిబొందా!

(జానకి సీతమ్మను తీవ్రంగా చూచి వంటింట్లోకెళ్తుంది)

సీతమ్మ: ఇంట్లో మీకు తెలీనిసంగతేముందమ్మా? పదోతారీకునుంచే చేతిలో కానీ లేక నానా ఇబ్బంది పడడం మీకు తెలీదా? ఇప్పుడు ఇరవై ఏదో తేదీఅయె. తెల్లారితే యెలాగా అని ఒకటే బెంగలో బుర్ర వేడెక్కిపోతుంటే, అన్నీ తెలిసిన మీరే ఇలా మాట్లాడితే ఇక నేనేం చెయ్యడం? ఆ ఇచ్చిన నూరు రూపాయలో పరేదాన్నే గాని, చాలకపోతే నే నేం చేయగలను?

రంగమ్మ: ఎంతవంగనాచివే! నీ వేషాలు నాకు తెలీకనుకున్నావా? ఇంతకూ ఎందుకులే; వాడు నీచేతిలో కీలుబొమ్మ! ఆడమంటే ఆడుతాడు! పాడమంటే పాడుతాడు! మాదొక లెక్కా!

సీతమ్మ: అన్నీ తెలిసి కూడా ఎందుకమ్మా అలా అంటారు? నాదగ్గిర డబ్బుంటే! పిల్లాడికి మందుకొనకుండా ఉట్టి చేతులు ఆడించుకుంటూ వస్తానా! నిన్న డబ్బు నామురళీ ప్రాణం కంటేనా!...మూనాళ్ళ మూనాలు చంపుకొని అప్పు అడిగాను! ఎవ్వరూ కానీ పుట్టనివ్వలేదు! అన్నీ తెలిసిన పెద్దవారే అస్తమానం ఇలా సాధిస్తుంటే, ఈ మొండి బ్రతుక్కంటే ఏనుయ్యో గొయ్యో చూసుకుంటే...(కన్నీళ్లు తుడుచుకుంటుంది.)

రంగమ్మ: శివ శివ! అంతకర్మ నీకెందుకే! నమ్మలేక పొమ్మనరాదూ? చెప్పదలచుకుందేమో తిప్పించి మళ్ళించి చెప్పడం దేనికి? మా ఇంట్లో ఉండొద్దమ్మా అంటే ఒక్కమాటతో తీరిపోయె. నీ మొగుడూ, నీ బిడ్డలూ! నేనూ అదేగా పరాయి వాళ్ళం! రెక్కలాడితే డొక్కలాడక పోతయా అని ఈ ఇంట్లో చేసే బండచాకిరి ఎక్కడ చేసినా పొట్టపూడుతుంది!

సీతమ్మ: ఎవరన్నారమ్మా ఇవన్నీ?

రంగమ్మ: ఎవరన్నారమ్మా! అనాలటే! అంత దీపాలార్పే తెలివి లేకపోయినా ఇంగిత జ్ఞానం లేకపోలేదు. అన్నమాట కాస్త అర్థం చేసుకోగల.

[మురికి గుడ్డలతో ప్రకాశరావు వస్తాడు, విషాదంతో]

ప్రకాశరావు: ఏమిటే రెట్టించుకుంటున్నారు? మీ గలాటా ఆ వీధి చివరకు వినబడుతోంది. ఏ క్షణం చూచిన ఇంట్లో కురుక్షేత్రయుద్ధమే గదా!

రంగమ్మ: ఎందుకు నాయనా? మే మెక్కడికైనాపోతే ఏయుద్ధమూ ఉండదు. మేమే పానకంలోపుడకల్లాతయారయ్యాం

ప్రకాశ: ఎవరెళ్ళమన్నారే నిన్ను!

రంగమ్మ: ఒక రెళ్ళమనాలా? నే నెవళ్ళ? ఈ కాలంలో పెళ్ళాం బెల్లం, అమ్మ విషం నిన్నన్నదోష మేముంది?

ప్రకాశ: అయితే దాన్ని చంపమనటే నువ్వనేది?

రంగమ్మ: శివశివ! ఎంతమాటన్నావురా!

[జానకి రివ్వున వస్తుంది]

జానకి: అన్నయ్యా, తెలుసుగదూ ఎల్లుండి దీపావళి! నాకు కొత్త బట్టలు కుట్టించితీరాలి.

ప్రకాశ: చూస్తాంలే తల్లీ.

జానకి: చూటం గీటం నాకు తెలీదు; నాకు కుట్టించితీరాలి.

రంగమ్మ: పిచ్చిబొందా, మనకు పిడికెడన్నం దొరకితే అదే పదివేలే!

ప్రకాశ: అస్తమానం ఇదేం కాటిపోటలమ్మా! తిన్నగా నన్ను బ్రతుకనివ్వరా ఏం?

రంగమ్మ: కన్నతల్లిని ఎంతమాటన్నా

వురా! ఓరి కటికివాడా!

[పిల్లవాడు తత్తరపాటుతో కలవరిస్తాడు. ప్రకాశరావు ఉలిక్కిపడి పిల్లవాణ్ణి చూస్తాడు. ఒంటిమీద చెయ్యివేసి చూసి ఆశ్చర్యపోతాడు!]

ప్రకాశ: అబ్బ! మాడిపోతోందే! ఎప్పటినుంచి వేడి?

సీతమ్మ: పొద్దుటినించీ ఇలాగే ఉంది!

ప్రకాశ: డాక్టరుకు చూపలే?

సీతమ్మ: చూపాం మరి......మరి...

ప్రకాశ: చెప్పూ! ఏం చెప్పాడాయన?

సీతమ్మ: ఏం చెపాడు! వెంటనే ఇంజెక్షను ఇవ్వాలని చెప్పాడు. ఆలస్యం చేస్తే అపాయమని గూడా...

ప్రకాశ: అపాయమా! జబ్బేమిటసలు?

సీతమ్మ: అదేదో చెప్పాడు. నాకు జ్ఞాపకంలేదు.

ప్రకాశ: పోనీ లతమ్మగార్ని కొంచెం అడిగి రాకూడదూ?

సీతమ్మ: లతమ్మగార్నీ అడిగాను; కాంతమ్మగార్నీ అడిగాను. వాళ్ళ చేతిలో కానీ లేదన్నారు.

రంగమ్మ: ఎందుకవదు? ఉన్న నాలుగు రోజులు మంచినీళ్ళ క్రింద ఖర్చు చేసేది; అయిపోగానే, చేతులు దులుపుకొని నువ్వా నువ్వా అంటూ బతుకులు దిరేది!!

సీతమ్మ: వృధాగా నేనేం ఖర్చు పెట్టానమ్మ?

రంగమ్మ: అంటే అన్న దంటాను గాని, ఆ సొమ్ము బొందకు చదువెందుకు? అదేం రాజ్యం ఏలుతుందా? దాని చదువుకే ఎంత డబ్బైనా ఇట్టే దొరుకుతుందిగాని నా వ్యాధికి కలికానికైనా కానీ కనబడదు!

ప్రకాశ: ఈ కాలంలో అందరికీ పొట్ట పోషించుకు తెలివి ఉండాలమ్మా.

రంగమ్మ: ఇంకేమి? చెయ్యమరి. అనుకోపమెందుకు?

[పల్లెటూరి రైతు వేషంలో అప్పయ్యగారి ప్రవేశం].

రంగమ్మ: అమ్మోయ్, మామయ్యొచ్చాడే...!ఎప్పుడురా నాయనా రావడం?

అప్పయ్య: ఇప్పుడేనక్కయ్యా. పదు గంటల బండికొచ్చా. దాని దుంప తెగ బండి ఒకటిన్నరగంటలు లేటు! ఒక్కసారీ టైముకు ఏడవదీబండి!

రంగమ్మ: పనుండి వచ్చినట్టున్నావు?

అప్పయ్య: పనేముందిలే. చూసిపోదామనికొచ్చా.

రంగమ్మ: కాళ్ళు కడుక్కో నాయనా. తర్వాత మాట్లాడుకోవచ్చు; అమ్మాయ్ కాసిని కాళ్ళకు నీళ్ళివ్వవే...

అప్పయ్య: కాళ్లు కడుక్కొచ్చాక్కే. అమ్మాయి, అబ్బాయి అలా ముఖాలు వేళ్లాడేసుకొన్నా రేం?

రంగమ్మ: ఏముంది? మురళీకి కాస్త జలుబో, పడిశెమో ఖర్మజాలక వచ్చింది. ఆ డాక్టరు ముండాకొడుకు ఇంత రాద్ధాంతం చేసి కోతి పుండు బ్రహ్మ రాక్షసన్నట్లు, ఇండీషన్లు, బొండీషన్లు పొడుస్తానన్నట దానికి కుమ్మరించడానికి వేలులేక అఘోరిస్తున్నారు!

అప్పయ్య: ఇష్ ఇంతేనా! ఈ మాత్రానికే నటరా బెంగ? పిల్లకుంకలకు జ్వరమూ రాక, తినొప్పిగక ఎలా వుంటుంది? వాళ్ళకొస్తూంటే, మనం పడుతుండాలి. అదే మరి పిల్లలంటే; పిచ్చివాడా. రేపీవాళిటికి తగ్గిపోదూ! సరేగాని జానకేది?

రంగమ్మ: జానకేం ముఖం చూపుతుంది నాయనా! వయస్సొచ్చిన పిల్ల, మనకు మానాభిమానాలు లేకపోయినా దానికైనా ఉండొద్దా? మేమంటే అన్నీ విడిచిన వాళ్లం గనుక పెండ్లీడొచ్చిన పిల్ల నింట్లో పెట్టుకొని సిగుశరంలేకుండా నలుగుర్లో తిరుగుమని తిరుగుతున్నాం.

అప్పయ్య: అదేమిటే! ప్రకాశ మేం చేస్తున్నాడు?

ప్రకాశ: నా వల్లయినంత ప్రయత్నిస్తూనే వున్నా మామయ్యా?

రంగమ్మ: ఆహా చూస్తూనే ఉన్నాడు; కన్పించడంలా?

ప్రకాశం: ఏంచెయ్యను మామయ్యా? ఏవరిని తెచ్చినా వద్దుగా. పొలముంటే ఇలులేదని, ఇలుంటే పొలంలేదనీ, అది ఉంటే ఇదిలేదనీ. ఇది ఉంటే అది లేదనీ ఎవర్ని తెచ్చినా ఆక్షేపణే! మరి అన్నీ వున్నవాళ్లు మనలోటి దరిద్రులింటికెందుకొస్తారు చెప్పు?

రంగమ్మ: కూటికి లేనివాడికిచ్చి బిడ్డ గొంతుకోయ్యవద్దనడంగూడ తప్పేటరా?

ప్రకాశ: నాకూ మంచివాళ్లకే ఇద్దామని వుంటుంది. మరి డబ్బుకో వద్దమ్మా? ఊరకే ఎవరొస్తారు? ఇది కట్నాలకాలమాయె!

అప్పయ్య: ఎన్ని అడంకులున్నా చేయవలసినపని చేయవలసిందేగదా! ఇవన్నీ లెక్కచేసామటరా?

ప్రకాశ: ఎక్కడైనా మనవాళ్ళల్లో కాస్త విచారించి చూదూ?

అప్పయ్య: అబ్బాయి ఏదో ఆపెండ్లికి రమ్మంటే ఆనాటికొచ్చిచూసిపోయేవాళ్లమే గాని, పెద్దవాళ్ళం, ఇక మేమేం తిరిగి చెయ్యగలం నాయనా, అన్నీ మీరే చూసుకోవాలిగాని.

ప్రకాశ: మీఇంట్లో చూసుకోటంలా మామయ్యా? జానకిమాత్రం పరాయిపిల్లా!

రంగమ్మ: ఆహా చూడవలసిన వాళ్ళు చూశారు. ఇక ఆయన చూస్తాడు. ఏదో సామెత చెప్పినట్టుంది. వాడింటిపనులుగాక, ఊరివారందరివి ఎక్కడ నెత్తిన పెట్టుకుంటాడు?

అప్పయ్య: అదిగో అదీ. బాగా చెప్పావమ్మా. ఏమిటో విధిలేక చెయ్యడమేగాని మనకేం ఓపికఉంది?

ప్రకాశ: ఈ మాత్రానికే ఆక్షేపణెందుకు మామయ్యా. ప్రాణం మీదికొచ్చిందన్నా గొంతులో నీళ్ళుపోయటానికి కూడా అందరికీ కష్టమే. ఆక్షేపణలు మాత్రం అట్టే కష్టంలేకుండా చేస్తారు!

అప్పయ్య: ఏడిశావు! ఎవరికేం పట్టిందబ్బాయీ నీ ఇంటిసంగతి? ఏదో పెద్దవాళ్ళం గనుక ఇది మంచని, ఇది చెడ్డని చెప్పడం కర్తవ్యం గనుక చెప్పా. వంశ పరువు ప్రతిష్ఠలు నిలుపుకోమన్నా; ఇష్టముంటే విను, లేకపోతే మానుకో—

[పిల్లవాడు తిరిగి కలవరిస్తాడు. ప్రకాశరావు మరీ కంగారుపడతాడు, లేవబోతూ జేబులు తడుముకొని నిస్పృహతో చతికిలబడతాడు]

రంగమ్మ: అమ్మాయ్ జానకీ, నువ్వైన అన్నం వడ్డించవే మామయ్యకి. ఛీ! ఛీ!! ఈ కొంపలో మళ్ళీ ఎవరైనా అడుగు పెడతారా? ఒక మర్యాదలేదు మటూలేదు! తమ్ముడంటూ వస్తే పిడికెడు మెతుకులకు గతి లేకపోయే!

[లోపలినుంచి జానకి రాక.]

జానకి: వంటెవరు చేశారమ్మా వడ్డించటానికి?

రంగమ్మ: ఔరారా! ఏం విపరీతమే! ఇప్పుడేంచేసేట?

సీతమ్మ: మీరు కొంచెం వీణ్ణి చూసుకోండి. నేను వంటచేస్తా, (పిల్లవాణ్ణి ఒళ్ళోనించి చాపమీద పడుకోబెడుతుంది. మురళీ ఆమెచీర గట్టిగా పట్టుకుని ఏడుస్తాడు. సీతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి)

రంగమ్మ: ఇవముంటే చెయ్యి. లేకపోతే లేదు. నలుగురిచేత ఉమ్మేయించే వేషాలు ఇవన్నీనీ!

ప్రకాశ: నేనున్నా రా నాయనా!అమ్మను పోనీ...బాబూ, ఇదిగో చూడు. నా ఒళ్ళో బబ్బో. మా అమ్మకదూ?

[తీసుకోబోతాడు. మురళీ గట్టిగా ఏడుస్తాడు అమ్మమ్మంటూ]

రంగమ్మ: మేమూ కని పెంచాంగాని రాత్రింబగళ్ళు పనిపాటమాని ఒళ్ళో పెట్టుకొని కూచోటం ఎరగం!

అప్పయ్య: ఎందుకమ్మా ఇంతగోల? అసలు నాకు బయటపనుంది. నేనువెళ్లాలి. వీలుపడితే రేపువచ్చిచూసిపోతాలే. వెళ్ళొస్తా అబ్బాయి.

సీతమ్మ: ఉండండి కక్కయ్యగారు. పది నిమిషాల్లో ఇటే వంటైపోతుంది. భోంచేయకుండా వెళ్ళడమేమిటి?

అప్పయ్య: ఫరవాలేదమ్మా మరోసారి వస్తాలే. వస్తా రా అబ్బాయి. [పోతాడు]

(మిగతా వచ్చేవారం)



అన్వేషణ

సింగరాజు లింగమూర్తి

వెంకూబా కేఫ్‌లో కాఫీ తాగి శర్మ బైటికి వచ్చి సిగరెట్ ముట్టించి ఒక్క గుక్క పీల్చాడో లేదో, వింగబడినవ్యక్తిలా ఎదురుగావచ్చి నిలుచున్నాడు ఒకవ్యక్తి. కట్టుకున్న బట్టలు వాలికలై మట్టికొట్టుకున్నాయి. గడ్డం బాగా మాసింది. తలంతా జడలు కట్టుకుపోయి చూడ్డానికి మహాకోతిగా వున్నాడు. 'ఎవరో పిచ్చివా'డనుకున్నాడు శర్మ. అతను నవ్వాపి, శర్మకళ్ళల్లోకి తీక్షణంగా చూచాడు. ఆ చూపుల్ని భరించలేకనో, అతని ముఖంలోకి చూసే ధైర్యంలేకనో శర్మ తనచూపుల్ని మరలించాడు. అతను సిగరెట్ ఇవ్వమన్నట్టుగా సంజ్ఞచేశాడు. "పాపం సిగరెట్ తాగాలని బుద్ధిపుట్టిందేమో" అనుకుంటూ శర్మ జేబులోకి చెయ్యిపోనిచ్చాడు గాని "ఇంత ఖరీదైన సిగరెట్ పిడిముఖాన కొట్టడమా" అనుకొని ఆ ప్రయత్నం మానేశాడు. అతనెంతో ఆశతో శర్మవంక చూస్తున్న వాడల్లా ఆ తిరస్కృతి చూడడంతో తనసొమ్మంతా ఎవరో దోచుకున్నట్టు ముఖంపెట్టి మళ్ళీ శర్మవంక చుర చుర చూచాడు. ఆ చూపు ఎక్కడో చూసినట్టు స్ఫురించింది శర్మకు. కాని ఎక్కడో ఏ సందర్భంలోనో మాత్రం గుర్తు రాలేదు. భయంతో నేమో శర్మ అతనివంక చూడలేకపోతున్నాడు. ఇంతలో 'హల్లో' అంటూ రఘువచ్చి శర్మభుజంమీద చేయి వేసేప్పటికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"కారేమైంది—ఇక్కడ నిలబడ్డావ్" అన్నాడు రఘు. "పెట్రోలుకోసం తీసుకువెళ్ళాడు డ్రైవరు. నేనీలోగా కాఫీ తాగుదామని ఇక్కడ దిగాను." అన్నాడు శర్మ.

"అలా ఆ వ్యక్తి తనవంక చూస్తుంటే తనెందుకు భయపడాల్సి వచ్చింది?" అని ప్రశ్నించుకున్నాడు శర్మ. తనలో ఏమూలో దాగివున్న పిరికితనం అతనివంక సూటిగా చూడనివ్వలేదనుకున్నాడు. "ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఆ పిచ్చివాణ్ని గురించేనా?" అన్నాడు రఘు. తనలోని పిరికితనాన్ని రఘుకు చెప్పడానికి అభిమానపడ్డాడు శర్మ.

పిచ్చివాడు వడిరోడ్డుమీద నిలబడి అటు-ఇటూ అంగలు వేస్తున్నాడు. చుట్టూ కొంతమంది పిలలు గుమిగూడి చిన్న చిన్న రాళ్ళు, కాల్చి పారేసిన సిగరెట్ పీకలు, ఖాళీ సిగరెట్ డబ్బాలు పిచ్చివాడిమీదకు విసురుతున్నారు. అంతమంది పిలలమధ్య అతను ఒక్కడైపోయాడు. ఒక కుర్రాడు వెనకనుంచి వెళ్ళి జుట్టు పీకాడు. అతను అటు తిరిగేటప్పటికి రెండోవైపునుంచి మరోకుర్రాడు చొక్కా పట్టుకులాగాడు. పిల్లలదాడికి తట్టుకోలేక పిచ్చివాడు పరుగుపెట్టాడు వెనకనుంచి పిలలుకూడా పొలికేకలతో పరుగెత్తుతూ రాళ్ళు విసురుతున్నారు. శర్మ ఈ దృశ్యాన్నంతా కళ్ళప్పగించి చూస్తున్నాడు. రఘు మరెవరితోనో మాట్లాడుతూ నిలబడ్డాడు. శర్మ కెందుకో అనుకోకుండానే కళ్ళు చెమ్మగిలినాయి. రఘుతో మాట్లాడుతున్న వ్యక్తి వెళ్ళడంతో శర్మవైపు తిరిగి, "ఏమిటోయ్-నీకూ కూడా మతి చెడిందా ఏం ఖర్మ" అన్నాడు. "నిజంగానే తనకు మతి చెడుతుందేమో" అనుకున్నాడు శర్మ. రఘు ఖాళీ సిగరెట్ డబ్బి పారేసి, "సిగరెట్ ఏదోయ్" అన్నాడు. సిగరెట్ కేసు అందిస్తుంటే శర్మ మనస్సులో పిచ్చివాడు మెదిలాడు. "అతనికి సిగరెట్ ఎందు కివ్వలేకపోయాడు తను?" అని ప్రశ్నించుకున్నాడు. "ఇంత అహంభావం తనలో ఎలా వచ్చిందో అనుకున్నాడు.

"వస్తానోయ్" అంటూ రఘు తన మోటారు సైకిలు ఎక్కాడు. ఇంతలో శర్మ కారు కూడా వచ్చి ఆగింది. "గుడ్ బై" అంటూ శర్మ కార్లో ఎక్కాడు.

కారు నడుస్తున్నది. శర్మ మనస్సును మరలించడానికేమో చేతిలోని పత్రిక తెరిచాడు. 'క్రీచ్' మన్న శబ్దంతోపాటు శర్మ ముందుకు తూలడంతో ముందుకు చూశాడు. పిచ్చివాడు కారుకు అడ్డంగా నిలుచున్నాడు.

"ఏయ్...చావదలచుకున్నావా-తప్పుకో" అని గదమాయించాడు డ్రైవరు. పిచ్చివాడి నుదుటినుంచి రక్తం ప్రవహిస్తున్నది. రక్తాన్ని చూసేటప్పటికి శర్మకు ఒళ్ళు జలదరించింది. "నన్ను కారో ఎక్కించుకో" అంటూ పిచ్చివాడు ఫుట్ బోర్ మీదికి ఎక్కాడు. "నీ బ్రతుక్కు కారు కూడానా" అంటూ డ్రైవరు పిచ్చివాడిని నెటివేశాడు.

"స్టుపిడ్...ఎవరిననుకున్నావ్? జాగ్రత్త...నీమీద పైకి ప్రాకానంటే ఉద్యోగం ఊడుతుంది" అని పిచ్చివాడు గద్దించాడు. డ్రైవరు ఫక్కున నవ్వేసి, "పోరా పిచ్చాడా" అంటూ గేరు మార్చాడు. "పోనీకే, ఎక్కనీ జోసఫ్" అంటూ తలుపు తెరిచాడు శర్మ. డ్రైవరు ఆశ్చర్యంగా శర్మ ముఖంలోకి చూసి కారు ముందుకు పోనిచ్చాడు.

పిచ్చివాడి ఒంటిమీదినుంచి వచ్చే దుర్వాసనను తట్టుకోడానికనేమో శర్మ సిగరెట్ వెలిగించాడు. పిచ్చివాడు శర్మ కాలుస్తున్న సిగరెట్ వంక చూశాడు. వెంటనే దృష్టి మరల్చి ముఖానికి చేతులు కప్పుకొని ఏడుస్తున్నాడు.

శర్మకేమీ అర్థంకాక "ఎందుకూ ఏడుస్తున్నావు" అంటూ భుజం తట్టాడు. "ఏడ్వక ఏం చేయను—నవ్వమంటావా?" అంటూ పకపక నవ్వాడు. ఇంత ఏడుపులో నవ్వెట్లా వచ్చిందా అని శర్మ ఆశ్చర్యపడ్డాడు. కేసు తీసి సిగరెట్ అందించాడు. పిచ్చివాడు సిగరెట్ ముట్టించి రెండు మూడు గుక్కలు పీల్చాడు.

"భలే బాగుంది సిగరెట్...అబ్బ......"

విశ్వాసోయుంది...ఇంత మంచి సిగరెట్ తాగి. ఈ మన్ష్య అన్నీ ఎంగిలి పీకలేగా కాల్చింది" అంటూ పొగ వదులుతున్నాడు.

"ఐయాం వెరీ గ్లాడ్ టు సీ యూ" అన్నాడు పిచ్చివాడు. శర్మ ఏమీ మాట్లాడకుండా చూస్తూ కూర్చున్నాడు.

పిచ్చివాడు దర్జాగా కాలుమీద కాలు వేసుకొని, సిగరెట్ పొగను విలాసముగా వదులుతున్నాడు ముఖంమీద తగిలిన గాయంనుంచి నెత్తురు చిమ్మి శివుడి మూడో కన్నులా వుంది. సంతృప్తిగా సిగరెట్ కాలుస్తున్నాడు. కొన్ని క్షణాలు గడిచాయి. పిచ్చివాడు సిగరెట్ బైటికి విసిరాడు. ఉన్నట్టుండి ముఖం గంభీరమైంది.

"మీరింత ద్రోహం చేస్తారనుకోలేదు. నాకు ఇస్తానన్న ఉద్యోగం మరొకరికి ఇచ్చారుకదూ?.. మీ అన్యాయాన్ని ఎదురించేవాళ్ళెవరూ? అవునులెండి-మిమ్మల్ని అనడందేనికి-నేను దురదృష్టవంతుణ్ణి" అని పెదవి విరిచాడు.

"నీ పేరేమిటి?"

"నా పేరా?...అహ అహ్హ అహ... తెలీదూ?...ఏమిటో నా పేరు?... నిజం చెప్పండి—నేను పిచ్చివాణ్ణా?...... అవును—నేను పిచ్చివాడినే. నా పేరు అదే," అని నవ్వుకున్నాడు.

"నన్నెప్పుడైనా చూశావా?" మళ్ళీ శర్మ ప్రశ్నించాడు.

పిచ్చివాడు శర్మ ముఖంలోకి పరిశీలనగా చూసి, "ఆఁ- చూశాను...అవును నువ్వే కదూ—ఇందాక అక్కడ సిగరెట్ ఇవ్వబోయి మళ్లీ దాచేసుకున్నావ్? ఊఁ... ఇప్పుడెందుకిచ్చావ్ సిగరెట్?... చూశావా...నేను పిచ్చివాడినా?" అని వికటంగా నవ్వి, చిరిగిపోయిన చొక్కా జేబులోంచి మూడు పుల్లలు తీశాడు.

"ఇదుగో తమ్ముడూ...ఇవ్వేమిటో తెలుసా? ఊఁహూ......నీకు తెలియదు. ఇదిగో—ఇది సత్యం, ఇది శివం, ఇది సుందరం. తెలిసిందా! ఈ మూడింటితోనేగా ప్రపంచం. ఏం—ఒప్పుకుంటావా?" అన్నాడు. శర్మ 'ఊఁ' అన్నాడు.

"అయితే ఈ మూడింట్లో ఏది లేకపోయినా ప్రమాదమేగా" అని మళ్లీ ప్రశ్నించాడు పిచ్చివాడు.

శర్మ కేమనాలో తోచలా. తత్వవేత్తలు తలపట్లు పట్టుకోవలసిన సమస్య అని మాత్రం అనుకున్నాడు.

"ఏమిటో—అంతా మాయ" అంటూ నిట్టూర్చాడు పిచ్చివాడు.

ఇంతలో ఒక డిస్పెన్సరీ ఎదురైంది. డ్రైవరును కారాపమన్నాడు శర్మ. శర్మ క్రిందికిదిగి, పిచ్చివాడిని కూడా దిగమన్నాడు.

"ఈ పప్పులు మన దగ్గర ఉడకవు" అంటూ పిచ్చివాడు పీఠంవేసుకు కూర్చున్నాడు. శర్మ నవ్వుకొని, "ఆ దెబ్బకు కట్టు కట్టించుకొని మళ్లీ ఎక్కుదాం" అంటూ పిచ్చివాడి చెయ్యిపట్టుకొని దింపబోయాడు దిగనని పిచ్చివాడు కొంతసేపు పెనుగులాడినా, దిగి, కట్టు కట్టించుకోక తప్పింది కాదు.

మళ్ళీ కారు పరుగెత్తుతున్నది. పిచ్చివాడు మౌనంగా కూర్చున్నాడు. మధ్యమధ్య తనలో తనే నవ్వుకుంటున్నాడు.

"ఈ పిచ్చివాణ్ణి చూసి కారణ నాకు





కూడా మతిపోయిందనుకుంటుందేమో" అనుకుంటూ శర్మ పిచ్చివాడివంక చూశాడు. కాలుమీద కాలు వేసుకొని దర్జాగా సీటుకు ఆనుకొని కూర్చున్నాడు పిచ్చివాడు. ఏవి ఆలోచనలు అతనిలో పరుగులుతీస్తున్నాయో కాని ముఖంలో ఏదో సంతృప్తి, పెదవులపై చిరునవ్వు తారట్లాడుతున్నాయి. ఉండి ఉండి పిచ్చివాడు పెద్దపెట్టున నవ్వేశాడు. మరుక్షణంలో ఆ నవ్వాపి, శర్మవంక సూటిగా చూశాడు.

"అదే చూపు...ఎక్కడో...ఏ సంవత్సరంలోనో? ఇతనెవరై వుంటారు? ఆఫీసులో అందరినీ గడగడలాడించగల తను ఇతనికెందుకు లొంగిపోతున్నాడు," అని తర్కించుకుంటున్నాడు శర్మ.

"నన్ను అంతా మోసంచేశారు...దగాపడిపోయాను బ్రదర్. ఏమంటావ్? చెప్పవూ" అవున్లే. నీకేం తెలుసు?- ఎవరో పిచ్చివాళ్ళు అనుకుంటారు- నేను మోసపోయాననీ, దగాపడ్డాననీ. నిజంగా నే నిప్పుడు రాజాలా ఉన్నానుకదూ? పైగా నన్నే అంతా పిచ్చివాడినంటారు ఆఖరికి శారద కూడా నన్ను పిచ్చివాడినంది. అంటూ అతను మళ్ళీ అరచేతుల్లో ముఖం దాచుకొని ఏడుస్తున్నాడు. ఈ చివరిమాటలతో నిజంగానే శర్మకు మతిపోయినట్లనిపించింది.

అతణ్ని పిచ్చివాడనుకోవాలో, మంచివాడనుకోవాలో శర్మకి అర్థంకాలేదు.

"శారద ఇతని కెట్లా తెలుసు? ఇతణ్ణి గురించి శారద ఎప్పుడూ తనతో చెప్పలేదే! ఇతను చెబుతున్నది ఇంకేశారదనుగురించో," అనుకుంటున్నాడు శర్మ.

మరికొన్ని నిముషాల్లో కారు శర్మ ఇంటి ముందు ఆగింది. శర్మ కారులోంచి దిగుతూ పిచ్చివాణ్ణికూడా దిగమన్నాడు. "ఎందుకూ?" అంటూనే అతను దిగాడు. కారు హారన్ విని శారద వచ్చి ఎదురుగా హాల్లో నిలుచుంది. చిట్టిబాబు తల్లి కొంగు లాగుతూ కారువంక చూస్తున్నాడు. మామూలుగా కేరింతలు పెడుతూ తండ్రికి ఎదురుగాపోయే చిట్టిబాబు, పిచ్చివాణ్ణి చూసి భయపడ్డాడేమో 'కెవ్వు'న కేకపెట్టి తల్లి కాళ్ళను చుట్టేసి ముఖం దాచేసుకున్నాడు. శారద భయభ్రాంతులతో వచ్చేవారిని చూస్తున్నది. చిట్టిబాబును అక్కున చేర్చుకొని శర్మ కంటే ముందుగానే పిచ్చివాడు చరచర వెళ్ళి కుర్చీలో మఠం వేసికొని కూర్చున్నాడు. శర్మ నవ్వుకుంటూ లోనికివెళ్ళాడు.

"ఎవరివండీ వెంట తెచ్చారు? ఆ బట్టలూ ఆ వాలకం" అని శారద అంటుండగానే,

"పిచ్చివాడిలా గావున్నాడుకదూ" అన్నాడు శర్మ.

"సందేహంలేదు. పిచ్చివాడిని కొంపలోకి తెచ్చారుటండీ-మీరు మరీనూ, ఓమంచీ లేదు-చెడూలేదు, చిట్టిబాబు వాడలి పోయాడు చూశారా" అంది శారద.

"మరేం ఫరవాలేదు ... మన కేం పీక్కుతినడులే. పాపం బాగా చదువుకున్నవాడిలా వున్నాడు. కాస్త మతిచెడింది అంతే" అంటూ శర్మ బట్టలు మార్చుకొనివచ్చి పిచ్చివాడిదగ్గరనే సోఫాలో కూర్చున్నాడు.

పిచ్చివాడు చూపు ఆనినంతవరకు ఇల్లంతా కలియచూస్తున్నవాడల్లా శర్మను చూడగానే ఒకసారి నవ్వి "ఆకలివేస్తున్నది. తినడానికేమైనా పెడవూ" అన్నాడు. ఆ అమాయకపుమాటతో శర్మకు పిచ్చివాడిమీద అమితంగా జాలి కలిగింది. శర్మ చెప్పకుండానే బాయ్ రెండుపేటలలో టిఫిన్ తెచ్చి ఇద్దరి ముందూ పెట్టి వెళ్ళాడు.

శారద చిట్టిబాబును మాలికి ఒప్పజెప్పి వచ్చి తలుపుచాటున నిలబడింది. పిచ్చివాడెంత ఆకలితోవున్నాడో టిఫిన్ కూడు నిముషాల్లో ముగించాడు. బాయ్ అరటిపళ్ళు తెచ్చి బల్లమీద పెట్టాడు. పిచ్చివాడు చకచకా పళ్ళుతొలిచి మింగేస్తున్నాడు. కొంతసేపటికి ఆకలి చల్లారిందేమో "టిఫిన్ చాలా బాగుంది" అన్నాడు. ఆమాటలతో తలుపుచాటునవున్న శారద ఉలిక్కిపడింది.

"ఎవరిదీగొంతు. తనకు చాలా పరిచయమైందిదే" అనుకొంటూ తొంగి చూసింది. ఆనందాశ్చర్యాలతో ఆమె ఒళ్ళు జలదరించింది. ఆతృతగా ఏమో అనబోయిందిగాని మాట పెగిలిరాలేదు. పెదిమలు కంపించిపోయాయి. తలతిరుగుతున్నట్లు ఒళ్ళు తూలిపోతున్నట్లు అనిపించి, ఇక అక్కడ నిలబడలేక వెళ్ళి మంచంమీద వాలిపోయిందిశారద. ఆమెలో ఎన్నాళ్ళనుంచి ఎంత ఆవేదన అణగివుందో, ఎంత వ్యథను దాచుకుందో పిచ్చివాణ్ని చూసేప్పటికి అవన్నీ వెల్లువికాయి. దుఃఖం పొర్లిపొర్లి వచ్చింది. తన ఏడుపు బైటివారికి వినపడుతుందేమోనని దిండులో ముఖం దాచుకొంది.

"పుట్టడం, బ్రతకడం, చావడం ఎందుకు జరుగుతున్నాయంటావు బ్రదర్" పిచ్చివాడు.

"ఏమిటీప్రశ్న? ఇంతవరకు తనకెప్పుడూ సందేహమే కలగలేదే" అనుకున్నాడు శర్మ.

అసలీసమస్యనుగూర్చి ఆలోచించాల్సిన అవసరంగానీ, పరిస్థితిగాని శర్మకెప్పుడు రాలేదు. ఇటువంటి చిక్కుప్రశ్నలతో సందేహాలతో తర్కవితర్కపడుతున్నవాడిని పిచ్చివాడని ఎలా అనుకోవడం? విజ్ఞానసంపన్నుడైతే. మధ్యలో మారుతుంటే ధోరణి, వాలకంచూస్తే పిచ్చివాడికి సందేహంలేదు. తను

మాట్లాడకుండావుంటే అతనే సమాధానం కూడా చెబుతాడేమో అనుకున్నాడు శర్మ.

"ఏం బ్రదర్! పుట్టడం ఎంతసహజమో చావడం కూడా అంతే సహజం కదూ? అయితే బ్రతకడంలోనే ఏదో నిగూఢమైన సత్యంవుంది. నేను ఎందుకు బ్రతుకుతున్నట్లో చెప్పు తమ్ముడూ" అన్నాడు పిచ్చివాడు

ఇది మహా చిక్కు ప్రశ్నగానే తోచింది శర్మకు. నిజంగా అతనెందుకు బ్రతుకుతున్నాడో శర్మకు మాత్రం ఏం తెలుసు? "బహుశః ఇతను ఈ అన్వేషణలోనే పిచ్చివాడయ్యాడేమో" అనుకున్నాడు.

"ఏమిటి తమ్ముడూ ఆలోచిస్తున్నావ్? నేనిల్లా ఎందుకు వాగుతున్నాననా?... నిజమే ఎందుకు వాగుతున్నానో నాకూ తెలియదు." అన్నాడు పిచ్చివాడు.

వికలమైన మనస్సుతో పరిపరి విధాల ఆలోచనలతో మంచంమీద పడుకున్న శారదకు ప్రక్కగదిలోని మాటలు వినవస్తూనే వున్నాయి.


"మా అత్తయ్య వస్తేప్పుడూ అంటూ వుండేది — పూటకు గతిలేని వెధవ అని - అందుకే ఆమె శారదను నాకు కాకుండా చేసింది. అయినా ఇప్పుడు నాకేం తక్కువ రాజాలాగా లేనూ?" అన్నాడు పిచ్చివాడు

"శారద ఎవరూ?" సందేహ నివృత్తి కోసం అడిగాడు శర్మ.

"ఎవరో? ఎవరని చెప్పను. ఏమో ఎవరో? అసలు నాకేమవుతుంది శారద? అబ్బే ఏమీ కాదు" అని పిచ్చివాడు మళ్ళీ మోకాళ్ళ మీద ముఖం వంచుకొని ఏడుస్తున్నాడు. శర్మ సిగరెట్ ముట్టించి ఆలోచనలోపడ్డాడు.

ఆ మాటలతో శారద హృదయం మీద గాజు ముక్కతో గీరినట్లు బాధపడింది. "వేణుకు నేనేమీ కానూ?" అని ప్రశ్నించుకుంది.

"నిజంగానే అమ్మ వేణుకు అన్యాయం చేసింది. నాన్న గుండెజబ్బుతో హఠాత్తుగా పోకపోయినట్లైతే వేణు ఎం. ఏ. పూర్తి చేసేవాడు. తనూ బి. ఏ. పూర్తిచేసేది. వేణు తల్లిదండ్రులకు కరవై తమ మీదఆధారపడి వున్నాడనేగా అమ్మకు వేణు అంటేచులకనై పోయింది. తనంటే వేణుకెంత ప్రాణం? నాన్న పోవడంతో వేణుకు ఇంట్లో స్థానం లేకపోయింది. ఎప్పుడూ సాధింపులతో, సూటిపోటి మాటలతో అమ్మ ఆడిపోసుంటే తను భరించలేకపోయేది—ఇక వేణేం సహించగలడు? ఎక్కువగా స్నేహితుల తోనే గడుపుతూ, ఉద్యోగాలకోసం తిరిగేవాడు. ఎప్పుడోగాని తనకోసమే ఇంటికి వచ్చేవాడు. వేణు అలా వచ్చివున్న కొద్ది క్షణాలలోనైనా మనసిచ్చి మాట్లాడటానికి అవకాశం లేకుండా అమ్మ వెంటవెంట వుండేది.



ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య 70 వ జన్మదినోత్సవం ఇటీవల ఆంధ్ర రాజధానిలో జరిగిన సందర్భంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శ్రీ సత్యనారాయణరాజు. మధ్యలో కూర్చున్నవారు శ్రీ వెంకటరంగయ్య.

అదే ఆఖరిరోజు, తను స్వహస్తాలతో కాఫీ ఫలహారాలివ్వడం—మనసిచ్చి మాట్లాడటం కూడా. ఆ రోజు వేణు వస్తాడని తనకు తెలుసు. అదృష్టవశాత్తు అమ్మ ఆ రోజు ప్రక్కయింటివారితో హరికథ వింటానికి వెళ్ళింది. తను పెట్టిన మైసూరుపాక్, బజ్జీలు తిని "టిఫిన్ చాలాబాగుంది శారదా" అంటూ వేణు తనను అభినందించాడు. తను ఇంటర్వ్యూకు పట్నం పోతున్నాననీ, ఆ ఉద్యోగం దొరికితే మొదట మూడు వందలకు తక్కువ వుండదనీ చెబుతూ, అప్పుడు కూడా మీ అమ్మ నన్ను గతిలేనివాడి నంటుందేమో" అన్నాడు. "ఊరుకో బావా- అమ్మ మాటలకేంలే. ఇప్పుడుమటుకు నీకేం తక్కువైంది." అంటూ తను కాఫీ అందించింది. కాఫీగ్లాసు టేబిలుమీద పెట్టి "నన్ను మరచిపోవుగదూ" అంటూ వేణు తన చెక్కిళ్ళు నిమురుతూ కళ్ళల్లోకిచూసి జాలిగా అడుగుతుంటే "నీ వుత్త పిచ్చివాడివి బావా!... నే నెప్పుడూ నీ దాన్నే" అంటూ చేతిలో చేయి వేసింది. ఇంతలో అమ్మ రావడంతో వేణు కొంతసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మళ్ళీ వేణు కనిపించనేలేదు. వస్తుందనుకున్న ఉద్యోగం కాస్తా ఎవరో గద్దలా తన్నుకుపోయారనీ, వేణు ఇంకా ఉద్యోగ ప్రయత్నంలోనే పట్నంలో తిరుగుతున్నాడనీ అమ్మతో ఎవరో చెబుతూంటే విని ఆ రోజంతా తనెంత ఏడ్చింది. అతని రాక కోసం తను ఎదురుతెన్నులు చూడటంతో కన్నుకాయలు కాచాయి.

"శారదా!" అన్న పిలుపుతో ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. "తను అక్కడకు వెళ్ళి ఏమా-మనేనూ? వెళ్ళకపోతే ఏమనుకుంటారు?... వెళితే వేణు గుర్తుపట్టి పలుకరిస్తాడేమో?" అన్న ప్రశ్నలు ఆమెను వేధించాయి. ఆమె ఆలోచించడానికికూడా అవకాశంలేకుండా శర్మ శారదను మళ్ళీ పిలిచాడు. 'ఆఁ' అంటూ ఆమె డ్రాయింగు రూములోకి వెళింది.

"చిటిబావేడీ?"

"మాలి బెట ఆడిస్తున్నట్లున్నాడు"

పిచ్చివాడు శారదను పరిశీలనగా చూస్తున్నాడు. ఆమె హృదయాన్ని పదిలపరచుకొని పిచ్చివాడినీ, శర్మనూ చూస్తున్నది.

"ఎవరీమె?...ఎక్కడో చూసినట్లుందే ...ఊహూఁ...ఆఁ...ఆఁ... ఇందాక కారు దిగంగానే చూశాంకదూ? నన్ను చూసి, మీరూ మీ బాబూ భయపడ్డారుకదూ... అవును. నేను పిచ్చివాడినికదూ...అంతా నన్ను పిచ్చివాడనే అంటారు. నీవు నిజం చెప్పమ్మా? నేను పిచ్చివాడినా?" అని ప్రశ్నించాడు. శర్మ పిచ్చివాడిమాటల్ని శ్రద్ధగా వింటున్నాడు. శారదకు లోపల ఒక ప్రక్క విచారం, మరోప్రక్క ఆశ్చర్యం కలిగాయి "మతి చెడితే మనుషుల గుర్తుకూడా తెలీదేమో." అనుకుంటూ, "ఇంతబాగా మాట్లాడుతూవుంటే మిమ్మల్ని పిచ్చివాడని ఎవరంటారు?" అని తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో శర్మవైపు చూసింది.

"రైట్... నేను పిచ్చివాణ్ని కాదు

(-63 వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

[18-2-59 మొదలు 24-2-59 వరకు]

బి. నరసింగరావు

గ్రహస్థితి.

శ		కు	
కు ర బు	తే 18 దిని శుక్రుడు మీనములో ప్రవేశించును. మిథున, కర్కాటక, సింహ కన్యలలో చంద్రుడు.		
			.
కే	గు		రా

అశ్వని [చూ, చే, చో, లా]

ఈవారము మీకు ఇష్టకార్యసిద్ధి, ధన ధాన్యవృద్ధి, వివాహాది శుభకార్యాలలో పాల్గొనుట, యత్నకార్యానుకూలత, పరోపకారములవల్ల కీర్తి, వాహనయోగములు వంటి రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదములలో పాల్గొన్నా, చదువు బాగా సాగుతుంది. విలువగల వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు రెట్టింపు లాభము కలుగును. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము మీకు కార్యభారము ఎక్కువ కాబడితక్కువ. స్నానావసరములు తీరక కలతలు. అకాల భోజనమువల్ల ఆరోగ్యము చెడుచున్న సూచనలు కనబడగానే ఔషధ చికిత్సపొందడమే కాకుండా గ్రహరాజైన రవికి శాంతిచేయించుట మేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన విద్యార్థులకు చదువు సరిగా సాగదు. రాజకీయవాదులకు అశాంతి. 20 ఆరోగ్యభంగము. 21, 22, 23, 24 పితృవర్గ సహాయము, ధనలాభము, ప్రయాణము అధిక ఖర్చులు.

* కృత్తిక [అ, ఈ, ఊ, ఏ] *

ఈవారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా మిత్రసహాయము వల్ల కార్యలాభము పొందుతారు. ధన లోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు ఏమంత బాగుండదు. విద్యార్థులకు బద్ధకము వల్ల చదువు బాగా సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అవయోగములున్నా మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదన వంటి మంచి యోగములు కూడా వుంటవి.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈవారము మీరు సహాయము పొందదలచుకున్న వ్యక్తి మూలముగా కార్యహాని అవుతుంది. ధనాభావము కూడా ఎక్కువ ఇంట్లో వారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. అయినా ఆధ్యాత్మిక చింతవల్ల దైవముపై భారమువేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి వ్యాపారస్తులకు నిరాశ విద్యార్థులకు మంచి రోజులు కావు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతా దర్శనము, విచిత్రములను చూచుట సముద్రవర్త లాభము కలుగును. వారమంతా అవయోగ శుభయోగ మిశ్రమముగా యుండును.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈవారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ యత్న కార్యములు ఎక్కువశ్రమతో ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిసవి. ఇతరులకు సహాయము చేయబూని పొగక నిందలు పొందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ,తోటివారి సహకారము వుంటాయి. వర్తకులకు వారమంతా నిరాశ, వారాంతమున మేలు. 20న భార్యకు అనారోగ్యముచే ఆందోళన. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము ఎన్ని ఆటంకములు వచ్చినా నిరాశచెందక పట్టుదలతో ప్రయత్నించడము వల్ల కార్యలాభము పొందుతారు. అనుకున్న సొమ్ము సమయానికి రాక అప్పుచేస్తారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు లోహము, రంగుల వ్యాపారస్తులకు కష్టముతో కూడిన లాభము. గనుల యజమానులకు, యంత్రములు నడుపు నిపుణులకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు మేలుకాలము. 20 న ప్రమాదసూచన.

* పునర్వసు [కే. కో. హా-హీ] *

గత రెండువారములనుండి కలుగుచుండిన ప్రతిబంధకములు గడిచి, అధికారుల సహాయముచేతనూ, మీ నేర్పరితనముచేతను కార్యసిద్ధిని పొందుతారు. ఆర్థికస్థితి బాగుపడుతుంది. వారమంతా యోగప్రదముగా వుంటుంది. ప్రయాణము, అధికారుల ఆదరణ, ధనలాభము కలుగుతవి. విద్యార్థులకు మేలుగా వుంటుంది. డాక్టర్లకు, గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము. 20 న అధిక ఖర్చులు.

* పుష్యమి [హూ. హే. హో. డా.] *

ఈ వారము అన్ని ఇబ్బందులు తీరుతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. కోర్టు దావాలు అనుకూలముగా తీర్పు అవుతవి. పిల్లల మేలుకొరకు కొన్నియేర్పాటుచేస్తారు. నూతన కార్యారంభము చేస్తారు. ప్రభుత్వ సన్మానము కలుగుతుంది. పండితులతో శాస్త్రగోష్ఠి జరిపి జ్ఞానము వృద్ధిచేసుకుంటారు. విద్యార్థులు శ్రద్ధతో కొత్తవిషయాలు నేర్చుకుంటారు. వారమంతా యోగదాయకముగా వున్నా 20న ఆందోళన కలుగుతుంది. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుపడుతుంది. పండితులకు, ఉపాధ్యాయులకు, న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగస్తులకు మేలుకాలము.

* ఆశ్రేష [డీ. డూ. డే. డో] *

ఈ వారము మీకు యోగదాయకమైననూ మానసికాందోళన కలుగుతుంది. ధనయోగము వుంది. నీటిమీద ప్రయాణము చేస్తారు. బంధుమిత్రులతో కలసి కవితాగోష్ఠి, గానసభలవంటి వినోదాలలో పాల్గొంటారు. దూరమందున్న ఆప్తుల క్షేమవార్త తెలిసి సంతోషము పొందుతారు. నూలు, బట్టలు, బియ్యము. వెండి వ్యాపారస్తులకు వారమంతా లాభదాయకముగా వుంటుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు.

* మఖ [మా మీ మూ మే] *

గతవారము పూర్తికాకుండా వుండిపోయిన పనులు ఈ వారము లాభకరముగా చేయగలుగుతారు. ధనయోగము అనుకున్న దానికన్నా ఎక్కువగా కలుగుతుంది. పుణ్యకార్యాచరణలో పాల్గొంటారు. పరులకు ఉపకారముచేసి కీర్తిపొందుతారు. విలువగల

—ధరలు:—

నూలు వస్త్రములు: మార్పు లేదు.
నూనెగింజలు: సమస్థాయిలో వుండును.
ఆహారధాన్యములు: మందముగా వుండును.
బెల్లము, పంచదార: స్వల్ప భేదాలో వుండును.
చింతపండు: తగ్గుదలలో వుండును.
పప్పుదినుసులు: మార్పు లేదు.
వెండి, బంగారము: స్వల్ప భేదాలో వుండును.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోవలెను. కృష్ణుడను పేరుగలవు మృగశిరానక్షత్రమును, రాముడను పేరుగలవు స్వాతియు, శ్రీధరుడను పేరుగలవు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరుగలవు హస్తయును, భీముడు, భార్గవుడు అని పేర్లుగలవు పూర్వాషాఢయున్నూ చూచుకోవలెను.

వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారము పెరుగుతుంది. స్త్రీలతోనూ, బంధువులతోనూ విందువినోదములతో ఆనందిస్తారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలు కాలము.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
(మో, టా, టీ, టూ)

ఈవారం యత్నకార్యములకు ఆటంకములు, కార్యభారము ఎక్కువ. తీరుబడి కాని కార్యక్రమమువల్ల అకాలభోజనము చేయుటచే ఉష్ణాధిక్యము, కళ్ళు మంట, కాళ్ళుపీకు, కడుపు నొప్పివంటి అనారోగ్య సూచనలు కనబడినగానే ఔషధచికిత్స పొందుట మేలు. వర్తకులకు శ్రమ ఎక్కువ. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడిచే సెలవు పెట్టవలసి వస్తుంది. రాజకీయవాదులకు మేలుగావుంటుంది. పితృవర్గమునుండి సహాయముచే ధనలోపము కొంత తీరుతుంది.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

ఈవారము నిరాశగా వుంటుందిగాని మిత్రసహాయమువల్ల క్రమేణా కార్యలాభము పొందుతారు. రహస్యములను కనిపెట్టుటకు ప్రభుత్వముచే నియోగించబడుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు బదిలీఅయే యోగములున్నవి. వర్తకులకు మాంద్యము. విద్యార్థులకు శ్రద్ధతక్కువ. ప్రయాణము, విదేశీయులతో పరిచయము, వింతవస్తువుల సంపాదన, కార్యసిద్ధి కలుగుతాయి. ఇంట్లోవున్న వృద్ధుల ఆరోగ్యము చెడుటచే ఆందోళన కలుగుతుంది.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీరు అనుకున్నట్లు పనులు జరగవు. ధనాభావముచే ఇబ్బంది ఎక్కువ. ఏ వ్యక్తిసహాయమువల్ల పనులు చేయదలచుకున్నారో అతనే ఆటంకములను కలుగజేస్తాడు. ఆధ్యాత్మిక చింతకలవారగుటచే, ఈశ్వర కృపవల్ల కష్టములను గడిచి కార్యసిద్ధి పొందుతారు. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిగించుతుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు నిరాశకలిగినా నష్టద్రవ్యలాభము కలుగుతుంది. సాధు సజ్జన సాంగత్యముచే ఆత్మవికాసము కలుగుతుంది.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. రావలసిన డబ్బు చేతికందక అశాంతి. బంధువుల రాకపోకలవల్ల ఖర్చులు ఎక్కువ. కోర్టు వ్యవహారములు కొంతవరకూ అనుకూలిసవి. పగలకు చేయదలిచే సహాయము చేసేందుకు అవకాశము లేక మాటపడతారు. ఉద్యోగస్థులకు క్రొత్త సమస్యలవల్ల కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారముపట్ల పేచీలు. 20-న భార్యకు అనారోగ్యమువల్ల మనోవ్యథ. విద్యార్థులకు బద్దకముచే చదువు బాగా సాగదు.

* స్వాతి [రూ, రే, రో, తా]*

మీ ఆలోచనలు కార్యరూపమునకు వచ్చేందుకు కలిగే ఆటంకములకు నిరుత్సాహపడకూడా పట్టుదలతో ప్రయత్నించినందుకు కార్యసిద్ధి పొందుతారు. సమయానికి సొమ్ము చేతికి అందక అప్పు చేయవలసి వస్తుంది. కాని వారాంతమునకు తీరుస్తారు. 20-న యంత్రములవల్లగాని, అగ్నివల్లగాని, ఎత్తయిన స్థలమునుండి పడుటవల్లగాని కలిగే గాయాలు జాగ్రత్తవల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహపు సామానులు, రంగుల వ్యాపారస్థులకు, గనుల యజమానులకు కష్టముతో కూడిన యోగము. ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు, యంత్రముల నడుపు నిపుణులకు మేలుకాలము.

* విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీకు ధనయోగము. వ్యవహారాలలో జయము. శుభకార్యాలలో పాల్గొంటారు. బంధుదర్శనము, విద్యాప్రాప్తి నూతన కార్యలాభము, ఈశాన్య దిక్కునుండి శుభవార్తతో పుత్రరములు వచ్చుట, జ్ఞానమార్గ ప్రసంగములు, యుక్తిగా ప్రసంగించుట, గణిత జ్యోతిషశాస్త్ర చర్చలు, సుఖభోజనమువంటి మంచి ఫలితాలు కలుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, వస్త్రములు, ఇత్తడి, కంచు మొదలగు సరుకుల వ్యాపారస్తులకు లాభము. కవులకు, చిత్రకారులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులకు చదువు సరీగా సాగుతుంది.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము శుభకార్యములలో పాల్గొనుట, పుత్రప్రాప్తి సూచనలు, ధనలాభము, భాగ్యవృద్ధి, బిరుదులు పొందుట, ప్రభు

★ నక్షత్రఫలితాలు ★

సన్మానము, శుభకార్యాచరణ, పుణ్యకార్యములు చేయుట, పుణ్యక్షేత్ర సంచారము, వైద్య, జ్యోతిశ్శాస్త్ర ప్రసంగములవంటి మంచి యోగములు కలుగును. విద్యార్థులకు మేలుగా వుంటుంది. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు మంచి కాలము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీరు వినోదాలలో పాల్గొంటారు. బంధుమిత్రులతో కలసి వెండిపాత్రలలో దధి క్షీర, మధురపదార్థయుక్త శుభభోజనము చేస్తారు. నీటిమీద ప్రయాణము, తలపెట్టిన కార్యములలో జయము, తెల్లని వస్తువులు కొనుటవంటి మంచియోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ద్రవపదార్థ క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. ఈ వారము మానసికాందోళనవున్నా, అలంకారప్రాప్తి, విందు, వినోదము కలుగును. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులు బాగా చదువుకుంటారు.

మూల [యే, యో, బా, బీ]

ఈ వారము ధనధాన్యవృద్ధి, పశువృద్ధి కలుగును. కృషి ఫలించును. వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తు లాభము, పరోపకారములవల్ల కీర్తి ప్రభుత్వ కార్యనిర్వహణవల్ల గౌరవము మొదలగు రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదములలో పాల్గొన్నా చదువు బాగా సాగుతుంది. వర్తకులకు బంగారము, నవరత్నములు వంటి విలువగల వస్తువుల క్రయవిక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము.

పూర్వాషాఢ [బూ, ధ, ఫా, డా]

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. ఆరోగ్యము సరిగా లేనిసూచనలు కనబడగానే గ్రహారాధన రవికి శాంతి చేయుట మేలు కలిగించును. ఔషధ చికిత్స కూడా పొందుట మంచిది. ఉద్యోగస్థులకు కొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు సరిగా చదువు సాగదు. పితృవర్గమునుండి సహాయము, ప్రయాణము, కార్యలాభము కలుగుతవి. 21 న ఆరోగ్య భంగము. రాజకీయవాదులకు ఆందోళన, అధిక ఖర్చులు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము అనుకున్న సొమ్ము సకాలములో చేతికిరాదు. కార్యాచరణకు పాలుపోని అనిశ్చితస్థితిలో వుంటారు. చేదామనుకున్న పనులకు మొదట్లో ఆటంకములు కలిగినా వారాంతమునకు మిత్రసహాయము వల్ల కార్యలాభము కలుగుతుంది. ఉద్యోగస్థులకు వనపర్వత ప్రాంతములకు బదిలీ అయ్యే సూచనలున్నవి. ప్రయాణము, విదేశీయుల పరిచయము, విచిత్రవస్తుసంపాదన, మిత్రసహాయము కలుగుతవి. 20 న ఆప్తుల ఆరోగ్యమునుగురించి చింత. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. అనుకున్నటుగా పనులు జరగవు. కోరిన సహాయము సకాలమునకు లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారము వేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలము పొందుతారు. వర్తకులకు చాలా కాలమునుండి నిలిచిపోయిన బాకీలు వసూలవుతవి. వ్యక్తిప్రసంగములవల్ల ఉద్యోగస్థులు అధికారుల ఆగ్రహమునకు లోనౌతారు. పుణ్యపురుషుల సాంగత్యము, ఆత్మవికాసము, శాంతి, పుణ్యక్షేత్ర సంచారము, దేవతా దర్శనము, నష్టద్రవ్యలాభము కలుగును. 20 న ఇంట్లో వారి అనారోగ్యముచే చింత.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

మీ ఆలోచనల ప్రకారము కార్యక్రమాలు నెరవేరడానికి కొందరు అడ్డువస్తూవుంటారు. కొన్ని సందర్భములలో అశాంతి, బంధువియోగము వచ్చును. కోర్టు దావాలు అనుకూలముగా తీర్పు అయినా మరి కొన్ని కొత్త చిక్కులు కలుగుతవి. కర్రలు, రాగులువంటి అపరదినుసులు, మినుములు, ఉప్పు, నువ్వులు, నూనె సంబంధమగు వస్తువుల వర్తకులకు లాభము. అన్యజాతివారివల్ల గౌరవము కలుగుతుంది. 20 న భార్యకు అనారోగ్యము. అధిక ఖర్చులు.

శతభిషం [గో, సా, సీ, సూ]

ఈ వారము ఎంత ప్రయత్నించినా అనేక ఆటంకములు కలుగుతవి. సాహసము పట్టుదల కలవారగుటచే నిరాశ చెందక ప్రయత్నించి కలిగిన చిక్కులను విప్పుకొని మేలు పొందుతారు. సోదరసహాయమువల్ల ఒడిదుడుకులు సద్దుకుంటాయి. జాగ్రత్తగా వుండనందువల్ల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చును. గనుల యజమానులకు, భూగర్భ శాస్త్రజ్ఞులకు, లోహఖనిజ వ్యాపారస్థులకు పోలీసుశాఖ ఉద్యోగులకు కష్టముతో కూడిన యోగము.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

మీరు ధైర్యముతో వృత్తి ఉద్యోగాలలో ముందంజవేసి, హోదా ఆదాయము పెంచుకుంటారు. క్రొత్త అనుకూలతలు ఏర్పడుతవి. మీ బుద్ధికుశలతవల్ల ఉపద్రవాలు సాధించుతారు. మీరు వేసుకున్న పథకము ప్రకారము అన్నివిధాలా డబ్బు చేతికి అందుతుంది. మనుష్య సహాయము కూడా కలుగుతుంది. మాట పలుకుబడితో పరిస్థితులలో అనుకూలమైన మార్పులు తెచ్చుకొనకలుగుతారు. ఈశాన్య దిక్కునుండి బంధువుల శుభవార్త తెలుస్తుంది. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఛా, ధా]

ఈ వారము మీకు యోగప్రదము. అనుకుండా నిలిచిపోయిన కార్యములు ఈ వారము సుముఖమవుతాయి. అధికారముతో పాటు ధనాదాయముకూడా పెరుగుతుంది. బిరుదులు పొందుట, సన్మానమువంటి రాజయోగములు కలవు. పండితగోష్ఠి, నూతన గ్రంథములు చదువుటచే విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. పిల్లల మేలుకొరకు మీరు కొన్ని యేర్పాట్లు చేస్తారు. వర్తకులకు లాభయోగము. విద్యార్థులకు మేలుకాలము. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పండితులకు మంచి కాలము.

రేవతి [దే, దో, చా, చీ]

ఈ వారము లౌకిక వ్యాపార రంగములలో చాలా జయప్రదముగా వుంటుంది. ఆదాయము ఎక్కువ అవుతుంది. నీటిమీద ప్రయాణము చేయవలసివుంటుంది. కవితా గోష్ఠి, గానసభలు మున్నగు వినోదములలో బంధుమిత్రులతో కలిసి పాల్గొంటారు. విద్యార్థులకు మేలుకాలము. శుభకార్యములలో పాల్గొని మృష్టాన్నభోజనము చేస్తారు. బియ్యము, వెండి, బట్టలు, నూలు వ్యాపారస్థులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. వారమంతా శుభయోగములతో కూడివున్నా మానసికాందోళన కలుగుతూవుంటుంది. ★

★ జీవన లీల ★

(19- వ పేజీ తరువాయి)

చెప్పకపోతివి. వెళ్ళు వెళ్ళు, ముందువెళ్ళి దొరగారిని కలుసుకో. మంచి డ్రెస్ వేసుకుని మరీ వెళు" అన్నాడు.

"ఇంత ప్రొద్దెక్కి యింటికివచ్చాను. తిండి తినలేదు, స్నానం చెయ్యలేదు. దొరగారిని కలుసుకోటానికి పరుగెత్తేదా? మీరు చెపుతున్నదేమిటో అర్థం కావటంలేదు."

గోపాల్ ఉత్సాహమంతా చల్లారిపోయింది. "నేనేది మాట్లాడినా నువ్వు కస్సుమంటూంటావు శశీ!" అన్నాడు.

"ఎందుకు కస్సుమంటాను? ప్రొద్దునుంచీ తిండిలేదు. ఆకలి దప్పులనేవి ఉంటవా మనిషికి?"

"తినలేదూ? ప్రొద్దునుంచి ఏమీతినలేదూ?" అంటూ గోపాల్ కంగారుపడాడు. "అయితే చప్పునవెళ్ళి స్నానం చెయ్యి. కుండా? అరె: ఎక్కడికి పోయారు మీరంతా? ప్రొద్దునుంచి శశి ఏమీ ఎంగిలిపడలేదు—ఉండండి ఈ సారి మిమ్మల్నందర్నీ వెళ్ళగొడతా ఇంట్లోంచి."

సాయంత్రం శశి మేజస్ట్రేట్‌ని కలుసుకుని వచ్చాడు. సాంత్ గావ్ స్కూలు, గాంవాదియా ఆస్పత్రిఅన్నీ శీతలబాబు చూపించాడాయనకి. శశిని కూచోపెట్టి ఆస్పత్రి సంగతులే అడిగాడు చాలాసేపు. జాదవ్ చనిపోయిన గాధను సావధానంగా విన్నాడు. ఈ విషయంలో అతడికెంతో కుతూహలం ఉన్నట్లు కన్పించింది. శశినడిగుండి చూశాడా అంతా? ఆ విషయంమీద అతడి వ్యాఖ్యానం ఏదో చెప్పకూడదూ? శశి కివాళ ఏంబాగాలేదు. అదీ కాక జాదవ్—అతడి భార్యల మరణాన్ని గురించి వ్యాఖ్యానించే అవకాశం లేదతడికి. అది యెప్పటికీ మనసులో ఉండిపోవాల్సిందే. తర్వాత ఒకకప్పు టీయిచ్చి, ఆస్పత్రి నిధి నూరురూపాయలు విరాళమిస్తానని వాగ్దానంచేసి మేజిస్ట్రేట్ శశిని పంపించాడు. అక్కడి నుంచి శశి శీతలబాబు, ఇంటికి వెళ్ళాడు. ఏం చెప్పకుండా వెళిపోయినందుకు శీతలబాబు శశిని కాసిని చీవాట్లుపెట్టి, అతడిచేత ఆయనా ఒకకప్పు టీ త్రాగించి పంపించాడు. అప్పటికి సంజెపడింది శీతల

దారిలో ఒక్కసారి అయినా శశి టార్చితీసి వెలిగించలేదు. చీకట్లోనే నడుస్తున్నాడు. ఆస్పత్రిలో తనగదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. ఆస్పత్రిలో ఇరవై రూపాయల జీతంమీద ఉన్న కంపౌండరు ఈ సమయంలో శశి వస్తాడని అనుకోలేదులా ఉంది. అత బాబు లాంతరు యిచ్చిపంపిస్తానన్నాడు. జేబులో టార్చి ఉంది లెండి వద్దుఅని చెప్పివచ్చేశాడు శశి.

డెక్కడికో వెళ్ళాడు. తర్వాత రెండుగంటలకి తిరిగివచ్చాడతడు. శశి అతణ్ణి యేమీఅనలేదు. ఆస్పత్రిలో ఆరుపక్కలున్నాయి. వాటిలో రెండింటిమీదమాత్రం రోగులున్నారు. వాళ్ళని చూశీ, కంపౌండరుతో వాళ్ళనిగురించి చెప్పవలసిందేదో చెప్పి, శశి యింటికి వచ్చాడు. ఏమిటివాళ మనస్సంతా ఇంత చికాకుగా ఉంది! వాసుదేవశెట్టిగారిల్లు చీకటి కోణంలా ఉంది. వాళ్ళ యింటిముందు ఆ పెద్ద జామచెట్టు అలాగే ఉంది. దాని కొమ్మమీదనుంచి పడే అప్పుడొక కుర్రాడు చచ్చిపోయింది. మృత్యువుతో శశి కెంతో సన్నిహిత సంబంధం. అయినా ఆ కుర్రవాణ్ణి శశి ఇప్పటికీ మరిచిపోలేదు. తన చికిత్సలో పొరపాటా? ఆ కుర్రవాడికి శరీరంలో ఏ మూల దెబ్బతగిలింది అతడు కనుక్కోలేకపోయాడా? ఇప్పుడా విషయాన్నిగురించి ఆలోచించి లాభంలేదు. అయినా శశి ఆలోచిస్తాంటాడు. ఊళ్లో ఎంతమంది ఇలాంటివాళ్ళు అతడి మనస్సుకు పట్టి ఉన్నారో! వాళ్ళని గురించి శశికి ఆలోచనే లేదు. ఈ ఊరు విడిచి పోయినప్పుడేనా ఇలాంటి స్మృతు లన్నీ అతడి మనస్సులోంచి తుడుచుకుపోవా? ... శ్రీనాథ్ కొట్టుదగ్గర కాసేపు ఆగాడు శశి. "ఏమిటి శ్రీనాథ్? మీ అమ్మాయికి జ్వరమా? రేపు ఓ సారి ఆస్పత్రికి తీసుకురా, మందిస్తాను". 'తనతో ఎవరు చూసినా జబ్బుల సంగతులే చెప్పి, మందు లడుగుతూ ఉండేవాళ్లే'—అనుకున్నాడు శశి నడుస్తూ... పొగడచెట్టు మొదట్లో ఉన్న రాతి కట్టడం నిండా పూలురాలి ఉన్నాయి. ఇన్ని పూలెందుకు? ఇంటిముందు రావిచెట్టుకింద సేకాదిదీ ఇంక శుభ్రం చెయ్యనా? శశి ఇంట్లోకి వెళ్ళబోతూ చూశాడు — పరాన్‌వాళ్ళ ఇంటిహాలులో దీపం వెలుగుతూండటం కిటికీలోంచి కన్పిస్తోంది. వాళ్ళనాన్న వచ్చాడని బహుశా కుసుమ వ్రేలాడకట్టే పెద్దదీపం వెలిగించి ఉంటుందివాళ.

మనస్సు ఎలాగో ఉంది శశికి. బహుశా ఎల్లుండో, ఆ మర్నాడో కుసుమ ఈ ఊరు వదిలి వెళిపోతుంది; ఇక మళ్ళీ రాదు.

—ఇంకా వుంది]

"కడలిలో పడవ"

పడవెక్కి పోతాను
పయనమై నేను.
కడలిలో పడవొదిలి,
పడవలో నే నొదిగి,
పయన మౌతాను.

చుక్కాని పట్టేను,
సూటిగా నడిపేను.
తెరచాప వదలంగ
ఉరికేను నావ.

పగడాల దీవిలో
పడవాపుతాను.
పగడాలు విరివిగా
పట్టి తెస్తాను.

ముత్యాల దీవిలో
మజిలి చేసేను.
జాతైన ముత్యాలు
సేకరిస్తాను.

రత్నాల దీవిలో
లంగరేసేను.
రంగైన రత్నాలు
పోగుచేస్తాను.

నేతి సంద్రము జేరి
నెయ్యంతో త్రాగేను.
దధిసాగరాన నా
దాహ మణిచేను.

ఏడేడు సంద్రాలు
ఏకంగ దాటేసి,
ఏకాక్షి రాకాసి
దీవి చేరేను.

గజకర్ణ గోకర్ణ
గారడీలను నేర్చి,
క్రూరు డేకాక్షిని
కూల్చి చంపేను.

రాకాసి మేడలో
లోకైక సుందరిని
చెరనుండి విడిపించి
పెండ్లి యాడేను.

లోకైక సుందరితో
ఏకమై నేనంత
పాలకడలికి పడవ
పట్టించుతాను.

క్షీరాబ్ధి దరిజేరి
శేషశయనుని గాంచి
దీవించి పంపమని
చేరి మొక్కేను.

శ్రీ విష్ణుదేవుడు
చిరాయులని పల్క,
శ్రీ లక్ష్మి మాకిచ్చు
సిరులు, సంపదలు.

★ పిసిశెట్టి వెంకటేశ్వర రావు ★

పాయప్ర

రంధి సోమరాజు

ముత్యాల దీవి, ఒక కుగ్రామం. ఆ వూరికి రైలు మార్గం లేదు. ఆ వూరి వాళ్ళు పట్నం పోవాలంటే పెద్ద చిక్కే! అయిదారు మైళ్ళు నడిచివస్తే కాలువ తగుల్తుంది. ఆ కాలువ ఒడ్డుకు వెళ్ళేందుకూ సరియైన రోడ్డు లేదు. వర్షాకాలం మోకాలులోతు బురద దిగబడుతుంది. కాలువ ఒడ్డు కెళ్ళిన తరువాత, ఒక రాత్రంతా పడవలో ప్రయాణం చేయాలి. ఆ తరువాత నాలుగు మైళ్ళు జట్కాలో ప్రయాణం చేస్తే పట్నంతో సంబంధమున్న గోరిపాడనే ఓ పల్లెటూరు తగుల్తుంది. అక్కడ నుంచి 40 మైళ్ళు బస్సులో ప్రయాణం చేస్తే పట్నం చేరుకోవచ్చు. ఆ పట్నం నుంచి మహానగరమైన మద్రాసు చేరాలంటే సుమారు 400 మైళ్ళు ప్రయాణం చేయవలసి ఉంటుంది.

ఇంత మారుమూల ప్రదేశంలో ఉన్న ఆ ముత్యాల దీవిలో అప్పారావనే ఓ పదేళ్ళ పిల్లవాడొకడున్నాడు.

అప్పారావు పల్లెటూళ్ళో ఉంటున్నప్పటికీ తెగఖర్చు చేస్తూ ఉంటాడు. వాడి దుబారా ఖర్చుకు ఓ మితిమేరా లేకుండా పోయింది.

ఆ వూళ్ళో చిన్న కాఫీ హోటలొకటి ఉంది. అప్పారావు రోజూ అక్కడకు వెళ్ళి ఇడ్లీలూ, పెసరట్లూ మేసేవాడు. ఈ వేళనక ఆ వేళనక కాఫీ త్రాగేవాడు. ఆ వూరికి అమ్మకానికి వచ్చే మిఠాయిఉండలూ, చేగోడీలు, జంతికలు, పునుకులు కొనుక్కొని ఆ సమానూ నమిలేవాడు. ప్రక్కవూళ్ళో జరిగే సంతకు తోడిపిల్లలతో పారిపోయి, జేబులో ఉన్న డబ్బులన్నీ చిరుతిళ్ళకు ఖర్చుపెట్టేసేవాడు.

ఈ ఖర్చు లిలా ఉండగా, వాడికి రోజు రోజుకూ క్రొత్తబట్టలు కుట్టించవలసివచ్చేది. బట్టలు పొదుపుగా వాడుకోవడం తెలిసేది కాదు. వాటిని తోళ్ళలా మాపేవాడు. పిల్లలతో కుస్తీలుపట్టి, వాళ్ళతో గొడవలుపడి, గుడ్డలు చింపుకొనేవాడు. రోజూ తండ్రిని క్రొత్తబట్టలు కుట్టించమని మారాం చేసేవాడు.

ఒక్కడే కొడుకవడంవల్ల వాడికోరికలు తీర్చకుండా వాడిని ఏడిపించటానికి ఆ తండ్రి మనసొప్పేది కాదు. కాని ఇలా వాడ్ని నెత్తికెక్కించుకోవడంవల్ల ఇంకా వాడెన్ని చెడుగుణాలకు అలవాటు పడతాడో అని అతడు ఓ మూల భయపడుతూనే ఉండేవాడు.



చి॥ అవటపల్లి సీతాజయప్రద

బాలలసంఘం B గ్రూపు సభ్యురాలు; వయస్సు పదేళ్ళు; బాపటలో రెండవ ఫారం చదువుతున్నది. బాలలసంఘం నిర్వహించిన మొదటి పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నది.

దీనికి తగ్గట్టుగా అప్పారావు రోజుకో పెన్సిలు పారేసేవాడు. పుస్తకాలు చింపుకొని క్రొత్తపుస్తకాలకోసం గొడవ చేసేవాడు. వాడికి డబ్బువిలువ ఏమాత్రం తెలిసేది కాదు.

ఈమధ్య వాడు తల్లిదగ్గర ఏడ్చియేడ్చి డబ్బులు గుంజుకొని ప్రక్కఊళ్ళో ఉన్న ఓ టూరింగు సినిమా చూసివచ్చాడు.

వీడి ఆటలు మరీ మితిమీరి పోతూంటే ప్పటికి నూరయ్యకు మతిపోయింది.

'వీడిప్పుడే ఇలా దుబారా ఖర్చులకలవాటు పడిపోతున్నాడు. వీణ్ణి రేపొద్దుట ఎలాగూ పట్నంలో చదివించవలసి వస్తుంది. వాడిప్పుడే ఈ పల్లెటూళ్ళో వీడిలా పాడైపోతూంటే అక్కడ ఇంకెంత పాడైపోతాడో మరి చెప్పనే అక్కర్లేదు' అనుకున్నాడు.

డబ్బు గురించి, దాని విలువను గురించి దాన్ని ఎంతజాగ్రత్తగా వాడుకోవాలో, డబ్బు లేకపోతే ఎన్ని ఇబ్బందులు పడవలసి వస్తుందో మొదలైన విషయాలన్నీ వాడికి మెల్లగా చెప్పిచూశాడు. కాని వాడు తండ్రి ఎదుట ఇవన్నీ జాగ్రత్తగా వింటున్నట్లే నటించేవాడు. వీధిలోకి రాగానే అన్నీ మరచిపోయేవాడు.

ఈమధ్య వాడు సిగరెట్టుకూడ కాల్చడం మొదలుపెట్టాడు. ఈవిషయం తెలియగానే నూరయ్య కుమిలికుమిలి ఏడ్చాడు. 'అయ్యో! వీడు పూర్తిగా పాడైపోతున్నాడు. చేతులార వీణ్ణి నేనే పాడుచేశాను. గట్టిగా చిన్నప్పటి బుద్ధి చెప్పవలసింది. మెత్తగా చెప్పడంవల్ల లాభం వుంటుందనుకోవడం తప్పయింది' అని బాధపడ మొదలుపెట్టాడు.

ఒకరోజున స్కూలుమాష్టరుగారికి తన కొడుకుసంగతంతా చెప్పి, "ఇక మీరే వాడిని ఓ దారికి తీసుకురావాలి..." అని ఎంతో బాధపడి చెప్పాడు. ఇలా చెపుతూన్నప్పుడు

★ పొదుపు ★

సూరయ్య ఎంత సిగ్గుపడ్డాడో చెప్పలేం... తనకొడుకు పాడైపోతున్నాడని చెప్పడానికి ఏతండ్రికి పాపం సిగ్గుకలుగదు!

కాని కథ ఇంతదూరం వచ్చినతరువాత ఎవరైనా ఏమిచేయగలరు? చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడంవల్ల ఏమి లాభం? అయినా కాలింపుళ్ళు మాన్పడానికి ప్రయత్నించాలిగదా!

అమాష్టారుగారు సూరయ్య చెప్పినదంతా విని "సరేనండి... నేను ప్రయత్నించి చూస్తాను" అన్నారు.

ఓరోజున ఆయన అప్పారావును దగ్గరగా పిలిచి, "ఇవ్వాళ మధ్యాహ్నం మా ఇంటికొకసారి రారా...' అన్నారు.

అప్పారావు, 'మాష్టారు ఎందుకు పిలిచారు చెప్మా...' అనుకున్నాడు. ఏమి ప్రశ్నలు వేస్తారో అని హడలిపోయాడు. పాఠం వచ్చిందో లేదో అని ఒకసారి ఆ పాఠాన్ని తనకు తనే అప్పజెప్పుకొని ఫరవాలేదు అనుకున్నాడు. లెక్కలు అడుగుతారేమో అని బిక్కమొగం పెట్టాడు. నోటిలెక్కలుఅడిగితే చిక్కే అనుకున్నాడు. భయపడుతూ, భయపడుతూ మెల్లగా పిల్లిలా సుందరం మాష్టారుగారింటికివెళ్ళి లోనికి వెంటనే వెళ్ళకుండా అక్కడే అలా గుమ్మందగ్గర నిలబడిపోయాడు.

అప్పారావును గుమ్మంలో చూడగానే మాష్టారు ఎంతో ప్రేమతో, 'రారా...... లోపలికిరా......అక్కడే నిలబడిపోయావేం...' అన్నారు.

ఈ మాటవినగానే అప్పారావు కాస్త స్థిమితపడాడు. దడదడ కొట్టుకుంటూన్న వాడిగుండెలు కాస శాంతిపడ్డాయి.

మాష్టరుగారు వాడ్ని పిలిచి, చాపమీద తనదగ్గరే వాడ్ని కూర్చుండబెట్టుకున్నారు. 'ఏరా...పరీక్షలు దగ్గరకొస్తున్నాయి... బాగా చదువుతున్నావా...' అన్నారు.

అప్పారావు 'బాగానే చదువుతున్నానండీ' అన్నట్లు తలవూపాడు. తలవూపడమంటే వూపాడేగాని ఆతరువాత మాష్టరుగారు ఏమడుగుతారో అని వాడిగుండెలు పీచుపీచు మనడం మొదలు పెట్టాయి.

కాని ఆ మాష్టారు ఆతరువాత వాడ్ని అవిషయమై ఏమీ ప్రశ్నించనే లేదు. ఆయన ఏదో వారపత్రిక తీసుకొని చదువుకోవడం మొదలుపెట్టాడు.

ఆ పేపరువెనుక చిత్రమైన ఓ పెద్దబొమ్మ ఉంది. దానిలో చంద్రమండలానికి ఓ రాకెట్ ఎగిరిపోతోంది. ఆ బొమ్మను చూడగానే అప్పారావుకు ఆ రాకెట్లో కూర్చొని చంద్రమండలానికి ఎగిరి వెళ్ళిపోతున్నట్టే అనిపించింది. ఆ బొమ్మను చూస్తూవుంటే వాడిఊహలు క్షణం నిలకడగా నిలబడ్డంలేదు.

ఆ బొమ్మక్రింద, కొద్ది సంవత్సరాలలో మానవులు చంద్రమండలానికి హాయిగా ప్రయాణం చేయగలరు అని ఉంది. శాస్త్రజ్ఞులు ఈ ప్రయాణం సుఖవంతం చేయడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తున్నారు. అని ఉంది.

అప్పారావు మెల్లిగా మాష్టరుగారి వైపు చూశాడు. అప్పుడే ఆ మాష్టరుగారు వాడివైపుచూశారు. ఇద్దరిచూపులు ఒక్కసారి కలుసుకున్నాయి. అప్పారావు ఎందుకో సిగ్గుపడ్డాడు. ఏదో అడగాలనుకుంటూ అడిగేందుకు జంకుతున్నట్లు కనిపించాడు.

వెంటనే సుందరం మాష్టారు, 'ఏరా... ఏమిటి...'అన్నారు.

అప్పారావు మెల్లిగా, 'మనం చంద్రుడిదగ్గరకు వెళ్ళగలమాండి...' అన్నాడు. అంటూనే అమాయకంగా నవ్వాడు. మాష్టారు ఏమి చెపుతారో వినాలని చెవులు రిక్కించాడు. అప్పుడు వాడికళ్ళు రెండు చుక్కల్లా తళ తళ మెరిశాయి.

వెంటనే మాష్టరుగారు, ఈ బొమ్మ చూశావేమిటిరా...దీన్ని రాకెట్ అంటారు. ఇది మనల్ని చంద్రమండలం లోనికి తీసుకపోతుంది. దీన్ని అమెరికాలో తయారు చేస్తున్నారు.

అప్పారావు తలలో ఏవేవో ఊహలు ఇంద్రధనుస్సులా మెరిశాయి. వెంటనే వాడు 'అయితే ఆ రాకెట్ ఎక్కాలంటే మనం అమెరికా వెళ్ళాలాండి...'అన్నాడు.

మాష్టారు 'ఔనురా...అది ఎక్కాలంటే మనం అమెరికా వెళ్ళవలసిందే...'

క్షణం ఆలస్యం చేయకుండా అప్పారావు 'అమెరికా ఎక్కడుందండి మాష్టారు...' అన్నాడు. వాడికి వెంటనే అమెరికా వెళ్ళిపోవాలనిపించింది. ఆ సమయంలో ఆ రాకెట్లో కూర్చొని, చంద్రమండలానికి ఎగిరి పోతున్నట్టే వాడికనిపించింది.

'లండన్ మీదుగా వెళ్తే అమెరికా మనకు సుమారు పదివేల మైళ్ళదూరాన ఉంటుందిరా......విమానంలో ప్రయాణం చేస్తే మూడునాలుగురోజులకక్కడకు చేరుకోగలం. ఓడలో అయితే సుమారు పాతిక రోజులుపడుతుంది.

వెంటనే అప్పారావు, 'మరి మనం విమానం ఎక్కాలంటే ఎక్కడ ఎక్కాలండి? మనఊళ్ళోకి వస్తుందాండి విమానం?' అన్నాడు.

ఈ మాటలకు మాష్టరుగారు నవ్వుకున్నారు. తియ్యగా, 'మనఊరిలో విమానం ఆగదురా...అది విమానాశ్రయాలుంటేచోటనే ఆగుతుంది. పెద పెద్ద పట్టణాలు, మహానగరాలు ఉండేచోట విమానాశ్రయాలుంటాయి. మనం విమానం ఎక్కాలంటే బొంబాయికాని, మద్రాసుకాని వెళ్ళి ఎక్కాలి. దీనంతటికీ బోలెడు డబ్బవుతుంది. అసలు మనం బొంబాయి వెళ్ళాలంటేనే ఎంతో అవుతుంది.' అని ఆయన ఆగిపోయారు.

అప్పారావు, 'ఎం తవుతుందండి...?' అన్నాడు. వాడికి తొందర ఎక్కువయింది.

'చాలా ఔతుందిరా...ఎంతో జాగ్ర

త్రగా మనం డబ్బు కూడబెడితేనేగాని ఇలాంటివింతలు మనం చూడలేదు...'

ఎంతవుతుందో తెలుసుకోవాలనే కుతూహలం అప్పారావు మనసులో తాటిచెట్టంత ఎత్తున పెరిగింది. మాష్టరుగారివైపు తిరుగా చూసి, 'అసలెం తవుతుందండి...' అన్నాడు.

మాష్టారు వాడివైపు సూటిగా చూసి, 'ఏం నీకు వెళ్ళాలని ఉందేమిటిరా...బాగా డబ్బు కూడబెట్టు. పెద్దయిం తరువాత వెళ్ళువు గాని...' అని, 'గోరీపాడు వెళ్ళాలంటే పడవకు పావలా పుచ్చుకుంటారు తెలుసా...' అని ఆగిపోయారు.

'అవునండీ ....అక్కడనుంచి జట్కా ఎక్కి ఊళ్ళోకి వెళ్ళేందుకు అరణాలు పుచ్చుకుంటారు. అక్కడనుంచి బస్సెక్కి పట్నం వెళ్ళేందుకు రూపాయిపావలా పుచ్చుకుంటారండి.'

'ఔనురా...మరి ఆ రోజున పట్నంలో భోజనాలకు, రిక్షాలకు, రైలుస్టేషనులో కూలీలకు కొంత డబ్బవుతుంది. కాలుతీసి కాలు పెట్టాలంటే డబ్బు మంచి నీళ్ళలా ధారపొయ్యాలి. అక్కడనుంచి సుమారు రెండు మూడురోజులు ప్రయాణంచేస్తేగాని బొంబాయి చేరం. బొంబాయికి టిక్కెట్టే రు-25/ లేక 30/- రూపాయిల మధ్య ఉంటుంది.

'అయితే మాష్టారూ...మొత్తం ఓ వంద రూపాయి లుంటె సరిపోతయ్యాండీ ...' అప్పారావు వందరూపాయిలైతే ఎలాగైనా సంపాదించెయ్యగలనన్న ధీమాతో మాట్లాడేశాడు.

మాష్టరుగారు పకపకనవ్వారు. ఓరి పిచ్చి పుల్లయ్యా...విమానం ఊరికే ఎక్కనిస్తారనుకున్నావటరా... బొంబాయిలో విమానం ఎక్కి అమెరికా వెళ్ళేందుకు అయిదారు వేల రూపాయిలకు తక్కువ అవదు. మీ ఇంటినీ, మీ పొలాలనూ అమ్మితే అందులో సగంరాదు. ఇక కొన్నిలక్షల మైళ్ళదూరాన ఉన్న చంద్రమండలానికి రాకెట్ లో ఎగిరి వెళ్ళాలంటే కొన్నిలక్షల రూపాయిలవుతాయి తెలుసా...అంతడబ్బు నువ్వెక్కడినుంచి తేగలవు?

అప్పారావు తల ఈ మాటలతో గిర్రున తిరిగింది. అయ్యబాబో...అంత డబ్బేనండి' అన్నాడు ఎంతో నిరుత్సాహపడిపోయాడు.

'అవునురా... ఎంతో డబ్బుంటే గాని ఇలాంటి వింతలు చూడలేం. అయినా ఇంకోమార్గం లేకపోలేదు. దానికంత డబ్బు అక్కర్లేదుకాని, కనీసం కొన్నివేల రూపాయిలైనా ఉండాలి'

నిరాశపడిపోయిన అప్పారావుతో మళ్ళీ ఆశలు చిగురించాయి. 'అదేమిటండి మాష్టారు...' అన్నాడు.

'నువ్వు పెద్దపెద్ద చదువులు చదివితే శాస్త్ర విజ్ఞానంలో డిగ్రీలు సంపాదిస్తే అప్పుడు మన భారతప్రభుత్వమే చంద్రమండలంలోని వింతలు పరిశీలించి ప్రజలకు చెప్పేందుకు నిన్ను తమ స్వంత ఖర్చుమీద పంపిస్తుంది. అప్పుడు నువ్వు అలాంటి రాకెట్లు మన భారతదేశంలోనే తయారయ్యేట్టు కృషిచేసే ప్రజలు మరింత సంతోషిస్తారు. ఇక ఈ ప్రయాణం కోసం అప్పుడు ఎవ్వరూ అమెరికా వెళ్ళనే అక్కర్లేదు. కాని ఇదంతా జరగాలంటే పెద్ద పెద్ద చదువులు నువ్వు చదవాలి కదా! అందుకు కొన్ని వేలైనా అవుతుంది. చూశావా డబ్బు విలువ! అది లేనిదే ఏ పనీ జరగదు. మీ నాన్నను బాగా డబ్బు కూడబెట్టమను. మీ నాన్న అనవసర ఖర్చులకు డబ్బు పాడుచేస్తూ వుంటే, 'నేను పైచదువులు చదవాలి...డబ్బు అనవసరంగా ఖర్చుపెట్టకు నాన్నా...' అను. ఆయన నీకోసం, నీ బాగుకోసం తప్పకుండా తన దూబరా ఖర్చులు తగ్గించుకుంటాడు. అయినా, మీ నాన్నగారు అనవసరంగా ఖర్చుపెడ్తే మనిషి కాదనుకుంటాను' అన్నారు.

ఈ మాటలు వింటూంటే అప్పారావు ఏదో తప్పుచేసినవాడిలా బాధపడిపోయాడు. 'ఇకెప్పుడూ దూబరా ఖర్చు చేయకూడదు ఒక్క దమ్మిడీ అనవసరంగా పాడుచేయకూడదు. పైచదువులు చదవాలి. డిగ్రీలు సంపాదించాలి. చంద్రమండలానికి ప్రయాణం చెయ్యాలి' అనుకున్నాడు.

అంతే......

అప్పటినుంచీ అప్పారావు ఎప్పుడూ పుస్తకాలు కాని బట్టలు కాని చినిగిపోనివ్వలేదు. పెన్సిళ్ళు పారవేయలేదు. హోటలు తిండితినలేదు. సిగరెట్లను ముట్టుకోలేదు. ★



కందుకూరి లింగరాజు

సమర్పణ

[గతవారం తరువాయి]

అప్పటి కప్పుడే యావత్ భారతదేశం అట్టుడికినట్టుడికిపోతున్నది. శాంతివిప్లవ ఝంఝామారుతం చెలరేగిపోతున్నది. అటు హిమాలయాల మొదలు ఇటు కన్యాకుమారి వరకూ ప్రభుత్వోల్లంఘన కార్యక్రమమే. స్వాతంత్ర్య ఘోష ప్రళయ మారుతంలా ప్రతిధ్వనిస్తోంది. ఎక్కడచూచినా త్రివర్ణ పతాకాలు, చరఖా ఉద్యమాలు, సత్యాగ్రహులు, దేశసేవికలే! పత్రికల్లో 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు' అన్న నినాదాలు మిన్నుముట్టసాగాయి! అటు అగ్రనాయకుడు గాంధీమహాత్ముని మొదలు, మోతిలాల్, జవహర్‌లాల్, పటేల్, పంత్, జిన్నా, మహమ్మద్ ఆలీ సోదరులు ప్రకాశం, సీతారామయ్య, సాంబమూర్తి, నాగేశ్వరరావు, వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణ, గోపాలకృష్ణయ్య మొదలైన మహానాయకులు ఉద్రేకపూరిత ఉపన్యాసాలతో పత్రికలు నిండిపోతున్నాయి; సభావేదికలు మారుమ్రోగుతున్నాయి.

ఏదో, ఎక్కడో ఆ కాంగ్రెస్ సంస్థ పనిచేస్తోంది, ఓ పదిమందిచేసే ఈ కుంజేటి చప్పుళ్ళకు ప్రభుత్వం లొంగుతుందా అన్న ఉద్దేశ్యంలో మొదటవున్న వాళ్ళందరూ కూడా ఉద్రేకాన్ని ఒదులుకోలేక, స్వాతంత్ర్య జ్యోతి వెలుగులకు దోసిలి ఒగ్గారు. దింతో వూరవూరా, వాడవాడా కూడా కాంగ్రెసు పరివారంగా ఏర్పడిపోయింది; విజృంభించిన బడబాగ్నిలా అది ప్రాకిపోయింది.

చరిత్ర ఘట్టాలు పురాణాలైపోయేయి. కవులు, గాయకులు ఉద్రేకపూరితమైన ద్విపదల్లో దేశభక్తి, త్యాగం నింపి రన్న గాసేసేరు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలే రాజకీయాలు, రాజకీయాలే ప్రజగా మారిపోయిందనవచ్చు. ఇంటింటా కాంగ్రెసును పసుపు కుంకుమలతో ప్రజలు పూజించసాగారు.

వెంకటప్పయ్య పూర్తిగా చెట్టుక్రింద ప్లీడరీ వదిలి వేసేడు. సత్యాగ్రహంలో ఒక దళానికి నాయకుడే అయిపోయి, స్వయం మర్చిపోయేడు; తన కూతురు రమణమ్మ, అల్లుడు అవధాని కూడా మొదట్లో సుఖంగానే కాపురం చేస్తున్నారు, ఆ ఉద్యోగంలో సంపాదించే రాళ్ళమీద అనుకుని తృప్తిపడ్డాడు. కాని అన్యాయానికి బలియైపోయి ప్రభుత్వానికి ఊడిగంచేసే బానిసలు కాకుండా ధరరపుచేసినా, వాళ్ళకు జీవనోపాధి కల్పించవలసిన బాధ్యత తనమీద పడిందేమో అన్న ఊహా అతడికి కలుగలేదు. ఏనాడైతే అవధాని, తండ్రి ఇంట్లో లేనిసమయంలో చిన్న అన్నగారితో పేచీపడి శచిని బలవంతంగా బయటకు తీసుకువచ్చాడో ఆనాడే మళ్ళీ ఆ అల్లుడికి కాని, కూతురుకు గాని, శచికిగాని ఆ ఇంట్లో పునః ప్రవేశానికి తావులేదు అనే విషయం తేలిపోయింది. గత్యా గత్యా ధైర్యంచేసి వాళ్ళు వెళ్ళినాకూడా గోంజాదాటి లోపలికి సోమయాజులు రానివ్వడనికూడా స్పష్టపడింది.

అంచేత వీళ్ళిద్దర్నీ కూడా రాజకీయ లంపటాల్లోకి దిగనివ్వకుండా వుంచడం సమస్యే అయ్యింది. పైగా ఎన్ని చెప్పినా ఎంత దేశభక్తి ప్రదర్శించినా, తను వీటిలో కాలెట్టిన దగ్గర నుంచి బావుకున్నది ఏమీ లేదు. నుంచుంటే, కూర్చుంటే కదిలే, మాట్లాడితే పోలీసుల నిఘా తప్ప మరేమీ లేదు. దీనికి తోడు దేశభక్తి భిక్షాటనం ఏవిధంగాను ఉత్సాహజనితంగా ఉండటంలేదు. స్వంతంగా ఎవళ్ళు కావక్కానివాడికో ఈశ్వర హారాలుగాని, అన్యులకు తగునా అన్నట్లు వెల్లడి అవుతూవుంది.

ఇంక ఏరోజు, ఎక్కడ, ఏవిధంగా తల పగులుతుందో చెయ్యి విరుగుతుందో, కాలు కదల్చలేని స్థితి ఏర్పడుతుందో, లేక, కటకటాల మధ్య ప్రభుత్వపు పం కూడుకు అతిథి అవుతాడో తెలియని దినచర్య అడుగడుగూ ఒక గండంగా తయారవుతూనే వున్నది.

తనలోతాను ఈ సింహావలోకనం చేసుకుంటూ వుండగానే వెంకట్రామయ్య అదృష్టమే అన్నట్టే ఆవూరి జమిందారుగారు, 'మా వూళ్ళో బడిపంతులు కరవైంది ఎవర్నైనా చూచిపెట్టండి' అని అడగడం జరిగింది. అంగలేసుకుంటూ అవధాన్ని అంచీలమీద పిలిపించడంకూడా పూర్తి అయింది.

అన్ని దృక్కోణాల నుంచీగాక, వయస్సులోకూడిన అనుభవం దృష్ట్యా చూసినా "ఇప్పటిపరిస్థితులలో ఇదేమంచిది" అని చెవులు దిబ్బడవేసేటట్లు నూరిపోసేరు అవధానికి. అవధాని ససేమిరా అనెయ్యడం. రమణమ్మ మొరాయించడం, శచి తిందాన తాన అన్నట్లు తలూపడంవల్ల "మీ ఖర్మం!" అనెయ్యవలసి వచ్చింది. తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్న అవధాని రాజకీయ ప్రవేశ కుతూహలానికీ, ఉత్సాహానికీ దాసోహం అనేసేడు.

ఆ మర్నాడు ఉదయం లోపల్లోపల వెంకట్రామయ్య భయాందోళనలమధ్య వూగులాడుతూ కన్నప్రేమ, అభిమానం

తోనే వారిని తన శిబిరంలో వుంచుకోవడం కన్న ఉపాధ్యాయ పంపించడం మంచిదని ఆయనకు తోచింది. సహచరుడు రామనాథం వారికి తోడునీడగా వుంటాడుకదా అనిపించింది. ఆఖరుసారిగా శచిని పిలిచి "తల్లీ! నువ్వు రాజమహేంద్రవరం ఆశ్రమంలో వుండడం మంచిది. అక్కడకు పంపుతా" అని ఎన్నో విధాల నొక్కి చెప్పేడు. ఇవన్నీ వినన్లే శచి "మంచికో, చెడ్డకో ఇల్లు విడిచి వచ్చేసేను; దానికి కారణం నేనేనా కావచ్చు; లేదా, అన్నయ్యేనా కావచ్చు. అల్లాంటప్పుడు అన్నయ్యా, వదినల్తో నే జీవితం గడుపుతాను. వారినీడన వుండడమే సమంజసం కూడాను." అంది.

"మీరన్నట్లుగానే వెళ్ళి శరణాలయంలో చేరితే, నా సౌఖ్యం, భావి చూచుకునే స్వార్థం నాలో రూపొందవచ్చు; కాదంటారా?

"అటువంటప్పుడు, ఈ కించిత్తు సుఖానికి ఆశపడి, దేశంపట్ల విధ్యుక్తధర్మం వదిలి వేయమంటారా? ఎందుకు ఈ ఉద్యమాలు ప్రారంభింపడమో, వాటి పర్యవసానం ఏమవుతుందో అన్నది ఆలోచిస్తూ కూర్చోవడం వల్ల మానవత్వం నశిస్తుందేమో? మన కర్తవ్యం మనం ఫలాపేక్ష లేకుండా చెయ్యడమే ఉత్తమం. అందుకు నన్ను ఒదిలిపెడతారని ఆశిస్తున్నా," అంది శచి.

వెంకట్రామయ్య, అవధాని, రమణమ్మ కూడా తెల్లబోయేరు! ఆనందం ఉక్కిరిబిక్కిరి అయితే, రమణమ్మ ఒక్క ఊపున వెళ్ళి శచిని కావలించుకుంది.

ఆ అపూర్వ చైతన్యంలో వాళ్ళు పరవశులైపోయారు; మూగా అల్లుళ్ళ గొంతుకలు మూగడిపోయాయి. ఒకళ్ళవైపు ఒకళ్ళు చెదిరిన కళ్ళల్లోంచి చూసుకున్నారు. కొన్ని క్షణాలు గడిచేక "అల్లాగే కానియ్యమ్మ" అనగలేదు వెంకట్రామయ్య.

ఒక్కసారి పాదాభివందనం చేసి "మామయ్యగారూ దీవించండి" అనేసింది, శచి.

"చరిత్రలు పునఃస్మరణ చేసుకుంటాయా?" అన్న సందిగ్ధ ప్రశ్నకు ఈనాటి శచి నిర్ణయం సదృశమైంది.

అల్లా సాగనంపి, పొలిమేరవరకూ వెళ్ళి వచ్చిన వెంకట్రామయ్యకు ఇంటి గుమ్మం మెట్లు ఎక్కేసరికి, ఆఫీసుగదిలో ఎవరో కూర్చున్నట్లు తనకోసం వేచి వున్నట్లూ కన్పడింది.

జోళ్ళువిడచి "ఎవరూ?" అని పలకరించాడు.

"నమస్కారాలు ప్లీడరుగారూ!" అన్నాడు కాస్త రాజకీయిలో సూరపరాజు.

వినువెంటే అణువణువూ శ్రీభవించినట్లు నమస్కారాలు చేస్తూ రంగాచారి, చినరెడ్డి లేచి నుంచున్నారు.

ఉత్పాతంగా గాలి అన్నివైపులనుంచీ ఒక్కసారి వచ్చినటు వెంకట్రామయ్యకు తటేంది. ఈ త్రిపాద నక్షత్రాలు ఎందుకు వచ్చేయి? ఎవరి పుట్టి పుణకడానికో నన్న సంశయం ఆయనకు కలిగింది. అవధాని సూచనప్రాయంగా చెప్పిన మాటల ప్రకారం వీళ్ళందరూ ఏదో ఎతుమీదే వచ్చివుంటారనీ అటు బావగారికి ఎల్లాగైనా సామ్రాజ్యపతనం చేయించాలన్నదే వీరి పట్టుదల అయివుంటుందనీ వెంకట్రామయ్యకు అనుమానం ఏర్పడింది.

"కూర్చోండి! అంతా క్షేమమా? దారి తప్పి వచ్చినట్లున్నారు పెద్దలు?" అన్నాడు.

"ఎంతమాట! పెద్దలం మేంకాదు వెంకట్రామయ్యగారూ! మీలాంటి సోమయాజులు గారి లాంటి వాళ్ళను చేర్చడానికి అవ్వ తవుంది కాని మాలాంటి అల్పులు... అని రంగాచారి అంటుంటే, ఆ అల్పులు అన్నమాట రావడంతో సూర్పరాజు కొరకొరా చూడగానే నోరునొక్కుకున్నాడు రంగాచారి.

"అయితే మమ్మల్ని పెద్దల్లో జమవేస్తావంటావు? అంతేనా చారీ?" ముదలకించేశు వెంకట్రామయ్య, ఓ పెడ వెటకారంగా నవ్వుతూ.

"ఎప్పుడూ ఇంతేనండి! వసపోసిన వాక్కాయలా వాగుతూ వుంటాడు చారి!" అని సర్దిబోయినట్లు రెడ్డిమధ్యలో సర్దబోయేడు.

"ఏంపనిమీద వచ్చేరో చెప్పేరుకాదు రాజాగారూ?" అని విషయంలోకి దిగిపోయేరు వెంకట్రామయ్య.

"ఏముంది! ఓ చిన్న దావావుంది వకాల్తా ఇదామని వచ్చేం."

"క్రిమినలా లేక సివిలా?"

"క్రిమినలే లెండి."

"కోర్టుకు వెళ్ళడం మానేసేనుకదా మరి. ఇంకొకళ్ళదగ్గిరకు వెళ్ళండి."

"అల్లా అంటే ఎల్లాగా? కాంగ్రెస్‌దారి కాంగ్రెస్‌ది; ఉద్యోగధర్మందారి ఉద్యోగధర్మానిది. అల్లా శెలవిస్తే ఎల్లాగ చెప్పండి!" అని తిరిగి రంగాచారి అన్నాడు. అందులో ఒకళ్ళిద్దరి దగిరకువెళ్ళి ఒట్టిముఖాల్తో వచ్చినట్లూ తేటతెల్లమైంది వెంకట్రామయ్యకు.

"పాడుకుపాటి సాంబశివరావు క్రిమినల్లో గట్టిచెయ్యి రాజాగారూ?"

"వారు కేసుపట్టనన్నారండి."


"ఏం? తీరా ఎవరిమీద?"

సమాధానం సూటిగా చెప్పకుండా:

"రాజాగారూ, రెడ్డిగారు ఫీజెంతైనా సరే ఇవ్వడానికి తయారుగా వున్నారు. మీరు ఒప్పుకుంటే బజానా క్రింద సగం ఇప్పుడే గుమ్మరించడానికి సిద్ధం మేము," అన్నారు మళ్ళీ రంగాచారి.

"అల్లాగా!" అని దీర్ఘంతీస్తూ, "అసలు ఏమిటో చెప్పేరుకాదే!" అని ప్రశ్నించాడు వకీలు.

"ఆ విషయం చాలాచిన్నదే. ఏదో పొలాల సరిహద్దుల్లో రేగిన తగాదా, పసువుల్ని బందెలోకి తోలడం, పోలీసులకు దరఖాస్తుపెట్టడంతో ప్రారంభమై దొమ్మీలతో అంతమైపోయింది. అందులో మావాళ్ళకు బుర్రలే పగిలిపోయేయి! అన్యాయంగా ఎవరివాగు రిపోరుకూడా మామీద ఇచ్చేరు...ఇక మీరు ఊ అనడం, సంగతి సంపర్కాలు వివరించి కావలసిన కాగితాల



పిల్లికి చెలగాటము ఎలకకు ప్రాణ సంకటము

ఇంత మంచి కోటు నాకు ఎలా వచ్చిందనుకొంటున్నారా? ఐతే వినండి. నా యజమాని బట్టలను పేరుపడ్డ దర్జీల దగ్గరే కుట్టిస్తారు. కాని బట్టను కొనేటప్పుడు మరియు కుట్టి తయారుగా ఉన్న దుస్తులను కొనేటప్పుడు ఆయన 'సాన్ఫొరైజ్డ్' లేబిలు చూసి కొనరు. ఆయన ఎప్పుడూ అలాగే అజాగ్రత్తగా ఉండాలి, ఆయన దుస్తులన్నీ ఎల్లప్పుడూ అలాగే చాలనట్లుగా క్రుంగిపోవాలి అని నా ప్రార్థన. కాని ఆయన కొనే ప్రతి గజము మాలు బట్టమీద, కుట్టితయారుగా ఉన్న దుస్తుంమీద 'సాన్ఫొరైజ్డ్' లేబిలుచూసి కొంటే వాటిని ఎన్నో సార్లు ఉతికినా కూడ అవి చాలనట్లుగా క్రుంగనే క్రుంగవు. కాని నా పని హుళక్కి అవుతుంది.

లేబిలుమీద

·SANFORIZED·
REGD TD MK

గుర్తు ఉన్నదా అని గమనించండి
అలా చేస్తే మీ దుస్తులు చాలనట్లుగా
ఎన్నటికీ క్రుంగవు!

రిజిస్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్ పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఏ.లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది. ఈ కంపెనీ యొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లు క్రుంగకుండా ఉండే బట్టంమీదనే 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము.

వివరములకు: 'సాన్ఫొరైజ్డ్' సర్వీస్,
95, మెరీన్ డ్రైవ్, బొంబాయి-2.

SAN 58-4 TE

మీద పంతకాలుపెట్టడం తర్వాయి." రాజా శిరః కంపంచేశాడు: రెడ్డి తన దృష్టిని ఆచారి మాటలమీద కేంద్రీకరింపజేసి చిరు నవ్వుల్తో "షభాష్ బాగాచెప్పేవు చారి" అన్నాడు. దీంతో వెంకట్రామయ్యకు అను మానంతట్టింది.

వెనువెంటనే శాస్త్రిగారిపూరూ, అక్కడి మనుష్యులు, మోతుబర్లు జ్ఞాపకంవచ్చేరు. వీళ్ళకు ఎదురుగా నిల్వడంమాట ఎల్లావున్నా లేచి మీసం దువ్వే మొనగాడు లేనే లేడు! అలాంటప్పుడు వీళ్ళని చితకగొట్టి చెవులం మూసేవాడు కన్పించటం లేదు!

క్షణం శ్రీపతి ఎక్కువా వెంకటస్వామి మడతతో ఏకమైచేసేడా అన్న భావం మెదిలింది. తను శ్రీపతిని ఉద్దేశించిన భావనలో అది నిలవనేలేదు.

మళ్ళీరంగాచారి "అందుకుంటూ" చూచేరూ! పాంబశివరావుగారు మూడు వందలేభీజు అన్నారు మొదట్లో. ఒప్పు కున్నాం మేము. తర్వాత చేతులారా నీళ్ళు పోసుకున్నారు. వరదరాజులనాయుడు రెండువందలకే వస్తానన్నాడుకాని పనలేని వకీలు అందువల్ల ఖరాఖండీగా చెప్తున్నాం. కేసుపట్టేటట్టయితే ఐదువందలివ్వడానికి, ఖర్చులుపెట్టుకోడానికి సిద్ధం. ఏమంటారు?"

అప్రయత్నంగా రెడ్డి ఓసారి చెయ్యి మొలమీద దోపుకున్న కాగితాలమడతల్ని తీస్తున్నట్లు నటించేడు. సూర్పరాజా "తియ్యి; బల్లమీదపెట్టెయ్యి" అన్నట్లు సౌంజ్ఞ చేసేరు.

క్షణం మనస్సు అటు ఇటూ ఊగింది వెంకట్రామయ్యకు. ఘర్మన చరచినట్లే వెనుక తన క్రిందవున్న ఇరవై మంది దళ వత్యులు వేసుకున్న కార్యక్రమం, న్యాయంలేని ప్రభుత్వంలో న్యాయం కోసం పోరాడ్డమేమిటి అన్న భావం, తాను బుద్ధిపూర్వకంగా వదులుకున్న పట్టా, స్ఫురణకు వచ్చేయి.

"అవానే! వాగ్దానం తీసుకున్నా రాజా గారూ మళ్ళీ న్యాయవాదానికి వెళ్ళి ప్లీడరీ పట్టా పుచ్చుకోనని..." అన్నాడు.

"ఇంతేనా?" అని నిలువునా కుప్ప కూలి పోయినట్లు వాళ్ళ మొఖాలు వ్రేళ్ళాడవేసి ఒకరి కేసి ఒకరు చూచుకున్నారు. త్రయం దిగాలు పడిపోయేరు!

"మీ పార్టీ ఖర్చుల క్రింద వెయ్యిరూపాయలు విరాళం ఇవ్వడానికి తయారుగా వున్నాము" అని సూర్పరాజా వదలలేని పగలో అన్నాడు.

"ఓ వేళ చిన్న వాయిదాలకు రాలేక పోయినా పర్వాలేదు. వాగ్వివాదాల సమయంలో ఆ సోమయాజులుగారిసాక్ష్యంతీసుకునే...చటుక్కున వాలిక కరచుకున్నాడు చారి...ఎగిరి గంతేసేరు వాళ్ళిద్దరూ.

ఒక్కసారి పెద్ద నవ్వు నవ్వాలనిపించింది వెంకట్రామయ్యకు తల పంకిస్తూ "ఇదా సంగతి?" అన్నాడు.

పాముల బుట్టలోని పాముల్లాగా ముడుచుకుపోయేరు త్రయం!

"సూర్పరాజుగారూ! ఒక్క విషయం మనవిచేస్తా వింటారూ? మీకంటే వయస్సులో కాస్తోకూస్తో పెద్దవాణ్ణికనుక ఇలా చెప్పడం అతిశయోక్తి కానేరదు.

అసలే ప్రభుత్వ పరిపాలనా పద్ధతి విభజించి పాలించు అన్నది. దీనికి అనువయంగా వాళ్లి చట్టాలు అన్నీ వున్నాయి. ఆఫీసర్లనూ సిబ్బందినీ ప్రోగుచేసుకున్నారు. ఒదుపు చూపుతున్న కేంద్రాల్లో పాంచిపెట్టేరు!

'అసలు మన గ్రామాలా—ఉంటే రెండు మూడు వేల జనాభాకు మించివుండదు. అందులో పగ, వైషమ్యం, ఈర్ష్య, చూపోపమి రగులుకుని మండిపోతున్నాయి' అంతః కలహాల్లో దగ్ధమైపోతున్నాయి! కాదంటారా?

ఒక్కటి ఆలోచించండి ఈ కలహాలు కక్షలు, పగలుకూడా ఏ గోటితోటి తీసేసే పరిస్థితిలోనో బీజం పొందివుంటాయి. దాన్ని రూపుమాపుకోవడంచేతకాక వెదురు పొదల్లా పెంచుకువస్తున్నారు.

ఇవన్నీకూడా త్రాడు తెగేదాకా లాగబడి, ఇల్లు వళ్లు గుల్లై ఆఖరుకు తిరిపమెత్తుకు తిరిగేవరకూ మనల్ని తెస్తున్నాయి. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకున్న వతులో అంతమవుతున్నాయి! ఒప్పుకుంటారా? క్షణం ఆగేడు. వాళ్లు ముగ్గురూ వింటూ వుండడమేకాని జవాబు చెప్పకపోవడంతో "లోకజ్ఞానం తెలిసినవారు ప్రాజ్ఞులు, పీటన్నిటివల్లా ఎవరికి ఏవిధంగా లాభం కల్గింది? ఎవరు సుఖపడారు! ఓనాటి అసభ్యము, ఒండొరుల ఎడగౌరవం ఏమై పోయింది? ఆలోచించేరా?"

ఆయన నా వియ్యంకుడనీ, నా కూతుర్ని ఆయన కొడుక్కు ఇచ్చేననీ ఇలా మాట్లాడ్డం లేదు. మనిషిని మనిషిగా చూచే ఇలా అంటున్నాను.

గత్యంతరం అయినకు ఏ శిక్ష వేయించడంవల్లో మీకేం వస్తుంది? కీర్తి ఇనుమడిస్తుందా? ప్రతిష్ఠ దేశదేశాల్లో చాటింపబడుతుందా? మీ గ్రామంలో మీకు అవిచ్ఛిన్న సామ్రాజ్యం వస్తుందా?

ఏమీ లేదు. ఒక్కి మీ ఆవేశంతప్ప. అంతే కాదంటారా?

ఓనాడు అనుకున్నా! మీలాంటి వాళ్ళందరూ, మీమీ కులప్రతిష్ఠల బిడ్డుబాటులో ఆ వూళ్ళో చైతన్యం కల్గిస్తారు, అమరత్వం సాధిస్తారనికాని...అది ఒక్కి ఆడియానే అయి పోయింది ఈనాడు..."

ములుకుల్లా తట్టేయి ఒక్కొక్క మాట. కూర్చున్న కవాచీబల్ల ముండ్లకంపే కాగా ఒక్కుమ్మడిగా లేచి.


"శెలవు" అంటూనే గుమ్మం దాటేరు.

మెట్లు దిగుతున్నపుడే వెంకట్రామయ్య రంగాచారిని పిల్చేడు:

"చారీ! నీ చక్రపొంగలి, దద్దోజనాల కోసం పండంటి ఊరును పాడుచెయ్యకయ్యా!" అనీ అనేసేడు.

గ్రుక్క త్రిప్పుకోలేకపోయేను చారి విడిపోతున్న గోచీని సర్దుకోకుండానే ఒక్క ఉదుటులో బయటకు గంతేసేడు.

—ఇంకా వుంది]





వనితాలోకం

బి. ఎ. పరీక్షకు మావారి చదువు...

మా వారు బి. ఏ. చదువుతూ వుండగా మా పెండ్లి అయింది. మావారు మా అత్తగారి మాటంటే అసలు వినిపించుకోరు. మా మామగారి మాటంటే మాత్రం చెప్పలేనంత భయం. వీధి గుమ్మములో మా మామగారి మాట విన్నారంటే దొడ్డి గుమ్మములోనుంచి మరి వెనుకకు చూడకుండా ఉడాయిస్తారు. వయసు వచ్చిందని అయితేనేమి, కోడలు వటింట తిరిగితే ఇంటికి మహాలక్ష్మి కళ వస్తుందని అయితేనేమి పెండ్లి చేశారు. అవి మావారు బి. ఏ చదువుతున్న మొదటి రోజులు, గనుక మా మామగారు ఏమీ మాటాడలేదు. క్రొత్తసంసారం ఏమంటారు లెండి! మావారుగూడ ఇదే సందని పుస్తకము కూడ ముట్టేవారు గాదు. నేను క్రొత్త పెళ్ళికూతుర్ని చదువుకోమని ఏలా చెబుతాను చెప్పండి! చెప్పినా వింటారు గనుకనా? పెళ్లయిన క్రొత్తగదా ఎల్లా చదవమంటావు చెప్పూ? పుస్తకంతీస్తే నీవే కనుపిస్తావు. నీ అందమైన 'ముఖము, నీ కళ్లు ఒకటేమిటి లెండి. వర్ణనలు కూడ కురిపిస్తారు రోజులు గడవకుండా ఎల్లా ఉంటాయి. మావారి పరీక్షలు దగరికి వస్తున్నాయి. మా మామగారు కఠినమైన ఆజ్ఞలను జారీ చేశారు. ఆ ఆజ్ఞలు మా వారికి మాత్రమే కఠినమైనవి లెండి! రాత్రి 12 గంటలవరకు చదవటం, నాతో మాట్లడటానికి వీలులేదు, సినిమాలకు వెళ్ళ రాదు, స్నేహితులతో అసమానా తిరగటానికి వీలేదు. వట్టింట్లో నిలబడి మా మామగారు అంటున్న ఈ మాటలు విని అన్నం తింటున్న మావారు ఒక్కసారిగా ఆముదము త్రాగిన ముఖముపెట్టి చూశారా! మా నాన్న అఘాయిత్యము అన్నటుగా నావైపు చూశారు. మా అత్తగారు అప్పుడే లోపలికి వస్తూ, 'అవును నాయనా కష్టపడి చదువుకో' అని అంటే, ఆవిడమీద కొంత వరకు కోపం వచ్చింది! అవును మరి కొంత భార్యను పక్కన ఉండగా, చిన్న పిల్లవానికి చెప్పినట్లు చెబితే కోపము కాదు మరీ! పాపం అందరం కఠినముగా ఉంటే కొంచెపడి చదవలేరేమోనని, చదువులో మధ్య ఒక్కసారి వారి దగ్గరకు వెళ్లి పరామర్శించటానికి మా మామగారి అజ్ఞ తీసుకున్నాను. ఒక రోజు ఆయన భోజనము చేసి చదువుకుందుకు కూర్చున్నారు.

నేను భోజనము చేసి మా అత్తగారితో కబుర్లు చెబుతూ మావారు చదువుకుంటున్న గదికి కొంచెదూరములో కూర్చున్నాను. మా వారి గదిలోనుండి గంటలోను మూడు, నాలుగు సార్లు దగు వినబడింది. కాని నేను

జి. సూర్యకాంతం

లేవలేదు. లేచి వెడితే చదువు పాడయి పోతుందని భయం. కాని ఆయన ఊరుకుంటేనా! మళ్ళీ దగు వినబడింది. ఇక పని గాదని వెళ్ళి చూద్దునుగదా! మావారి చేతిలో పుస్తకం లేదుగాని పూవులు నవ్వుతూ తమ పరిమళాన్ని గదిలో నలుమూలలా వెదజల్లుతున్నవి. కిటికీలోనుంచి పూర్ణచంద్రుని పరిహాసం చేస్తున్నారు. నాకు చాల కోపం వచ్చింది. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని భయమేమైనా ఉంటేగా! నన్ను చూడలేదుగదా అని వెనుదిరిగి రాబోతూ ఉంటే, ఎప్పుడు నాదగ్గరికి వచ్చారో గానీ పట్టుకొని నా తలలో పూవులు తురిమారు. నాకు కోపం వచ్చిందని తెలిసి చిరునవ్వు నవ్వేసరికి నాకు వళ్ళు మండింది. అత్తయ్యతోను మామయ్యతోను చెబుతానని భయపెట్టాను. కాని ఆయన వింటేనా! మాటాడకుండ కిందకు వచ్చాను. ఇంతలో మా మామగారి గొంతువిని మాటాడకుండ పుస్తకం తీసికొని వచ్చిన పాఠాలన్నీ ఏకరువు పెట్టేస్తున్నారు. మావారి చదువుచూచి చాలా నేను నవ్వుకున్నాను. మా అత్తగారు కొడుకుచదువు చూచి పొంగిపోయారు. కొడుకు పెద్దచదువు చదవటం ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి! పదిగంటలు కాగానే నేను పడుకున్నాను మావారు వచ్చి ఎప్పుడు పడుకున్నారో నాకు తెలియదుగాని ప్రొద్దున్నే మా అత్తగారు రాత్రి అబ్బాయి త్వరగా పడుకున్నాడు. మీ మామగారు చూడలేదు గనుక సరిపోయింది. లేకపోతే ఏం గొడవ జరిగేదో! అని అన్నారు. తొందరగా పడుకున్నారేమండీ అంటే నువ్వు పడుకున్నావు. నీకు భయమేస్తుందేమోనని పడుకున్నాను అని చిలిపిగా నవ్వారు. నేను లేకపోతే చదువుతారేమోనని మా పుట్టింటికి వెళ్ళాను. కాని మావారు చదివినట్లు ఏమీ కనబడలేదు. మామూలే! చదివేది ఆయనైతే నేనేమి చేయగలను చెప్పండీ! మా మామగారు బాగా ఆలోచించి కాలేజీకి దగ్గరలో గది తీసికొని కొడుకుని అందులో ఉంచారు. కొన్నాళ్ళపాటు చదువు బాగానే సాగింది. ఒక రోజు నేను నిద్రపోతూ ఉండగా నా మీద చిన్న చిన్న రాళ్ళు పడటం చూచి ఉలిక్కిపడ్డాను. లేచి కిటికీదగర ఎవరో నిలబడి ఉండటం చూచి నాకు ముచ్చెమటలు పోసాయి. అయినా ధైర్యం తెచ్చుకొని లైటు వేసికొని చూద్దును గదా! మావారే! ఆశ్చర్యంతో ఇదేమిటి అని అనబోతూంటే గట్టిగా మాట్లాడవద్దని వారించారు. తలుపు తీస్తే లోపలికి వచ్చారు. చదువుకోకుండా ఇల్లా వచ్చారేమిటని నేనంటే, అబ్బ!

(50 వ పేజి చూడుడు)

వనితాలోకం ప్రత్యేకవ్యాసం

కుటుంబ నియంత్రణ సమస్యలు

ముచ్చటగా ముగ్గురు పిల్లలతో-

శ్రీమతి విజయం

ఈ మధ్య మా స్నేహితురాలొకామె "మీకేమండి, ముచ్చటగా ముగ్గురు పిల్లలతో కాలక్షేపం చేస్తున్నారు. చేతులోని పని కాక వెంట వెంటనే బిడ్డలు పుట్టకుండా జాగ్రత్తపడుతున్నారు. మా ఆయన నడిగితే డాక్టరుగారు చెప్పక పోయారంటూ నిష్ఠూరంగా మాట్లాడింది.

ఆమెకిప్పుడు అయిదుగురు పిల్లలు. ఆఖరు పిల్లకు ఏడాది నిండలేదు ఇంకా. తిరిగి గర్భిణి. ఏటా కాన్పులతో ఆమె ఆరోగ్యం శారీరకంగాను, మానసికంగాను చెడిపోతోంది. ఎప్పుడూ పిల్లలను గురించిన ఆందోళనే. అలాంటి తలులకు నలుగిరిలో కులాసాగా తిరుగుదామన్నా, ఏ సినిమాకైన, క్లబ్బుకైనా వెడదామన్నా తీరిక ఉండదు. కనేదాకా కాన్పు గురించి బెంగా, భయం. ఆ తరవాత పెల పెలా మరోభయం. ఇట్లా నిరంతరం మానసిక వ్యథతో బాధపడే స్త్రీలను చాలామందిని చూస్తున్నాము.

మరొక గర్భిణీ స్నేహితురాలు కూడా ఇలాగే ఎకసక్కమాడింది. "డాక్టరు పెళ్ళాని కనక నీకీ అవస్థలు తప్పాయి" అని. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడికి 10 ఏళ్ళు. రెండవ అమ్మాయికి ఆరేళ్ళు, మూడవ దానికి మూడు. తల్లి పిల్లల ఆరోగ్యం సక్రమంగా ఉండాలంటే బిడ్డ బిడ్డకీ మధ్య 3-4 సంవత్సరముల తేడా ఉండటం అవసరం. ఏటా కాన్పులతో కృశించిపోతూ భగవంతుడిచ్చిన దానికి మనమేం చేస్తాం అంటూంటం పరిపాటి. బిడ్డలనిచ్చేది భగవంతుడైనా, పుచ్చుకునేది మనమే కనక, మన ఆర్థిక స్థితిగతులనుబట్టి ఎందరు పిల్లలు కావాలో, ఎప్పుడెప్పుడు కావాలో మనం నిర్ణయం చేసుకోవచ్చు. దీనికే 'ఫామిలీ ప్లానింగ్' లేక 'కుటుంబ నియంత్రణం' అంటున్నారు.

పూర్వం దైవాధీనమైనా, ప్రస్తుతం ఆధునిక వైద్య విజ్ఞానం పుణ్యమా అని ఫామిలీ ప్లానింగ్ చాలావరకు మానవాధీనమైంది. ఆ శక్తిని స్వాధీన పరచుకుని ఆచరణలో పెడితే, ఎప్పుడు ఎంతమంది కావాలంటే అప్పుడు, అంతమందే కలుగుతారు. పిల్లలెక్కువై ఆ కంగా అనుగంటే కుటుంబాల కేం. 'తీగకు కాయలు బరువా?—కాసిన చెట్టుకు నీరోయదా?' అనే సామెతలన్నీ అక్కరకురాని వెనకటి మాటలు. ముందెక్కువైతే మజ్జిగ పలచనేగదా? ఒక్కొక్క బిడ్డ ఇంటో పుట్టినప్పుడల్లా, ముందున్న పిల్లల ముద్దు ముచ్చటలు, సౌఖ్యం, చివరకు పోషణకూడ ఒక్కొక్క డిగ్రీ తగ్గుతూ ఉంటుంది. కారణం బిడ్డలతో మన ఆదాయం పెరగదు. పైపెచ్చు ఖర్చు పెరుగుతుంది. అసలు తల్లిదండ్రులకు ఒక్కొక్క బిడ్డ ఒక్కొక్క బాధ్యత గదా? అయితే ఇవి మితిమీరనప్పుడు ఆనందకరమైన బాధ్యతలు. మితిమీరితే బాధాకరమైన చిక్కులు తెచ్చిపెట్టగల సమస్యలు. మగపిల్లల చదువు సంధ్యలకు, ఆడపిల్లల పెండ్లి పేరంటాలకు ఉన్న ఆస్తిపాస్తులమ్ముకొని దివాలా తీసిన తల్లిదండ్రులెందరు లేరు? అలాంటప్పుడు బిడ్డలను గురించిన బాధ్యతలను, సమస్యలను మితంచేసుకోడానికి ప్రయత్నించడం తప్పు కాదు, సరికదా, అవసరంకూడా. కుటుంబ నియంత్రణం అవినీతికరమనే వారికి సమాధానం అనవసరం. అనుభవంమీద దాని ఆవశ్యకతను వారే గుర్తిస్తారు.

చాలామందికి కుటుంబ నియంత్రణం గూర్చి మనసులో ఒక భావన, బాహాటంగా మరొకటిగా ఉంటుందనుకుంటాను. ధైర్యంగా సంతాన నిరోధానికి తగు సలహా కావాలని అడగలేరు. తరతరాలుగా సంతానం భగవత్ప్రసాదితమని దాన్ని నిరోధించడం మహాపాపమనే భావం మనలో జీర్ణించుకు పోవడంవల్ల అలాంటి పాపకార్యం తల పెట్టామని ఇతరులు అనుకుని పోతారనే భయంతో ఆ విషయం స్నేహితుల నడగడం గాని, చర్చించడంగాని జరపరు.

ఎందరు బిడ్డలుండాలనేది ఎవరికి వారు నిర్ణయించుకోవలసిన విషయం. అది వారి ఆస్తి ఆదాయాలమీద ఆధారపడి ఉంటుంది. ముగ్గురు లేక నలుగురు పిల్లలు ఆదర్శప్రాయమని నేననుకుంటాను.

ఫామిలీ ప్లానింగుపై ఆసక్తి ఉన్నా దాని సాధన విషయం తెలియక చాలమంది బాధపడుతూ ఉంటారు. నన్ను వేళాకోళం చేసిన స్నేహితురాలిలాంటివాళ్ళే అసలు పురుషులైన డాక్టరు దగ్గరకెళ్ళి ఈ విషయంలో సలహా చెప్పమని అడగడానికి జంకుతారని విన్నాను. ఇక స్త్రీల సంగతి ఏంచెప్పేది? అదృష్టవశాత్తూ కుటుంబనియంత్రణ మొక్క జాతీయ ఆవశ్యకతగ ఈ మధ్య ప్రభుత్వం గుర్తించింది. అందుకనుగుణంగా ప్రచారం కూడ ప్రారంభమైంది. పెద్దపెద్ద పట్టణాలలోని వైద్యశాలల్లో ఫామిలీ ప్లానింగ్ క్లినిక్‌లు ప్రత్యేక లేడీ డాక్టర్ల ఆధ్వర్యంలో

ముగ్గురు పిల్లలతో...

నడిపిస్తున్నారు. అక్కడ స్త్రీలకు పరిపూర్ణమైన సలహా ఇవ్వడమే కాక, బీదవారికి అందుకు కావలసిన మందులు చవకగాను, కొన్ని కొన్ని చోట్ల ఉచితంగాను యిస్తున్నారట. స్త్రీల సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లో ఫామిలీ ప్లానింగ్ ప్రచారముకశాఖ. ప్రత్యేక డిపార్టుమెంటు లేనిచోట లేడీ డాక్టరు కావలసిన సహాయం చేస్తారు. లేడీ డాక్టర్లు లేని ప్రదేశాలు కూడ ఉంటయ్యి. అక్కడ మగవారు మగవైద్యునివద్దకు వెళ్లి ఈ పద్ధతులను గురించి అడిగి తెలుసుకోవచ్చును. డాక్టరే ఈ మందులు తెప్పించి యిస్తారు. అంతేకాదు చాలా ఆస్పత్రులలో బోర్డులు కట్టి ఉంటాయి. (Ask your doctor about planning your Family) "మీ వైద్యుని వద్ద కుటుంబనియంత్రణ సలహా కోరండి" అని. ఎవర్ని ఎక్కడ అడగాలనే సమస్య ఈ బోర్డు తీరుస్తుంది. సిగ్గుపడే వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి బోర్డులు కట్టారు.

ఇట్లాంటి అవకాశాలున్నప్పుడు వాటిని ఉపయోగించుకోకుండ పాలుపరి కాన్పులతో బాధపడడం అవివేకం కాగలదనుకుంటాను. ఇంకొక్క ముక్క. "మా ఆయన అడిగితే డాక్టరుగారు మందు చెప్పారు కాదు. అన్న మా స్నేహితురాలి విషయం ఆమె గర్భవతి అని ధృవపడిన తర్వాత ఆమె భర్త డాక్టరుగారి దగ్గరకెళ్ళి "పసిపిల్లలకేడాది వెళ్ళలేదు. దీనికేదయినా యింజెక్షనిచ్చి విరుగుడు చెయ్యమని" కోరారట. దానికాయన తిరస్కరించి. "ఇకముందిలాంటిది జరగకుండ మందులు చెప్పగలను కాని, జరిగినదానికి విరుగుడు చెయ్యడం తప్పు, హానికరం" అని సలహా చెప్పారట. ప్రతి డాక్టరు మీ ఫామిలీ ప్లానింగ్ కై సంపూర్ణ సహాయం చెయ్యడానికెల్లప్పుడు సిద్ధంగానే వుంటారు. ★

పరీక్షకు మావారి చదువు

(48-వ పేజీ తరువాయి)

పగలంతా చదువుతున్నాను చాలదా? వాళ్లతో పాటు నీవు కూడా అంటావా అని మంచం మీద పడుకున్నారు. మామగారు అక్కడకు వెళ్ళి చూస్తారేమో? అని నేనంటే వచ్చి వెళ్ళిపోయారు ఇంక రారు అన్నారు నే నేం చేయను. మాట్లాడకుండ లైటార్పి పడుకున్నాను. ఒక రోజు భోజనము చేసి రాత్రి చదువుకోవటానికి వెళ్ళారు. మర్నాడు ప్రొద్దున్నే మామూలుగా రాక పోయే సరికి అందరమూ కంగారు పడ్డాము. మా అత్తగారు భయపడి మామగారిని పంపారు. కొంతసేపటికి బండిలోనుంచి మా మామగారు దిగి మావారిని మెల్లిగా తీసికొని రావటం చూచి నోట మాటరాక నిలబడి పోయాము. లోపలకు తీసికొచ్చి పడుకో బెట్టాము. ఎప్పుడు తగిలిందోగాని జ్వరంతో మూలుగుతూ ఉన్నాడు అని అన్నారు మా మామగారు. చదువు సంగతి తర్వాత చూడచ్చు జ్వరం తగ్గితే అంతే చాలని మా అత్తగారు వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నారు. నేను ఏమనగలను. జ్వరం తగ్గితే అంతే చాలనుకున్నాను. డాక్టరుగారి మందులవల్ల కొద్దిగా తగ్గింది. ఒక నాడు మా వారు జ్వరం తగ్గలేదన్నారు. తగ్గింది కదండీ అని నేనంటే గట్టిగా అనకే మళ్ళి ఆకూపంలోకి తోస్తారు. నాకే చదువు వద్దంటే వినరు అని అన్నారు. మా వారి మాటలు మామగారు విన్నారు కాబోలు వీడికింక చదువురాదే, ఏదైనా ఉద్యోగంలో చేర్పితే బాగుంటుందే అని మా అత్తగారితో అన్నారు. మా వారు పరీక్షలు వ్రాశారు కాని పాసవుతారన్న నమ్మకం లేదు. మా మామగారి కష్టం ఫలించి అయితే నేమి? నా అదృష్టం బాగుండి అయితే నేమి రిజల్ట్సు రాకుండానే మావారికి ఉద్యోగం దొరికింది. చదువు తప్పింది గదా అని మావారు ఎగిరి గంతువేశారు. క్రమంగా రోజులు గడిచాయి. రిజల్ట్సు వచ్చాయి. మా మామగారు పత్రిక తీసుకొని నెంబరు ఎంతరా? అని అడిగితే మా వారు ఏమి మాటాడలేదు సరిగదా, గదిలో నుంచి ఊడిపడలేదు. ఇంతలో మావారి స్నేహితుడు పాస్ అయ్యావురా, టీ పార్టీ ఎప్పుడూ అని పరుగెత్తుకుంటూ వచ్చాడు. మా మామగారు అమాంతం పత్రిక క్రింద పడేసి జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకున్నారు. ఎల్లాగయితే నేమి మావారి "బి. ఏ." పూర్తి అయింది. మావారు చూశావా నా తెలివి అంటూ నావైపు కొంటెగా చూశారు. అందరం ఆనందించాము. ★

★ వేదాలలో మహిళలు ★

వీరంకి వెంకటరమణాదేవి

ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీన విజ్ఞాన దీపికలు వేదాలు. నేటివరకు భారతీయ స్త్రీలు ఏ మహోత్తర ఆదర్శాలపై నడుస్తున్నారో, ఆవే ఆశయాలకు పునాదులు వేశాయి వేదాలు. స్త్రీ సర్వశక్తి సంపన్నురాలని, అత్యంత శౌర్య ధైర్యవతి అని, అసమాన విద్యావిభూషిత అని, సహజ సౌందర్యగాంభీర్య వినయాదిసద్గుణశోభిత అని వేదాలు వర్ణించాయి.

వేదకాలపు స్త్రీలనుగురించి తెలుసుకోవాలంటే మానవస్త్రీ వర్ణనలే గాకుండా, మానవ నైజగుణాలను ఆరోపింపబడిన దేవతాస్త్రీవర్ణనలుకూడా తెలుసుకోవాలి. స్త్రీని అనేక రూపాలలో - కన్య, వధువు, భార్య, మాతృమూర్తి - వర్ణించాయి. వీటన్నిటిలో స్త్రీల సహజసౌందర్యం, సౌశీల్యం, సహనశీలత ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

మహిళకు మహిమ ఇచ్చేది ఆమె మందహాసవదనారవిందమే. మందహాసముల వర్ణనలెన్నో వున్నాయి "రూపవతులైన అంగనలు చిరునవ్వు లొలకబోయుచు సమాజసభాభవనానికి వెళ్లుతున్నట్లు" అనే వర్ణన ఒకటుంది. 'ఉష' సురూపవతి, పవిత్ర జీవి అయిన కన్యకగా వర్ణిస్తూ అందాలు చిందించే ఆమె చిరునవ్వును వర్ణించారు వైదిక ఋషులు. "పురుషుడు మృగప్రాయుడుగా, దుఃఖజీవిగా నశించకుండా నిలిపింది స్త్రీముఖంలో చిందులాడే చిరునవ్వే' అని అన్నాడు విఖ్యాత ఫ్రెంచి రచయిత అనటోలా ఫ్రాంసే.

నేత్రానందకరమైన దుస్తులతో, ఆభరణాలతో అందాలు ఒలకబోసుకుంటే స్త్రీ సౌందర్యరూపాన్ని ఎంతో రమ్యంగా వర్ణించారు. కొన్ని కొన్ని వస్తువుల అందాన్ని 'స్త్రీలలాగా ఎంతో అందంగా' 'ఇదగు కాంతులు తమ శరీరాలకు మెరుగులు దిద్దుకుంటున్నట్లుగా' "ఆభరణభూషితమై శ్వేత వస్త్రము ప్రదర్శించే వధువు' 'భర్తహృదయాన్ని రంజింపజేసే, అతడిలోని ప్రేమప్రవాహాన్ని ఉరకలెత్తించే మనోరంజక దుకూలాలు ధరించిన తరుణపత్నిలాగా' అని ఎన్నో పోలికలు చూపిస్తూ వర్ణించారు. జీవితం క్షణభంగురం అంతా నశించేదే, అని నిరూపించే శ్మశానవాటికను వర్ణించే ఘట్టంలో కూడా 'లేపన సుగంధాదులతో మూర్తి శోభను వెలిగించే ఆభరణాలు ధరించి, ఏ వాడు కంట తడిపెట్టని సభర్తృకను ముందు వేదిక నెక్కనివ్వండి' అన్నారు.

స్త్రీకి అందాన్ని ఇచ్చే రెండవ సద్గుణం 'లజ్జ' అని వర్ణించారు. ఏ మహర్షులయితే, ఆకాశానికి బిడ్డ, అవివాహిత, సుగుణశీల అయిన దేవిని తమకు జ్ఞానభిక్ష పెట్టమని, అలౌకిక భావనల నివ్వమని ప్రార్థిస్తారో, అటి కన్యకామూర్తి 'ఉష'ను 'పురుషుల ముందు ముఖం కనపడ నివ్వకుండా తలవంచుకొని నిలబడది' అని చిత్రించారు. అట్టి 'ఉష' ఈనాటికి స్త్రీజాతికి అలంకారమే గదా!

ప్రతి స్త్రీ జీవితంలో ఆనందమయఘట్టం వివాహం - అట్టి పెండ్లికూతురును వేదాల్లో అత్యంత హృదయ రమ్యంగా చూపించారు. 'సూర్య' దేవి వివాహం నేటికి ఆదర్శప్రాయ వివాహం, ఆమెను 'భర్తగుణగణాలను మనస్సులో ఆలాపించుకుంటూ' వుండే సౌందర్యరూపిణి అన్నారు. "సూర్యాదేవికి పాటయే చీర, ఆలోచనే శయ్యమీదనున్న దిండు, భూమ్యాకాశాలే ఆభరణాలు అని పెండ్లికూతురయిన 'సూర్య'ను వర్ణించారు.

వివాహయజ్ఞంలో వధూవరులు బాస చేస్తారు. పెద్దలు ఆమెను 'నీవిక నీఇంటికి వెళ్ళు. నీ ఇంటికి నీవు యజమానురాలివిగా పాలకురాలివిగా!' అని ఆశీర్వదిస్తారు. మా మనస్సులు, మా హృదయాలు ఏకంచెయ్యి. మాలో ఐక్యతాభావం చేకూర్చు' అని ప్రార్థిస్తారు. అథర్వవేదంలో వరుడు కవిత్వధోరణిలో 'నేను ఆకాశాన్ని, నీవు భూమివి... నేను పాటను, నీవు ఋక్గీతానివి' అని తన్మయుడౌతాడు. వేదాల్లో ఏకపత్నీవ్రతమే ఆదర్శంగా భావింపబడ్డది. 'ఎప్పటికి విడిపడకుండా, మీరిద్దరు సంపూర్ణ జీవితం జీవించండి, కొడుకులు మనుమలతో ఆడుకొని ఆనందాన్ని అనుభవించండి' అని ఆశీర్వదిస్తారు. భార్యాభర్తలను అశ్వినీ దేవతులకు పోలుస్తారు.

భారతదేశంలో ఈనాటికి స్త్రీ మానవతి మానరక్షణకోసం ప్రాణాన్నికూడా వదులుతుంది. 'మచ్చపడని జీవితమే' ఆమె ధ్యేయం. 'కుటుంబంలో పత్ని అందరికి ఆభరణం' అన్నారు వేదఋషులు. ఆమె సౌశీల్యాన్ని వర్ణిస్తూ "భగవానుని పరిశుద్ధత మచ్చలేని స్త్రీ సౌశీల్యంలాంటిది" అన్నాడు.

స్త్రీని మాతృదేవిగా ఎంతో ఉజ్వలంగా వర్ణించారు. రాత్రి, పగలు వర్ణనలో 'ఒక తల్లి విడిస్తున్నది, మరొక తల్లి బిడ్డను పాలిస్తున్నది' అన్నారు. సరస్వతిని 'అనంత సస్యవర్ధని'గా చెప్పారు. దేవత్వంఅంటే తల్లి అన్నారు. అశ్విని దేవతలను 'మనం చిన్న

న్యూఢిల్లీ లేఖ

(8-వ పేజీ తరువాయి)

దేశంలో మధ్య తరగతిని మధ్య తరగతి నాయకులే దుర్గతికి లాక్కుపోతున్నారు. పూర్వం రోమనులు మామూలు ప్రజలకు దైనిక కష్టాలు గుర్తురాకుండా చెయ్యటానికి సర్కసులూ అవీ ఏర్పాటు చేసేవారు. మన నాయకులు ఉత్సవాలు ఉత్సాహంగా జరిపించేస్తున్నారు.

ఇప్పుడు తక్షణం జరగవలసినపని రెండో ప్రణాళిక ఎలా అమలు జరుగుతోందీ నిష్పాక్షికంగా విచారణ చేయించటం. ప్రతి మనిషీ సక్రమంగా పనిచేస్తున్నాడా, పూర్వంకంటె ఎక్కువ పనిచేస్తున్నాడా, తక్కువ పనిచేస్తున్నాడా అనేది ఈ విచారణలో తేల్చాలి. శాస్త్ర పరిశోధనమీద భారతదేశం లక్షలకొద్ది ఖర్చుచేసింది. ఈ పరిశోధనవల్ల ఆహారోత్పత్తి, పంచదార ఉత్పత్తి పెరిగిందా తగ్గిందా విచారించాలి. ప్రభుత్వోద్యోగులు, ముఖ్యంగా తపాలా ఉద్యోగులు పని లోగడకంటె ఎక్కువచేస్తున్నారా, తక్కువచేస్తున్నారా విచారించాలి. అప్పుడు మనదేశం సాధించిన అభివృద్ధి బయటపడుతుంది. మొదటి రెండు ప్రణాళికలూ ఎక్కడ దెబ్బతిన్నదీ బయటపడుతుంది. అప్పుడు మూడవప్రణాళిక విషయంలో జాగ్రత్తపడవచ్చు. ప్రధానమంత్రి జన్మదినోత్సవంలో ఎన్ని స్కూళ్ళ పిల్లలు పాల్గొన్నారూ, లేక ఈ మధ్య ప్రభుత్వం ఎన్ని చక్కటి పుస్తకాలు అచ్చువేసిందీ అనేదికాదు ప్రణాళికా విజయాన్ని నిర్ణయించేది. ప్రజలసౌఖ్యం ఎంతవరకు పెరిగిందీ అనేదాన్నిబట్టె నిర్ణయించాలి. ఉపన్యాసవర్షాలు కురిపించటంవల్ల ప్రణాళిక నెరవేరదు. కష్టపడి పనిచెయ్యటమే తరుణోపాయం. దీనికి ప్రజలు సుశిక్షితులై, క్రమబద్ధులై ఉండాలి. ఇలా చెప్పడం ప్రజల్లో పలుకుబడి సంపాదించటానికి మార్గం కాకపోవచ్చును. పలుకుబడి ముఖ్యమా, అభివృద్ధి ముఖ్యమా కాంగ్రెసు తేల్చుకోవాలి. ఈ నిర్ణయంమీదనే దేశభవితవ్యం ఆధారపడి వుంది. ★

★ వేదాలలో మహిళలు ★

బిడ్డలైనప్పుడు మనకు ప్రాణాధారమైన తల్లి స్తనాలతో పోల్చారు.

ఇక తల్లిబిడ్డల మధ్యనుండే అలౌకిక సంబంధాన్ని 'అదిత్యమూర్తిని ఎంతో దగరిగా దర్శించాను. అశిశువును తల్లి ముద్దిడుతున్నది. తల్లిని ముద్దిడుకుంటున్నాడు ఆ చిన్నారి, అని ఆనందానుభూతిలో వర్ణించారు. స్త్రీ అందరికి-భర్తకు కూడా-తల్లే అనే భావాన్ని "పదిమంది బిడ్డలను ప్రసాదించు, భర్తను 11 వ బిడ్డగా చెయ్యి" అనే ప్రార్థనలో వెలిబుచ్చ బడింది.

స్త్రీ తల్లేగాదు, సహచారిణి కూడా. అథర్వవేదంలో దాంపత్యాన్ని చక్రవాక దాంపత్యం అన్నారు. అంటే చనిపోయే టంతవరకు అతర్వాతకూడా విడదీయలేని సంబంధం అని భావన.

స్త్రీ విద్యార్థినికూడా...అథర్వంలో "ఈ బాలిక బ్రహ్మచర్యదీక్ష కొనసాగిస్తే సర్వాంగ సుందరుడైన భర్తను పొందుతుంది" అంటాడు. 'గోష' అనే తరుణి జీవితంలో ఎంతో కాలం బ్రహ్మచర్యం అవలంబించి విద్యాధ్యయనం చేసింది. ఋషుల భార్యలు కూడా-అగస్త్యుని భార్య లోపాముద్ర భర్తలతో పాటు బ్రహ్మచర్య దీక్ష బూని తపస్సు చేశారు. ఆదర్శాన్ని అపాంతంగా పాటించింది బ్రహ్మవాదిని, రామకృష్ణ పరమహంసపత్ని శారదాదేవి.

మహిళ శాంత స్వభావురాలేగాదు, క్రోధారుణ నేత్రికూడా. అదే భావాన్ని మహావేశ పరవశుడై తనను సమీపించే తపశ్శాలి వృషాకపి అనే వానిని వీరనారి 'ఇంద్రాణి' తాను 'విరిణి' 'వీరమాత' అనీ 'నీ శిరస్సు ఖండిస్తా' అని కోపించింది. 'పాణులు' అనువారు 'శరమ' అనే స్త్రీ పశువులను దొంగిలించి తమ దగ్గర ఆయుధాలున్నవని బెదిరించారు. 'మీ దంబాలకు నేను భయపడను జాగ్రత' అని హెచ్చరించింది. అప్పుడువారు వినమ్రులై "అమ్మా! పొరపాటు చేశాము. నిన్ను మా సోదరిగా భావిస్తాము. నీ పశువులను నీకు తిరిగి ఇస్తాం...' అన్నారు. 'మీ సోదర వాత్సల్యం నాకేం అక్కరలేదు'. అన్నదట. బహుశా ఆనాటినుంచి నేటివరకు పురుషులు పరస్త్రీని 'సోదరి'గా సంబోధించటం ఆచారమయింది.

(శారదాదేవిశతసంవత్సర సంచికనుండి)

సమాధానాలు

1. స్వామీ సీతారామ్! పూర్వాశ్రమంలో శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి. గుంటూరులో న్యాయవాదిగా వున్నప్పటి చిత్రం.

2. ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు; విజయవాడలో న్యాయవాదిగా వున్నప్పటి చిత్రం.



కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరాగాంధి

శ్రీ ఢేబర్ స్థానంలో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలుగా శ్రీమతి ఇందిరా గాంధి ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఒక మహిళను ఎన్నుకోవడం దేశచరిత్రలో ఇది నాల్గో పర్యాయం. మొట్టమొదట ఈ ఉన్నత స్థానాన్ని అలంకరించినది శ్రీమతి అనీ బీసెంట్. ఆమె 1917 లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించింది.

తర్వాత శ్రీమతి సరోజినీ నాయుడు 1925 లో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అలంకరించింది. "నేను భారతగృహిణిని! గృహంలో ప్రతి భారతీయ గృహిణి సర్వస్వతంత్రాధికారిణి. భారతదేశమనే గృహం చక్కదిద్ది భారతీయులకు అలాంటి సమున్నత స్థానం సాధించడానికి ప్రయత్నిద్దాం" అని ఎలుగెత్తి చాటిన మహిళ శ్రీమతి సరోజిని.

ఇక పోతే మూడవ మహిళ శ్రీమతి నెల్లీ సేన్‌గుప్తా. ముందు సెన్‌గుప్తాను కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి ఎన్నుకున్నారు. ఆ మహనీయుడు మరణించినప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానవర్గం శ్రీమతి నెలి సేన్‌గుప్తాను ఆపదవికి ఎన్నుకున్నది. శ్రీమతి నెల్లీ సేన్‌గుప్తా జన్మతః బ్రిటిషు మహిళ.

నాల్గవ మహిళ శ్రీమతి ఇందిరాగాంధి. శ్రీమతి ఇందిరకు 42 ఏళ్ళ వయస్సు. నూతన దృక్పథం తీసుకురావడానికి ఈమె సామర్థ్యం ఉపయోగపడుతుందనే ఆశించవచ్చు. ★

వనితా వాణి



శ్రీమతి యిందిరా రాజ్ కుటుంబ నియంత్రణంలో "పెద్దవాళ్లు, ప్రతిబంధకాలు" గురించి వ్రాసేరు. రచయిత్రి విషయాలు చక్కగా ముచ్చటించేరు "అపుత్రస్య గతిర్నాస్తి" అన్న భావం వరపరాలకు పట్టిన భారతదేశంలో కుటుంబ నియంత్రణం అమలు పర్చడం తేలికైన విషయంగాదు. అయినా, ఈశకాల పరిస్థితులు ఆలోచించి, ప్రస్తుత సమాజంలో పిల్లల విద్యాభివృద్ధులు చెప్పించడానికి గాని, ఆడపిల్లలకు పెళ్లి చేయడానికిగాని ఉండే ఆటంకాలు, తర్వాత పడే మనోవేదన గుర్తుంచుకొని చాలామంది నవీన మధ్యతరగతి కుటుంబీకులు కుటుంబ నియంత్రణాన్ని సానుభూతితో ఆలోచిస్తున్నారు. ఇది ముదావహమైన విషయం. ఈ సమయంలో యీ క్రింది సమస్యలు రావచ్చు. (I) కుటుంబ నియంత్రణానికి ఎవరు ఆపరేషను చేసికోవాలి? స్త్రీలా? పురుషులా? అనుమానం మానవ సహజం. అందుచే అపార్థాలకి దారితీయకుండా ఇద్దరూ చేసికోవడం ఉత్తమం. (II) ఈ సంస్కరణ ఎక్కడనుంచి ఆరంభమవాలి? ధనవంతులకు ఫర్వాలేదు. ఎంత ఖరీదయినా పాల డబ్బాలు, మందులు మాకులు కొని పిల్లలను పెంచుతారు. పల్లెలలోనున్న కర్షకులలో కార్మికులలో యీ సంస్కరణ రావడానికి కాలంపడుతుంది. కాని యీలోపుల విద్యాధికులై పట్టణాలలోనుండి చాలీచాలని జీతపురాళ్లతో కుటుంబం పోషించుటకు అవస్థపడే మధ్యతరగతివారు ముందుకు రావడం అవసరం. దేశంలోని సంస్కరణలన్నీ మధ్య తరగతి వాళ్లనుండే ఆరంభమైన విషయం నిర్వివాద సత్యం.

అయితే ఒక్క విషయం; శ్రీమతి ఇందిరా రాజ్ వ్రాసినట్లు ఆమె ఆపరేషను చేయించుకొన్నదని ఇరుగు పొరుగువారు వేలెత్తి చూపించవచ్చు. దీనివల్ల మన శ్రాంతి దూరమయ్యే అవకాశం ఉంది. దీనికి ఒక్కటే మందు. గప్‌చిప్ ఏదో పనిమీద అప్పటికి వెళ్లినట్లే వెళ్లి పని కానిచ్చేయడం ......

ఆరోగ్యవంతులైన పిల్లలతో కలకలలాడే కుటుంబాలు దగ్గిరి భవిష్యత్తులో ఉంటాయని ఆశిస్తున్నాను.

—కటకం—2] —మధ్యతరగతి మనిషి]

*   *   *

బి. ఇందిరారాజ్ గారు వ్రాసిన "పెద్దవాళ్ళు, ప్రతిబంధకాలు" అన్న వ్యాసం చదివాను. వారు బహుసంతతివల్ల కలిగే సాధకబాధకాలను, మరియు పెద్దవాళ్ల "మూఢనమ్మకము"లను ఈ వ్యాసంలో చక్కగా చిత్రించారు. విషయాలను ప్రతివొక్కరూ పాటించి సంపూర్ణ సౌఖ్యము పొందగలరనీ, దేశాభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాను.

కే. వి. రఘు. హైదరాబాద్.



ఢిల్లీ ఆంధ్ర వనితా మండలి రజత వార్షికోత్సవం ఢిల్లీ ఆంధ్రపాఠశాలలో వైస్ అడ్మిరల్ రామదాస్ కటారి అధ్యక్షతన జరిగిన సందర్భంలో 'గోలభామ' నాట్యంలో పాల్గొన్న బాలికలు చావలి వసుంధర, మంత్రాల అన్నపూర్ణ.

ఆపరేషన్ జరిగినా....

శ్రీమతి ఇందిరారాజ్ తన స్నేహితురాలికి ఆపరేషన్ చేయించుకున్నాక ఒక పాప పుట్టితే "పతిత" అని తలిప్రోత్సాహంతో ఆమెను భర్త పుట్టింటికి పంపాడు అని వ్రాశారు. మాకు తెలిసిన ఒకకుటుంబం వుంది. వాళ్ళకు ముగ్గురుపిల్లలు. ఆయనా ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ చేయించుకున్నాకగూడ వాళ్ళకు ఇద్దరు పిల్లలు పుట్టారు! వ్యాసరచయిత్రికి నా అభినందనములు.

యల్. ప్రభారెడ్డి. బుచ్చిరెడ్డిపాలెం.

*   *   *

"పెద్దవాళ్ళు, ప్రతిబంధకాలు" అన్న వ్యాసం చాలా బాగుంది. బి. ఇందిరారాజ్ గారు చాలా విపులంగా వ్రాశారు. అధిక సంతానంవల కలిగే ఇబ్బందులు గురించి బాగా వ్రాశారు. వారు వ్రాసిన పద్ధతులు అందరూ ఆచరిస్తే దేహానికి ఆరోగ్యం దేశానికి సౌఖ్యం కలుగుతుంది. వారి సలహాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

బాదం వెంకటనారాయణ. పామూరు.

*   *   *

అత్తగార్ల ధోరణి మారాలి

"కుటుంబ నియంత్రణంలో "పెద్దవాళ్ళు. ప్రతిబంధకాలూ" అన్న వ్యాసం చాలా బాగుంది. బి. ఇందిరారాజ్ గారుదహరించిన విషయాలన్నీ చాలా సహజంగా యున్నాయి వారి అన్ని అభిప్రాయాలతో నేను ఏకీభవించుచున్నాను.

వారన్నట్టుగా, కుటుంబనియంత్రణ విధాన మవలంబించడం అన్ని విధాలా శ్రేయస్కరం. దీనిలోని బాగును గమనించి, పౌరులందరూ ఎక్కువమంది ఆచరించి, సౌఖ్యం (అన్నివిధాలా) పొందగలరని ఆశిస్తున్నాను.

కాని ప్రస్తుతంలో దీన్ని ఆచరించటానికి, పెద్దల ప్రతిబంధకాలెక్కువగా యుండటం శోచనీయం. మూఢనమ్మకాలలోపడి, "శిశుహత్య!" "ఏం మాయరోగమొచ్చింది!" ఇటువంటి పదాలతో పెద్దలు, దేశశ్రేయస్సును పాడుచెయ్యడం, విచారకరమైన విషయం. ఇందిరారాజ్ గారు వ్రాసిన వ్యాసంలోలాటి అత్తగార్లలో త్వరగా మార్పురావాలి. వారు అసలైన విషయాన్ని గుర్తించాలి. అత్తగార్లు, పెత్తనానికి మాత్రమే కాకుండా, కొత్తకొత్త మంచి

(62-వ పేజీ చూడండి)

★ మనిషివంటి మనిషి ★

(16-వ పేజీ తరువాయి)

రామ్మూర్తి వరసగా పట్టీప్రకారం చెప్పుకుపోయారు.

టాయిలెట్ వస్తువులు...
టెంపిన్,
గొడుగు,
కలం,
సంచీ,
బెలు...
షేవింగ్ సెట్,
మిర్రర్ లేక అద్దం...పెదది...

వగైరా...వగైరా...అన్నీ తీసి సంచిలో వేసుకొన్నాడు. అంతా కలసి డెబ్బైఐదు రూపాయలు! అక్కణ్ణుంచి బట్టలషాపుకు వెళ్లాడు. భార్యకు మంచి చీరలు...జాకెట్ గుడ్డలు వగైరా, తనకు రెండు మంచి చొక్కాలకు, ఫాంట్లకు గుడ్డ కొన్నాడు. అంతా గలిపి దాదాపు వందరూపాయ లయింది. డబ్బు జీతం రాగానే యిస్తానన్నాడు. షాపు యజమాని వారానికోసారి ఆఫీసుకువచ్చేవాడు..'సరేసార్'అన్నాడు.—నగలదుకాణానికి వెళ్లాడు—రెండువందలా ఏభైరూపాయల ఖరీదులో మంచి నెక్లెస్ కొన్నాడు. 'ఇంట్లోవాళ్ళ'కు నచ్చకపోతే మార్చుకోవటానికీ, వాయిదాలపద్ధతిని డబ్బు తీసుకోవటానికీ షాపు యజమాని అంగీకరించాడు.

అన్నీ తీసుకొని, రిక్షాయెక్కి ఇల్లు చేరుకొన్నాడు:

రామ్మూర్తినాన్న పడకకుర్చీలో కూర్చొని న్యూస్ పేపర్ చూస్తున్నవాడల్లా, నోరు తెరుచుకొని విస్మయంతో రామ్మూర్తిని చూస్తూ వుండిపోయాడు.

రామ్మూర్తి, భార్యను పిలిచి గదిలోకి వెళ్లాడు.

"ఇవన్నీ ఏమిటి ... ఎలా తెచ్చారు" అందామె.

ఇవన్నీ...బజార్లో తెచ్చానే...అప్పుచేసి...! నిదానంగా తీర్చుకోవచ్చు. తొందరేమీ లేదు. ఏదీ ఈ నెక్లెస్ వేసుకో...ఈచీర కట్టుకో...అబ్బ ఈ నెక్లెస్ ఎంత బావుంది నీకూ ... దివ్యంగా వున్నావులే! ఇవన్నీ తీసుకో! నీకు...ఇంకా ఏంకావాలో చెప్పు. రిక్షా ఇంకా అక్కడే వుంది. వెళ్ళి తెచ్చేస్తాను. ఇంట్లో ఎవరైనా ఏమైనా అంటే చెప్పు...చంపేస్తాను... ఇప్పుడూ... నేను మనిషిని. నేనూ మనిషివంటి మనిషినే! నాకూ తెలుసు... నీకేమేం కావాలో నాకు తెలీదూ! తెలుసు! నీకూ నాకూ కావలసినవన్నీ తెచ్చేశాను. ఇంకా ఏం కావాలో చెప్పు. తెచ్చేస్తాను. స్వార్థపరులవనీ, ఇంకా ఏమైనా అననీ... మనకై మిగిలిందే ఇంట్లో యిస్తాను..."


"ఏమండీ...ఏమైందిమీకు... మతి గానీ చలించలేదు కదా! అయ్యో! ఏమండో" ఆమె కంగారు పడుతోంది.

రామ్మూర్తినాన్న అక్కడికివచ్చి ఎట్టగా చూసి కళ్ళలో నిప్పులు కక్కుతూ.

"ఏమిట్రా—యివన్నీ! ఎంత తగలేశావు. ఎక్కడతెచ్చావు. చెప్పు" అని అరిచాడు.

"అప్పుచేసి బజార్లో తెచ్చాను" అన్నాడు ధీమాగా నిల్చొని మొదటిసారి సూటిగా తండ్రి కళ్ళలోకి చూస్తూ!

"ఏడిశావ్! నీకు మతిచెడిందిరా! హఠాత్తుగా ఏమీ చెడలేదు. రెండ్రోజుల్నించి చూస్తున్నా వాలకం. డాక్టర్ని పిలుస్తానుండు..." అని ఆయన గబగబా వీధిలోకి నడిచాడు. రామ్మూర్తి బిగ్గరగా నవ్వుతూ గంతులేశాడు. భార్యను కొత్త చీరచుట్టబెట్టి కౌగలించుకున్నాడు! ★



సినిమా

12 ఉత్తమచిత్రాలు

"కాలిగరీ"

(ఎక్స్‌ప్రెషనిస్టు చిత్రం)

మొదటి ప్రపంచయుద్ధం అయిపోయిన మొదటి రోజుల్లో ఓడిపోయిన జర్మనీమీద ఇంగ్లీషువాళ్ళకీ, ఫ్రెంచివాళ్ళకీ, గెలిచిన ఇంగ్లండుమీద, ఫ్రాన్సుమీద జర్మనీవాళ్ళకీ మహా కోపంగా ఉండేది. ఈ కోపం రాజకీయ రంగంలోనే కాదు, సినిమా రంగంలోకూడా కనిపించేది. జర్మన్ చిత్రాలను ఏమైనాసరే చూపించకూడదని, చూడకూడదని ఇంగ్లండు, ఫ్రాన్సుల్లో సినిమా ప్రదర్శకులకూ, ప్రజలకు గట్టి పట్టుదల ఉండేది. అలాగే జర్మనీలో ఇంగ్లండు, ఫ్రాన్సులమీద కసికొద్దీ రాజకీయంగా వ్యతిరేకప్రచారం, వేళాకోళం చేస్తూ చిత్రాలు తీసేవారు. కాని కొన్నాళ్ళయేసరికి జర్మనీలో కేవలం ప్రచారచిత్రాలే కాక మంచి మంచి చిత్రాలుకూడా తీస్తున్నారు అని ఆనోటా ఆనోటా ఇతర దేశాల్లో డిస్ట్రిబ్యూటరు, ఎగ్జిబిటరు పనికట్టి అవి తెప్పించి ప్రదర్శించటం మొదలుపెట్టారు. మొదట్లో అవి ఏ దేశానివో చెప్పకుండా చూపించారు. తరవాత అవి వెనిస్ చిత్రాలనీ, స్కాండినేవియన్ చిత్రాలనీ చెప్పి చూపించారు. నిజానికి అవన్నీ జర్మన్ చిత్రాలే.


ఇలా దొడ్డిదారిన తీసుకొచ్చి చూపించిన చిత్రాల్లో "కాబినెట్ ఆఫ్ డాక్టర్ కాలిగరీ" అదొకటి. సార్వకాలిక ఉత్తమ చిత్రాల్లో ఇది ఒకటని బ్రుసెల్స్ విమర్శకులు నిర్ణయించారు.

ఈ చిత్రం 1919 లో వెలువడింది. దర్శకుడు రాబర్ట్ వీన్. ఆరోజుల్లో 'ఎక్స్‌ప్రెషనిజం' జర్మనీలో మంచి ఊపుల్లో ఉంది. ఇది వాస్తవిక వాదానికి విరుద్ధమైనది. దీన్ని విశేషాభివ్యక్తివాదమని అనవచ్చును. అంటే వస్తువును యథాతథంగా చూపించటం కాక, వస్తువును చూచినప్పుడు కళాకారుడిలో కలిగే ఉద్రేకాలనే చూపించటమన్నమాట. ఈ పద్ధతి పిచ్చివాళ్ళని గురించిన కథల్నీ, దెయ్యాల కథల్నీ, జానపదకథల్నీ సినిమా తీయటానికి బాగా పనికొస్తుంది. అందుకని ఆరోజుల్లో జర్మనీలో ఇలాంటి చిత్రాలు కుప్పతెప్పలుగా తయారయ్యాయి. ఇవన్నీ పరమ చెత్తగా ఉండేవనటంలో సందేహం లేదు. కాని ఈ చెత్తలోంచే మణిపూసలాగా "డాక్టర్ కాలిగరీ" చిత్రం వెలువడింది.

ఈ చిత్రాన్ని యూరప్‌లో మొదట చూపించినప్పుడు ప్రేక్షకులు నిర్ఘాంతపోయారు. "ఏమిటీ విచిత్ర చిత్రం! ఇది మన్ని ఎందుకింత బాధపెట్టేసింది?" అని మథనపడి రోజుల తరబడి మనశ్శాంతి లేకుండా చేసుకున్నారు. దాదాపు పదేళ్ళపాటు ఈచిత్రం యూరప్, అమెరికాలలో నిర్మాతల్నీ, దర్శకుల్నీ దెయ్యంలాగ వెంటాడింది.

ఇందులో కథ చాలా చిన్నది. డా॥ కాలిగరీ అనే విచిత్ర వ్యక్తి ఉంటాడు. అతను నిద్రలో నడిచే అలవాటుగల ఇంకొక వ్యక్తిచేత హత్య చేయించటానికి ప్రయత్నిస్తాడు. సినిమా చివర్లో ఈ కథంతా ఒక పిచ్చివాడి ఊహాగానమని బయటపడుతుంది. పిచ్చివాడి ఊహాగానాన్ని చిత్రించే చిత్రం ఎంత విచిత్రంగా ఉంటుందో చెప్పక్కరలేదు గదా. పిచ్చివాడి పగటికల అని తెలిసిన తర్వాత 'అమ్మయ్య' అని ప్రేక్షకులు ఏదో బరువు దిగిపోయినట్టు తేలికపడతారు. కాని అక్కడిదాకా కుర్చీలకు అంటుకుపోయి దిగ్భ్రాంతులై ఊపిరి బిగపట్టి చూడవలసిందే.

ఈ చిత్రంలో ఉపయోగించిన టెక్నిక్‌ను



సార్వకాలికమైన ఉత్తమ జర్మన్ చిత్రం "కాబినెట్ ఆఫ్ డా॥ కాలిగరీ"లో ఒక దృశ్యం.

లాగే ఉన్న సర్కస్ మేనేజరు కలుస్తాడు. పదిహేడేళ్ళ కిందట పులిచేతులో పడ్డప్పుడు అతడికో కన్నుపోయింది. జింబో దగ్గర ఏదో నిధి ఉందని విని అని కౌజెరూ లనే ఆశతో తనుకూడా వెదకటానికి వస్తాంటాడు. ఇంకా కొందరు కలిసి అంతా జట్టుగా అప్పుడే జింబో న్వేషణకు బయలుదేరుతారు.

జింబో వారి కంటబడతాడు. "నువ్వు నా సోదరుడి కొడుకు"అని లీల చెప్పినప్పుడు మామయ్యా, "మాతో వచ్చేసేయ్"మని లీలా ఎంత చెప్పినా జింబో వారి తెలుగు'బాష' అర్థంకాకనో, అక్కడే పిచ్చెక్కి తిరుగుతున్న అతని తల్లి (అని ఎవరికీ తెలియదు) "వద్దు. వీళ్ళంతా దగాకోరు" అని చెప్పటం వలనో వాళ్ళమాట వినడు. అతని మెడలో తాయెత్తు చూసి అందులో నిధిరహస్యం ఉందని గ్రహించిన సర్కస్ మేనేజరైన విలన్ తుపాకీతో జింబోను కాల్చబోతాడు గాని లీల అడ్డుపడుతుంది. పరిమిలా లీలమీద ఉన్న ఒక్క కన్నూ వేసి ఉంచిన విలను ఆమెను చెరచబోతుండగా జింబో వచ్చి తంతాడు. అక్కడితో ఊరుకోక, ఆమెను తన ఇంటికి ఎత్తుకుపోతాడు. అతడూ లీలా ప్రేమించుకుంటారు. అతడు అడవిలో ఉంటున్నా అతనివద్ద ఆడపిల్ల తొడుక్కోదగిన రెడీమెడ్ అరణ్యాగుస్తు ఉన్నందువల్ల సెక్స్ అప్పీలుకోసం లీల తన పట్నవాసం బట్టలు విప్పేసి అది తొడుక్కుంటుంది. అతడూ (పి. బి. శ్రీనివాయస్) ఆమె (సుశీల కంఠం) (టార్)జాను తెనుగులో యుగళగీతం పాడతారు. ఆమె బట్టలు చింపంజీ ద్వారా ఆమె మామయ్యకు దొరుకుతాయి.



శ్రీ సరళచిత్ర తీస్తున్న మొదటిచిత్రం ప్రారంభోత్సవనాటి ఫొటో: ఈ చిత్రానికి దర్శకుడు శోభనాద్రిరావు, నిర్మాత అమరనాథ్.

బట్టలు దొరికి మనిషి దొరక్కపోవటంతో ఆమె ఏ 'స్థితి'లో ఉందోనని కంగారుపడి మామయ్య ఆమెకోసం అడవంతా గాలిస్తాడు.

ఇలాగ కథ అరణ్యమార్గాలుపట్టి తిరుగుతుండగా అరణ్యరాణి మహామాయ వీళ్ళందర్నీ, జింబోనూ కోనులో పెట్టి బంధిస్తుంది. జింబోపై ప్రేమ వెలడిస్తుంది. అతను నిరాకరిస్తాడు. ఆమెకు కోపం వచ్చి జింబోను తప్ప మిగతా వాళ్ళందర్నీ బలి యివ్వమని సేవకులకు ఆజ్ఞ ఇస్తుంది. జింబో కూత వేసి కూతవేటుదూరంలో ఉన్న తన ఏనుగు సైన్యాన్ని రప్పిస్తాడు. ఏనుగులు వచ్చి హాలీవుడ్ మార్కు బాబిలోనియన్ సెటింగులన్నిటినీ కసిగా ధ్వంసంచేసి మహామాయను, ఆమె ప్రజల్నీ చంపేస్తాయి.

జట్టువాళ్ళు సురక్షితంగానే ఉంటారు గాని విలన్ జింబో తాయెతును సంగ్రహించాలని తుపాకీతో చంప యత్నిస్తాడు. ఆ సమయానికి పిచ్చిదిగా తిరుగుతున్న జింబో తల్లి అడ్డువచ్చి గుండు దెబ్బ తిని మరణిస్తుంది. మరణించేముందు ఆమెకు తెలుస్తుంది జింబో తన కొడుకేనని. ఆమె తన తల్లి అనిగాని, తన జన్మగాథగాని జింబోకు అర్థమైందో లేదో మనకర్థం కాదుగాని అతను తన పెత్తండ్రి మాట వినకుండా, పట్నవాసానికి రాకుండా వెళ్ళిపోతాడు. చింపంజీ చేతి తరుమబడుతున్న విలన్ కొండమీంచి పడి మరణిస్తాడు అతడు జింబో నుంచి లాక్కున్న తాయెత్తు, అందులోని 'సౌందర్య భాగ్యాలా' కూడా మరణిస్తాయి.

జింబోను ప్రేమించిన లీల "నేను మీతో రాను. పతి చరణాలవద్దనే గదా స్త్రీ జీవితము" అని ఒక కొటేషన్ పారేసి జింబో యింటికి వెళ్ళిపోతుంది. ఆమె అలా వెళ్ళి



పినుశిలావారి "శ్రీకృష్ణ పాండవయుద్ధం"లో ఒక దృశ్యం.

జింబో

పోతుంటే ఆమె పెంపుడు మామ (జింబో పెత్తండ్రి) చూస్తూ ఊరుకుని, కలకత్తాకు మరలిపోతాడు. బహుశా "సన్ ఆఫ్ జింబో" తీస్తే అందులో తిరిగి కనిపించవచ్చు.

ఈ ఆటవిక చిత్రాన్ని హిందీలో బసంత్ పిక్చర్సువారు తీశారు. నిర్మాత, దర్శకుడు హోమీవాడియా. తెలుగు నిర్మాణం మద్రాసు, ఫిలిం సెంటరువారు. తెలుగులో మాటలకు పాటలకు బాధ్యులు శ్రీశ్రీ. పాటలు చాలా చక్కగా ఉన్నాయి. సంగీత దర్శకుడు చిత్రగుప్త వినసొంపైన సంగీతం సమకూర్చాడు. ముఖ్యంగా "ఈ కథ యిది కలకాదు—ఈ ప్రణయము విడరాదు" అనే పాట సుశీల అద్భుతంగా పాడింది. ఇతర గాయకులు పి.బి. శ్రీనివాస్, జమునారాణి, పి. నాగేశ్వరరావు మున్నగువారు.


టార్జానపద చిత్రాల ఫక్కీకి మక్కీగా తీసిన ఈ చిత్రంలో ఆజాద్ జింబోగా బాగా నటించాడు. జానీ వీజ్ ములర్, లెక్స్ బార్కర్ లంత 'టార్జాను బాహుడు' కాకపోయినా ఆజాద్ దర్శనీయుడుగా ఉన్నాడు. లీలగా చిత్ర, మహామాయగా కృష్ణకుమారి నటించారు.

ఈ నెల 12వ తేదీన ఆంధ్రలో విడుదలైన ఈ (సు)వర్ణచిత్రం బాగా ఆర్థిక విజయం పొందుతుందని అనుమానించవచ్చును. ★

"వచ్చిన కోడలు నచ్చింది"

సుధాకర్ ఫిలిమ్సువారు నిర్మిస్తున్న సాంఘిక చిత్రం పూర్తికావచ్చింది. దీనికి "వచ్చిన కోడలు నచ్చింది" అని పేరు పెట్టారు. ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, జమున, కన్నాంబ, రేలంగి, సూర్యకాంతం, రాజబాల, సి. ఎస్. ఆర్., వర్మ మొదలగువారు నటిస్తున్నారు. మాటలు, పాటలు ఆత్రేయ రాశారు. సంగీతదర్శకుడు దక్షిణామూర్తి. నృత్యదర్శకుడు వసుమూర్తి కృష్ణమూర్తి. కామెరామన్ ప్రసాద్. దర్శకుడు యోగానంద్.

కాంతారాం కొన్నేళ్ళక్రితం నిర్మించిన "అద్మీ" చిత్రం కథ ఆధారంగా ఈ చిత్రం తయారవుతోందని తెలుస్తోంది.



సాక్రటీస్ పాత్ర ధరించిన శ్రీ కృష్ణస్వామి విషపానీయం స్వీకరిస్తున్న దృశ్యం.

"సోక్రటీస్"
నాటక ప్రదర్శనం

జనవరి 29-వ తేదీ గురువారం నాడు ఆవడి లోని ఆర్డినెన్స్ డిపో (206 బేస్) సివిలియన్ ఉద్యోగులు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ సమక్షంలో "సాక్రటిస్" నాటకం ప్రదర్శించారు. రక్షణశాఖ మూడు విభాగాలలోని ఉద్యోగులు దాదాపు 200 మంది ప్రదర్శనానికి హాజరైనారు. గ్రీక్ తత్వవేత్త సాక్రటిస్ విషాద జీవితగాథ అందరికీ తెలిసిందే. శ్రీ ఆర్. జగన్నాథన్ దీన్ని నాటకంగా రచించారు; అంతేగాక, నాటకంలో దుష్టబుద్ధి మిలిటస్ పాత్రనుకూడా ధరించారు. సివిలియన్ కార్మిక శాఖోద్యోగి శ్రీ ఎన్. కృష్ణస్వామి సాక్రటిస్ పాత్ర నిర్వహించారు. కథా నాయకుడు సాక్రటీస్ విషం స్వీకరించే దృశ్యంలో శ్రీ కృష్ణస్వామి నటనా సామర్థ్యం ప్రేక్షకుల మన్ననల నందుకున్నది. ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ కు చీఫ్ ఆర్డినెన్స్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎం. ఎం. కురియాకో స్వాగతంచెప్పి పూలమాలాలంకృతులను చేశారు. కుమారి ఆర్. ఎస్. శకుంతల కథానాయికి పాత్ర అభినయించింది. ఆయా సన్నివేశాలలో చక్కగా నాట్యంచేసింది. ★



కుమారి ఆర్. ఎస్. శకుంతల.

వనితా వాణి

[54-వ పేజీ తరువాయి]

విషయాల్ని కోడండ్రకు నేర్పేవారుగా తయారవ్వాలి. ఈ విషయాన్ని అమలులో పెట్టటానికి భర్తలు, భార్యలకు సహృదయంతో తోడ్పడాలి.

అపహాస్యం, హేళనచేసే మహిళలు, ఆపరేషన్ చేయించుకొన్న ఆడది గౌరవహీనురాలుకాదు అన్న విషయం గట్టిగా జ్ఞాపకముంచుకోవాలి. ఇందిరా రాజ్ వ్రాసిన ఈ వ్యాసంతో, వనితాలోకంలో తీవ్రసంచలనం కలగాలనీ, ఆసంచలనమే నవభారత నిర్మాణానికి దోహదమివ్వాలని ఆశిస్తున్నాను. ఆదర్శ సంస్కరణలను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి మంచి వ్యాసాన్ని వ్రాసినందుకు "రాజ్"గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

* * *

బోయిన సుశీలగారు వ్రాసిన, "ఆఁ అమాత్రం రాయడానికేం" అన్న వ్యాసం గూడా చక్కగావుంది. ఇటువంటి అమూల్య వ్యాసాలకు "వనితాలోకం"లో స్థానం ఇవ్వడం వనితల అదృష్టం.

సత్యవతీ సీతారామ్. కొటూరు.

* * *

ఎమ్. హేమలతగారు వ్రాసిన "ఒక్కగానొక్క పిల్ల" అన్న వ్యాసము చాల బాగుంది.

గారాబంగా పెరిగినవాళ్లే పుట్టింట్లో పని మనుషులు వుండవచ్చును. వాళ్లు గారాబంగా చిన్నప్పటినుండి పెరుగుతారు గనుక, పెద్దయాక పనిచేతగాకుండా అవుతుంది. పుట్టింట్లో పనిమనుషులుంటే అత్తవారింట్లోకూడ ఉండొద్దూ మరి!

ఇక్కడ ఎంత గారాబంగా పెరిగినా అత్తవారింట్లో పని చేయకుంటే ఎవరూరుకుంటారు?

పాపం! వాళ్లకు పనిచేయడం అలవాటు లేదుగా. అత్తగారు చెప్పినపనులు చేయడానికి చేతగాక ఏడ్చేవాళ్లుకూడ ఉన్నారు.

మా బంధువుల్లో ఒకామె ఉంది. ఆవిడ గారు తల్లిదండ్రులకు గారాబుపట్టి. పుట్టింట్లో ఇటున్న చెంబు అటు పెట్టి ఎరుగదు. అత్తవారింటో నీళ్లు చేదమంటే అలవాటులేక చేతులు బొబ్బలొచ్చాయట చిన్నప్పటినుండి అంత సుకుమారంగ కాపాడుకున్న చేతులు అత్తవారింటికొచ్చేసరికి ఈ విధంగా అయింది. దీంటో తల్లిదండ్రుల తప్పు చాల ఉంది. బిడ్డలు ఆవిధంగా కష్టపడటానికి బాధ్యులెవ్వరు?

కనుక తల్లిదండ్రులు బిడ్డపై ఎంత గారాబంచేసినా పనిపాటలయందు మాత్రం శ్రద్ధ అవసరం.

కొందరమ్మాయిలు తల్లి పనిచెప్పినా "బాబోయ్! నాకు చేతకాదమ్మా. నాకు హోంవర్కు ఉంది, చదువుకోవాలి" అని తప్పించుకుంటారు. అటువంటివాళ్లు అత్తవారింట్లో అనుభవించి "అమ్మ చెప్పిన మాటలు వినకపోయితినే" యని విచారిస్తారు. కాని "చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే" ఏం లాభం? పుట్టింట్లో పనిపాట నేర్చుకొంటే అత్తవారింట్లో సులభంగా చేయగలుగుతారు. అత్తవారింట్లో మెప్పు పొందుతారు.

పని రాకుండా ఉంటుందా? అనేరు సుమా. ఆదరాబాదరా పనిచేసి మేము పని చేశాం అంటారు. పని చేయడంలో కూడ ఓర్పు, నేర్పు ఉండాలి. పని సరిగా చేయకపోతే అటు అత్తగారు. "మా కోడలుకు ఏ పనీ సరిగా చేతకాదు" అని ఈసడించుకుంటుంది. ఇటు ఆడబిడ్డలు హేళన చేస్తారు. "మా వదిన సుకుమారంటూ." అత్తగారి ఈసడింపులకు, ఆడపడుచుల హేళనలు చేసుంటే బాధపడేకన్న పుట్టింట్లో అన్నిపనులు నేర్చుకొని, అత్తవారింట్లో సక్రమంగా చేస్తె ఏ బాధలేక ఉంటారు. అటు అత్తవారికి సుఖం ఇటు వీళ్లకుకూడ ఎంతో శ్రేయస్కరం.

బిడ్డల గారాబం పుట్టింట్లోవారికే ముద్దుగాని, అత్తవారికేమి ముద్దు. "ఎద్దుపుండు కాకికి ముద్దా" అన్న సామెతలా గవుతుంది. అందుకొరకు గారాబంగా పెరిగిన అమ్మాయిలకు చెప్పేదేమనగా, గారాబమంతా పుట్టింట్లో కట్టిపెట్టి అత్తవారింటికి వెళ్తున్నామని దృష్టిలో నుంచుకొని వెళ్ళాలి. గారాబమంతా పుట్టింట్లోనే కాని అత్తవారింట్లో ఏమి సాగదని తెలుసుకోవాలి. గారాబంగా పెరిగినవాళ్లు పని చేసుకోవడంలేదా అని అనేరు. నేను చూసిన నిదర్శనాలే వ్రాశానండోయ్!

కె. రాధారాణి, కరీంనగర్.

* * *

వనితాలోకంద్వారా విజ్ఞాన విషయములన్ని తెలియజేస్తున్నందులకు ఆంధ్రపత్రికకు అభినందనములు.

ఈ వారం వనితాలోకంలో ప్రచురింపబడిన "కుటుంబ నియంత్రణలో "పెద్దవాళ్ల ప్రతిబంధకాలు" అనే వ్యాసము చాల బాగున్నది. ఇప్పుడు ప్రతిఇంటా జరుగుతున్న సమస్యలను శ్రీమతి బి. ఇందిరారాజ్ గారు చక్కగా తెలియజేశారు. ఆమెకు నా అభినందనములు తెలియజేస్తున్నాను. ఇంకా యిలాంటి వ్యాసములే వనితాలోకంద్వారా తెలియజేస్తారని ఆశిస్తున్నాను.

ఎం. కుమారి. మద్రాసు.

బి. ఇందిరారాజ్ (కర్నూలు) వనిత ముంగుచూపు, వ్యాసంకింద రాసిన పెద్దవాళ్ళ, ప్రతిబంధకాలూ, బాగారాసేరు. బోయిన సుశీలగారు కూడా, 'ఆ, అమాత్రం రాయడానికేం,' అనే వ్యాసం, చక్కగా రాశారు. ఇలాంటి, ఉత్సాహపరిచే వ్యాసాలు ఇకముందుకూడా రాస్తారని ఆశిస్తున్నాను. అడవి కోలను పార్వతిగారు వస్తుప్రదర్శనం వ్యాసం, బాగా రాశారు. మనం, దగ్గరుండి చూసినట్లుగా అనిపించింది ఆ వ్యాసం, చదువుతూ వుంటేను. వారికి నా అభివందనలు.

శ్రీమతి అబ్బులు. ఖరగ్ పూర్.

* * *

సి. ఉత్తరగారు వ్రాసిన ముందు చూపు వ్యాసం చాలా బాగుంది. కుటుంబ నియంత్రణం చాలా అవసరమని, గవర్నమెంటు వారు గుర్తించి, దానికి తగిన సదుపాయాలన్ని ఉచితంగా చేస్తున్నారు. ఈ విషయాలు తెలియని ప్రజలందరి నిమిత్తం రేడియోలద్వారాను, ఇంకా యితర విధాలుగానూ, ప్రచారంచేస్తున్నారు. ఈవిషయం మీద, యింత శ్రద్ధతీసుకుని, కృషిచేస్తున్నందుకు, మనమంతా చాలా సంతోషించవలసినది.

ఈ పరిస్థితిలో, వి. పాప గారు దానికి విరుద్ధంగా, 7-1-59 తేది ఆంధ్రపత్రిక (వనితావాణి)లో వ్రాసినారు. ఆవిడ యేమీ ఆలోచించకుండా, విమర్శించడమే పనిగా పెట్టుకొని వ్రాసినట్లుంది. వారికి తెలిసిన వారెవరో ఒక బిడ్డవుండగా ఆపరేషన్ చేయించుకున్నారుట. 5,6 నెలలలో, ఆ బిడ్డ చనిపోయిందిట. (ఒక్కపిల్ల వుండగా ఆపరేషన్ చేయించుకోమని యెవరూ చెప్పడంలేదు. అలా చేయించుకోవడం అనవసరం.)

ఇంకొకరు, నలుగురు పిల్లలున్నారని ముందు చూపుచూస్తే, ఒక పిల్లవాడు చనిపోయేడుట. మరొక పిలవాడు, జబ్బుగా వున్నాడుట. ఎందుకు ముందు చూపు చూసేమా అని వారు విచారిస్తున్నారుట.

అలాగ విచారించడం అనవసరం. ఆపరేషన్ చేయించుకోడానికీ, పిల్లలు పోవడానికీ సంబంధమేమిటి? ఆపరేషన్ చేయించుకోని వారిలో మాత్రం, కొందరికి పిల్లలు పోవడం లేదా? ఆపరేషన్ చేయించుకోని వారి పిల్లలికి జబ్బులు రావడంలేదా?

నలుగురు పిలలున్నవాళ్ళు ఆపరేషన్ చేయించుకొన్నాక, నలుగురు పిల్లలూ, ఒకళ్ళ, తర్వాత, మరొకరు చొప్పున చనిపోతారనుకోండి అప్పుడేం చేస్తారు? అని శ్రీమతి పాపగారు అడగవచ్చును. పెరిగి పెద్దవాళ్ళైన నలుగురు బిడ్డలూ, ఒక మారే చనిపోయినపక్షంలో, తర్వాత పుట్టబోయే పిలలుమాత్రం బ్రతుకుతారని నమ్మకమేమిటి?

ఆర్. హేమాదేవి, ఢిల్లీ ★

(35-వ పేజీ తరువాయి)

కాదంటే కాదు. ఈ శుభసమయంలో నన్నెవరూ అభినందించరేం?—నాబొంద. పిచ్చివాడిని ఎవరు అభినందిస్తారు;...అవును ...నేను పిచ్చివాడినే. అందుకే అందరూ నామీద కాల్చిపారేసిన సిగరెట్ పీకలు, రాళ్ళు విసిరేస్తారు...ఆఁ...బైదిబై నాకు ఇవ్వాళ్లి కడుపునిండా అన్నం పెడతారు కదూ" అన్నాడు పిచ్చివాడు.

"ఓ...తప్పకుండా" అన్నాడు శర్మ...

రాత్రి భోజనాలు అయినాయి. పిచ్చివాడు భోజనం అయినంతసేపూ ఏదో ఒకటే మాట్లాడుతూనే వున్నాడు. శారద హృదయం కొంత సంతృప్తితో, కొంత ఆందోళనతో త్రొక్కిసలాడుతున్నది. శర్మకు పిచ్చివాడిమీద ఏదో తెలియని సానుభూతి కలుగుతున్నది. భోజనాలు అయిన తరువాత పిచ్చివాడు సొమ్మసిల్లినట్లు పడుకున్నాడు. మరికొంత సేపటిలోనే పిచ్చివాడిని గాఢంగా నిద్ర ఆవరించింది. శర్మకు అతణ్ణిగూర్చి సరిగ్గా ఆలోచించడానికి సమయం దొరికింది. శారద ఏదో అల్లుకుంటూ కూర్చుంది.

"సందేహం లేదు—సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రిందట ఇతణ్ణి చూశాడు తను. ఇతనికి రావాల్సిన ఉద్యోగాన్నే తను సిఫార్సులతో సంపాదించాడు. ఆరోజు ఆ ఉద్యోగం ఇతనికి దొరికివుంటే, తను ఇప్పుడున్నంత హోదాలోనే వుండేవాడు కదూ. పాపం, తరువాత మరే ఉద్యోగం కూడా దొరకలేదేమో! ఇతనంటున్న శారద ఎవరో! గాఢంగా ప్రేమించి—వుంటాడు. ఆమె కూడా ఇతనికి అందని సందర్భంవల్ల మతి చలించివుంటుంది. అప్పుడే బ్రతకడమెందుకు? అన్న ప్రశ్న ఎదురైవుంటుంది. పుట్టడం, బ్రతకడం, చావడం అనే మీమాంస కూడా అప్పుడే కలిగివుంటుంది. అనే తర్క వితర్కంలోకి దిగాడు శర్మ. "ఇతనిలా పిచ్చివాడవడానికి తను కారకుడు కాడుగదా?" అని ప్రశ్నించుకున్నాడు. 'కా'దని సమాధాన పరచుకోడానికి ధైర్యం చాలలేదు. కిటికీలోంచి వర్షపుజల్లు మీదపడడంవల్ల శర్మ ఆలోచనలకు అంతరాయం కలిగింది. లేచి కిటికీ రెక్కలు మూసివేశాడు. పత్రిక తీసుకొని కూర్చుంటూ అల్లుతూ కూర్చున్న శారద వంక చూశాడు. ఆమెకూడా దేన్నిగురించో ఆలోచిస్తున్నట్టు తోచింది శర్మకు. ఆమె అల్లికపనికూడా మందగించి జరుగుతున్నట్టు గుర్తించాడు. "దేన్ని గురించి ఆలోచిస్తున్నావో?" అనుకున్నాడు. ఈ విషయాల నుండి మనస్సును మళ్ళించడానికి నేమో పత్రిక తెరిచాడు.

బైట వర్షం కుండపోతగా పడుతున్నది. దానికి తగినట్టే ఈదురుగాలి వీస్తున్నది. శారద చిట్టిబాబుకు బ్లాంకెట్ కప్పి పక్కనే పడుకుంది. కలత చెందిన మనస్సు నిదరపోనీయలేదు. అయినా కళ్ళు మూసుకునే పడుకుంది.

డ్రాయింగు రూములో పడుకున్న పిచ్చివాడికి మెలకువ వచ్చింది. ఒకసారి తలంతా బరుక్కున్నాడు. ఏం బుద్ధి పుట్టిందో ఏమో హాలులోకి వచ్చి పచార్లు చేస్తున్నాడు. ఇంట్లో నుంచి వెళ్ళిపోదామనేమో గేటుదాకా వెళ్ళాడు. గేటుకు తాళంవేసి వుండటంవల్ల అక్కడే చతికిలపడి కూర్చున్నాడు-వర్షంలో తడుస్తూ. వర్షం ధారాళంగానే పడుతున్నది. చలితో ఒణికిపోతున్నాడు. అయినా అక్కడినుంచి కదల్లేదు. ఉండి ఉండి ఎందుకో పకపక నవ్వేశాడు. పత్రికా పఠనంలో వున్న శర్మ ఆ నవ్వుకు త్రుళ్లిపడి, హాలులోకి వచ్చి లైటు వేశాడు. చరచరా వెళ్ళి పిచ్చివాడిని వాటేసుకుని ఇవతలికి తీసుకువస్తూ "శారదా, శారదా" అని పిలిచాడు. అప్పుడప్పుడే కునుకుపడుతున్న శారద ఆదుర్దాగా లేచి వచ్చింది. "తొందరగా ధోవతీ. చొక్కా తీసుకురా" అన్నాడు. ఆమె మరుక్షణంలోనే అవి తీసికొనివచ్చి మళ్ళీ లోనికి వెళ్ళింది. శర్మ పిచ్చివాడిచేత బలవంతాన బట్టలు మార్పించాడు. శారద తువాలు తీసుకువచ్చి "తల తుడుచుకోండి" అని ఇవ్వబోయింది. "అబ్బే నాకెందుకూ?" నిర్లిప్తంగా అన్నాడు పిచ్చివాడు. శర్మ తువాలు అందుకొని తుడవబోయాడు. పిచ్చివాడు తుడవనీయకుండా చేతులు అడ్డుపెటి, తల అడ్డదిడ్డంగా తిప్పాడు "నీవు తుడు శారదా, నేను పట్టుకుంటాను" అన్నాడు శర్మ. ఆమె సందేహించింది. శర్మ ఆజ్ఞాపిస్తున్నట్టు ఆమెవంక చూశాడు. ఆమె తల తుడిచింది. నుదుటికి కట్టిన కట్టంతా తడిసిపోవడంవల్ల విప్పివేసింది. పిచ్చివాడు మళ్లీ పడుకొని చలికి ఒణికిపోతున్నాడు. శారద లోపలి నుంచి దుప్పటి తెచ్చి శర్మకందించి వెళ్ళింది. పిచ్చివాడికి దుప్పటి కప్పి కొంతసేపు అక్కడే కూర్చున్నాడు శర్మ.

పిచ్చివాడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. మెలకువవచ్చి మళ్ళీ వర్షంలోకి వెడతాడేమో గదితలుపులు బైటకు బంధించి శర్మ తనగదిలోకి వెళ్ళాడు. శారద చిట్టిబాబు ప్రక్కనే పడుకొనివుంది. శర్మ లైటుతీసి వేయబోతూ ఆమెముఖంలోకి చూచాడు. ఆమె ఏడ్చిఏడ్చి పడుకుందేమో చెక్కిళ్ళమీద కన్నీటి చారికలు కనిపించాయి. అవి అతని మెదడులో మళ్లీ ఆలోచనల్ని కదిపాయి. అతను లైటుతీసి తన పక్కమీదకి వెళ్లాడు.

"శారద ఎందు కేడ్చిందో? తను పిచ్చివాడిని తీసుకురావడం కష్టం కలిగించిందేమో? అయినా. ఇంతమాత్రానికే ఏడ్వాల్సిన అవసరం ఏముంది? ఉహూ.... ఆమె మనస్సులో ఏదో బాధ పడుతున్నది. పిచ్చివాడు ప్రేమించిన శారద ఈమె కాదు కదా? అయితే ఈ విషయం తనకు తెలుపకుండా ఎలా దాచుకోగలిగింది? పిచ్చివాడు శారదను ఇవాళే తనతో ఇంటికివచ్చినప్పుడే చూసినట్టు మాట్లాడాడు. పోనీ పిచ్చివాడు మతి చలించినవాడు కాబట్టి పూర్వస్మృతి లేక శారదను గుర్తుపట్టక పోవచ్చు. మరి శారద అతణ్ణి పోల్చుకోలేక పోయిందా? ఉహూ... లేకపోతే ఇద్దరూ ఒకరినొకరు పోల్చుకొనే తెలియనట్టు నటిస్తున్నారా? ఒకవేళ శారద పిచ్చివాడు ప్రేమించిందే అయితే తనను తన స్వార్థపరునిగా, ద్రోహిగా అంతా భావిస్తారేమో! దేవుడు కూడా మన్నించడేమో? అయినా తెలియక చేసిన దానికి తను బాధ్యుడా? ఉద్యోగ విషయాలలో అనేక పోటాపోటీలు వస్తాయి. తన్మూలంగా ఒకరికి నష్టం కలుగవచ్చు. అంతమాత్రం చేత స్వార్థమనడం సమంజసమా?...నిజమే—తనది స్వార్థమే. ఆరోజు తను ఇంటర్వ్యూలో తప్పిపోయినప్పటికీ, శిఫార్సులతో ఒకరికిపోయే ఉద్యోగాన్ని

★ అన్వేషణ ★

తను సంపాదించడం స్వార్థం కాదూ! శారదా వివాహం సరైందే పెద్దవాళ్ళ ఇష్ట పూర్వకంగా, ముఖ్యంగా శారద అంగీకారంతోనేగా వివాహం జరిగింది. తనకు ఇష్టం లేకపోతే, చదువుకున్నది కాబట్టి "నేను చేసుకోను" అని తెగేసి చెప్పచ్చు గాక! ఏమిటి తనింత పిచ్చిగా ఆలోచిస్తున్నాడు, తను శారదను కోరుకున్నాడా! ఎంత ద్రోహం! అసలు అలాగ చేశాడా?" అనే ఆలోచనలు, సందేహాలు రేగుతున్నాయి.

తెల్లవారింది. వర్షం, గాలి తగ్గిపోయి, ఒక విషాదఘట్టం జరిగిపోయినట్టుగావుంది వాతావరణం. శర్మ పిచ్చివాడిని లేపటానికి గదితలుపు తెరిచాడు. పిచ్చివాడు మూలుగుతున్నాడు. శర్మ పిచ్చివాడిమీద చెయ్యి వేశాడు. ఒళ్ళు మసిలిపోతున్నది. ఎంత పిలిచినా పలక్కుండా గట్టిగా మూలుగుతున్నాడు పిచ్చివాడు. అతనికేంచేయాలో తోచలేదు. దబదబా ఇవతలికివచ్చి, "పిచ్చివాడికి ఒళ్ళు కాలిపోతున్నది శారదా! స్పృహలేకుండా పడివున్నాడు" అన్నాడు. శారద ఓ క్షణం స్తంభించిపోయింది. "నేను కార్లో వెళ్ళి డాక్టరుని తీసుకువస్తాను. కాస్త అతన్ని చూస్తుండు." అంటూ శర్మ ఆదుర్దాగా వెళ్ళిపోయాడు. శారద కొంతసేపటికి తేరుకొని డ్రాయింగురూములోకి వెళ్ళింది. పిచ్చివాడు కళ్ళు మూసుకుని మూలుగుతూనే వున్నాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అతని నుదుటిమీద చెయ్యివేసి "ఎంత దుర్గతి పట్టింది వేణూ" అని విలపించింది. ఆమె మాటలు కాని, ఏడుపుగాని వినే పరిస్థితిలో లేడతను. మరికొంత సేపటిలోనే శర్మ డాక్టరుతో వచ్చాడు. డాక్టరు వేణూ పరీక్షచేసి, "ఎందుకైనా మంచిది ఆసుపత్రిలో చేర్పించండ"ని డాక్టరు వెళిపోయాడు.

వేణును ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టరు చెప్పడం తడవుగా శర్మ, ఇంజక్షనులు, మందులు కొనితెచ్చాడు. శారదా శర్మల హృదయాలలో పిచ్చివాడిని గూర్చిన ఆందోళన ఎక్కువైంది. ఆసుపత్రిలో చేర్పినరోజు చిట్టిబాబును పెట్టుకొని ఆ దంపతులు అక్కడనే వుండిపోయారు. రెండు రోజులు దాకా మాటామంతీ లేకుండా వేణు మూలుగుతూ పడివున్నాడు. రోజూ సాయంత్రం శారద చిట్టిబాబును తీసికొని ఆసుపత్రికి వచ్చేది. శర్మ ఆఫీసునుంచి సరాసరి కారులో ఆసుపత్రికి వచ్చేవాడు.

నాలుగవ రోజు సాయంత్రం మామూలుగా శారద చిట్టిబాబును తీసికొని ఆసుపత్రికి వెళ్ళింది. వేణు కింకా స్పృహ రాలేదు. కాని మూడురోజులకంటే పరిస్థితి బాగుంది. శారద అతని తలవైపు కూర్చుని నుదుటి మీద చెయ్యివేసింది. జాలితో ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. రెండు కన్నీటి చుక్కలు అతనిమీద పడ్డాయి.

వేణు కళ్ళు తెరిచి ఒకసారి చుట్టూకలియ చూశాడు. ముప్పిరిగొన్న ఆనందంతో శారదను చూసి, "నువ్వా శారదా!...అబ్బ ఎన్నాళ్ళకు చూశాను...నాకిప్పుడెంతో హాయిగావుంది...వీడు నీ పిల్లాడేకదూ!... అదేమిటి ఏడుస్తున్నావా" అంటూ ఆమె గడ్డాన్ని పట్టుకున్నాడు.

"లేదు వేణూ...ఏడవడం లేదు. నీవు మళ్ళీ మనుష్యుల్లో పడినందుకు ఆనందిస్తున్నాను." అంది పమిటచెంగుతో కళ్ళుతుడుచుకుంటూ. ఇంతలో శర్మ అక్కడికి వచ్చాడు. పిచ్చివాడికి స్పృహరావడం చూసి 'తన శ్రమ ఫలించిందిగదా' అని సంతోషించాడు. వేణు కృతజ్ఞతతో శర్మకు నమస్కరించాడు. పిచ్చివాడి ధోరణి మారిపోయి మామూలుగా అందరిలా మాట్లాడటం శర్మకు మరింత సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. తను అతనికి చేసిన అన్యాయం తలపుకు వచ్చినప్పటికి సూటిగా వేణు ముఖంలోకి చూడలేకపోతున్నాడు. ఇంతలో డాక్టరు అక్కడికివచ్చి వేణును పరీక్షించి "మరింకేం భయంలేదు. కాని కొంత విశ్రాంతి అవసరం. రేపటికి పూర్తిగా కోలుకుంటాడు. ఇప్పుడే ఎక్కువగా మాట్లాడించకండి" అన్నాడు.

శారదా శర్మలు చిట్టిబాబుతో కార్లో ఇంటికి బయలుదేరారు. ఇద్దరు మౌనంగా వున్నారు. చిట్టిబాబు వేసే ప్రశ్నలకు ఇద్దరు పరధ్యానంగా సమాధానా లిస్తున్నారు.

ఆరాత్రి భోజనాలముందర కూడా మౌనంగానే గడచిపోయింది.

శారద అల్లిక ముందర వేసుకు కూర్చుంది. శర్మ పత్రిక తెరిచాడు. అతని కేమీ చదవ బుద్ధి పుట్టడంలేదు. ఆమె అల్లిక పనికూడా అంత మాత్రంగానే సాగుతున్నది.

శర్మ సిగరెట్ ముట్టించి "నేను పిచ్చివాడికి చాలా అన్యాయం చేశాను శారదా" అన్నాడు. శారద ఆశ్చర్యంతో భర్తవంక చూసింది.

"చెప్తే నన్ను అసహ్యించుకుంటావేమో!" అన్నాడు. ఆమె మౌనంగానే అతణ్ణే చూస్తున్నది.

"నాకీ ఉద్యోగం తెలివి తేటలవల్ల రాలేదు. కుతంత్రంతో పిచ్చివాడికి రావల్సిన ఉద్యోగాన్ని సంపాదించాను. ఇది చాలా అన్యాయంకదూ?" అన్నాడు శర్మ.

"ఇద్దరం కలిసి వేణుకు తీరని ద్రోహం చేశాం" అంది శారద.

"ఆఁ...అన్నాడు" శర్మ.

సమాధానంగా శారద తన వివాహానికి పూర్వపు సంగతులు వివరించింది.

"మనిద్దరం చేసిన అన్యాయానికి శిక్ష ఏమిటో?" అన్నాడు శర్మ.

"అతణ్ణి ఓ ఇంటివాణ్ణి చేయాలి."

"అతణ్ణి నా అంతటి హోదాగలవాడిగా చేయాలి".

ఇద్దరి హృదయాలూ తేలికపడ్డాయి.

మరునాడు మామూలుగా సాయంత్రం శారదా, శర్మలు చిట్టిబాబుతో ఆసుపత్రికి వెళ్ళారు. వేణు బెడ్ మీద లేకపోవడంతో ఇద్దరూ ఆదుర్దాగా డాక్టరు దగ్గరకు వెళ్లారు. ఆశ్చర్యంతో నర్సులూ, డాక్టర్లూ అంతటా వెతికారు. ఎక్కడా లేడు. "తలగడ క్రింద ఈ కవరు దొరికిం"దని ఒక నర్సు తెచ్చి శారద కిచ్చింది. కవరుమీద తన పేరు వుండటంచూసి, చదవమని భర్తకందించింది.

"శారదా!

నేను వెళిపోవడం మీ దంపతులకు ఆశ్చర్యంగానే వుంటుంది. మీ ఇద్దరివల్ల ఈవిధంగా పూర్వస్మృతి కలిగినందుకు ఎంతైనా కృతజ్ఞుణ్ణి. మన మెన్నో ఆశాసౌధాలు నిర్మించుకుంటాము. అవన్నీ పోయేప్పటికి మనంతటి దురదృష్టవంతులు లేరనుకుంటాం ఇది మానవసహజం. కొందరికి మతిభ్రంశంకూడా కలుగుతుంది. వారిలోని బలహీనతే కారణం అనుకుంటాను. ఇప్పుడు నాకు [illegible]లూ లేవు. ఒక్కటిమాత్రం భగవంతుణ్ని కోరుతాను—మీ దంపతుల్ని చిట్టిబాబునూ చిరకాలాలపాటు కాపాడమని—"బతకడమెందుకు" అనే ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు ప్రతివారికీ ఎదురౌతుంది. ఇప్పుడు నేను దీనిగూర్చి ఆలోచించను. సృష్టి, స్థితిలయాలకు మూలకారణమేమిటో, భగవంతుని చిద్విలాసం ఎలా వుంటుందో తెలుసుకుంటానికి వెడుతున్నాను. అంతే. మీరిద్దరూ నాకేదో అన్యాయం చేశామని బాధపడకండి. ఎవరి జీవితపరిణామం వారిదే కాని, ఒకరు ఒకరికి అన్యాయం చేశారనుకోడం పొరపాటని తలుస్తాను.

ఇట్లు,
నీ వేణు"

శర్మ ఉత్తరం చదవడం పూర్తిచేసేప్పటికి ఇద్దరికళ్ళల్లోనూ నీళ్లు నిండాయి.

"పిచ్చివాడు" అంది నర్సు.

"ఎవరు" అన్నాడు శర్మ.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



దున్నిన దుక్కి పండితే సంతోషం

—ఫొటో : ఏ. వి. రామమూర్తి]

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.